సంగీత మేరు శిఖరాలు
రూ॥ 120/-
పేజీలు: 138

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ,ఇతర కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకోవడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇది నిరసన తెలిపే ప్రజాస్వామ్య హక్కుపై జరిగిన దాడి. కేంద్ర ప్రభుత్వం నుండి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తున్న మన యువతకు కాంగ్రెస్ కుటుంబం, దేశం మొత్తం అండగా నిలుస్తుంది.
– సిఎం ఎ.రేవంత్ రెడ్డి

సంపుటి 09, సంచిక: 232 | బుధవారం | 22-07-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్

# మెరుపు ధర్నా



**ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఈడ్చుకెళ్లిన పోలీసులు**

**బలప్రయోగం చేయడంతో ముక్కు నుంచి రక్తం**

- పోలీసుల అదుపులోకి ఎస్‌పి అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ప్రియాంక గాంధీ సహా పలువురు కాంగ్రెస్ ఎంపిలు
- కాసేపు ధర్నాలో పాల్గొన్న రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే
- మూడు గంటల పాటు సాగిన ధర్నాలో బైఠాయించిన కర్నాటక, కేరళ ముఖ్యమంత్రులు

**మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలని, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**న్యూఢిల్లీ :** నీట్ ప్రశ్న పత్రం లీకేజీ వ్యవహారంపై ఢిల్లీలో ఆందోళన చేసిన విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నిరసనగా ప్రధాని మోదీ నివాసం ఎదుట మెరుపు ధర్నా చేసిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ సహా, అనేక మంది కాంగ్రెస్ ఎంపిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు మూడు గంటల పాటు ధర్నా తరువాత పోలీసులు రాహుల్‌గాంధీని పోలీసులు బలవంతంగా అక్కడ నుంచి తరలించేందుకు ప్రయత్నించారు. ఆయనను నేలపై పడుకొని ప్రతిఘటించారు. పెద్ద ఎత్తున వచ్చిన పోలీసులు ఆయనను లాక్కెళ్లేందుకు ప్రయత్నించగా, నేలపై పడుకొని తీవ్రంగా తరువాయి 8లో

శంభు సరిహద్దు వద్ద

# రైతుల అడ్డగింత





- ఢిల్లీ 'కిసాన్ మహా పంచాయత్'కు తరలివెళ్తుండగా పోలీసుల చర్య
- వందలాది మంది బారికేడ్లు దాటే యత్నం - పరిస్థితి ఉద్రిక్తం
- పోలీసుల అదుపులో నలుగురు రైతులు

**శంభు /అంబాలా:** దేశ రాజధాని ఢిల్లీలో 'కిసాన్ మహాపంచాయత్' ఆందోళనలో పాల్గొనేందుకు భారీ సంఖ్యలో హర్యానా రాష్ట్రం సమీపంలోకి రైతులు తరలిరావడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రతిపాదిత భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా కిసాన్ మహా పంచాయత్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న వందలాది మంది పంజాబ్ రైతులను మంగళవారం శంభు సరిహద్దు వద్దకు చేరుకోగానే హర్యానా పోలీసులు వారిని అడ్డుకున్నారు. పొరుగు రాష్ట్రంలోకి ప్రవేశించే మార్గంలో బారికేడ్లు, సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేయడం ద్వారా పోలీసులు ఈ చర్యకు పాల్పడ్డారు. దీంతో అక్కడ కొద్ది సేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. జిల్లాలో అంబాలా అధికారులు కూడా ఈ నిషేదాజ్ఞలు విధించారు. 'దేశ్ బచావో మోర్చా' ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో ఒకరోజు పాటు 'కిసాన్ మహా పంచాయత్' ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తమ సంఘాల జెండాలను చేతపట్టుకుని పంజాబ్ నలుమూలల నుంచి వందలాది రైతులు నిరసనలో పాల్గొనేందుకు బస్సుల్లో జాతీయ రాజధాని వైపునకు వెళ్లేందుకు శంభు సరిహద్దుకు చేరుకున్నారు. కానీ పోలీసులు వారిని హర్యానాలోకి ప్రవేశించేందుకు అనుమతించలేదు. పంజాబ్, హర్యానా సరిహద్దు వద్ద భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. హర్యానా ప్రవేశ ద్వారమైన ఘగ్గర్ నదిపై ఒకదానికి ఒకటి గొలుసులతో గట్టిగా కట్టివేసిన బారికేడ్లను ఏర్పాటుచేసి వాటర్ కెనాన్లను సిద్ధంగా ఉంచారు.అంబాలా పోలీస్ సూపరింటెండెంట్ అజిత్‌సింగ్ షెకావత్, ఇతర పోలీస్ అధికారులు పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఆ ప్రదేశంలోనే మకాం వేశారు.పెద్ద సంఖ్యలో రైతులు హర్యానాలోకి ప్రవేశించేందుకు రోడ్డును దాటేందుకు ప్రయత్నిస్తారని తరువాయి 8లో

## రాహుల్ అరెస్టు అప్రజాస్వామికం

- లీకేజీ వ్యవహారాన్ని నాన్చుతున్న కేంద్రం : కూనంనేని విమర్శ
- యువతతో పెట్టుకున్న బిజెపి ప్రభుత్వానికి దగ్గరపడిన రోజులు

ప్రజాపక్షం/హైదరాబాద్



నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ ఢిల్లీలో నిరసన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని బలవంతంగా అరెస్టు చేయడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. విద్యార్థులు, యువతపై బలప్రయోగం చేయడం, అక్రమ కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.'చలో పార్లమెంట్' కార్యక్రమంలో పాల్గొన్న వేలాది మంది విద్యార్థులు, యువతపై బాష్పవాయువు ప్రయోగించడం, లాఠీ ఛార్జ్ చేయడం, ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చకు తరువాయి 12లో

# బెదరని యువత

- దీక్షా శిబిరం పునరుద్ధరణ
- భారీగా జంతర్‌మంతర్‌కు తరలివస్తున్న జనం
- సంఘీభావం ప్రకటించిన అరవింద్ కేజ్రీవాల్, శరద్ పవార్





**న్యూఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) సోమవారం చేపట్టిన 'చలో సన్సాద్' ర్యాలీని అడ్డుకుని విద్యార్థులు, పార్టీ మద్దతుదారులపై పోలీసులు లాఠీచార్జ్ చేసినా, బాష్ప వాయువు గోళాలు ప్రయోగించానా అదరలేదు, బెదరలేదు. ఒక వైపు భారీ వర్షం కురుస్తున్నా, మరోవైపు పటిష్ట భద్రత ఉన్నప్పటికీ రాత్రంతా నిరసనకారులు జంతర్ మంతర్ వద్ద శిబిరం ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం ఉదయం, వలంటీర్లు నిరసన స్థలాన్ని శుభ్రం చేయగా, పోలీసుల చర్యలో గాయపడిన మద్దతుదారులకు సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే క్షమాపణ చెప్పారు. సోమవారం పోలీసులు టెంట్లు, ఇతర తాత్కాలిక ఏర్పాట్లను తొలగించిన తర్వాత నిలబడి ఉన్న ఏకైక నిర్మాణం అయిన వేదికను వలంటీర్లు శుభ్రం చేస్తుండగా, నిరసన ప్రదేశం చుట్టూ భారీ భద్రత కొనసాగింది. వేదికపై కప్పిన టెంట్ కూడా చిరిగిపోయిన స్థితిలో ఉంది. అయితే వందలాది మంది విద్యార్థులు, మద్దతుదారులు మళ్లీ జంతర్ మంతర్ వద్దకు తిరిగి వచ్చారు. పోలీసుల బలప్రయోగం తమ ఆందోళనను కొనసాగించాలనే సంకల్పాన్ని మరింత బలపరిచిందని వారు అన్నారు. నీట్‌యుజి పరీక్షలో జరిగిన తరువాయి 8లో



**07** సోనమ్ వాంగ్‌చుక్‌ను..ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించేందుకు 'ఢిల్లీ హైకోర్టు ఒకే'

## పోలీసు చర్యలపై పార్లమెంట్‌లో అమిత్ షా ప్రకటన చేయాలి

**వామపక్ష పార్లమెంటేరియన్ల బృందం డిమాండ్ ● జంతర్‌మంతర్ సందర్శన**

**న్యూఢిల్లీ :** సిజెపి నేతృత్వంలో సోమవారం చేపట్టిన 'పార్లమెంట్ మార్చ్' సందర్భంగా విద్యార్థులపై పోలీసు చర్యలకు సంబంధించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని వామపక్ష పార్లమెంటేరియన్ల బృందం డిమాండ్ చేసింది. విద్యా రంగంలో జరుగుతున్న అవకతవకలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు, వామపక్ష పార్లమెంటేరియన్ల బృందం మంగళవారం జంతర్ మంతర్‌ను సందర్శించింది. ఈ బృందంలో సిపిఐ రాజ్యసభ ఎంపి పి.సందోష్ కుమార్, సిపిఐ(ఎం) రాజ్యసభ ఎంపిలు జాన్ బ్రిట్టాస్, ఎఎ రహీమ్, వి.శివదాసన్, ఆ పార్టీ లోక్‌సభ ఎంపిలు అమ్రా రామ్, ఎస్. వెంకటేశన్ తదితరులు ఉన్నారు. నిరసనకారులను ఉద్దేశించి సందోష్ కుమార్ మాట్లాతూ ఢిల్లీ పోలీసులు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తారు కాబట్టి, పోలీసుల చర్యపై పార్లమెంటులో అమిత్ షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్షం కోరుకుంటోందన్నారు. 'అమిత్ షా పార్లమెంటుకు వచ్చి ఏం జరిగిందో వివరించాలి, ఎందుకంటే విద్యార్థులపై ఇంతటి అఘాయిత్యాలను భారతదేశం ఎన్నడూ చూడలేదు. 300 మందికి పైగా విద్యార్థులు గాయపడ్డారు. దీనికి బాధ్యులు ఎవరు? ఢిల్లీ పోలీసులు అమిత్ షా ఆధీనంలో ఉన్నారు, ఆయన దేశానికి సమాధానం చెప్పాలి. ప్రతిపక్షమంతా ఇదే కోరుకుంటోంది' అని ఆయన తరువాయి 8లో



## ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితా

- సిఇఒ సి.సుదర్శన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమానికి సంబంధించి ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా ఎన్నికల అధికారులకు, జిహెచ్ఎంసి కమిషనర్‌కు మెమో జారీ చేశారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు) ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఆగస్టు 3 వరకు నిర్వహించనున్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ కూడా అదే తేదీనాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. ముసాయిదా ఓటరు జాబితాను ఆగస్టు 10న ప్రచురించనుండగా, ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాలు, తరువాయి 12లో

## ముందస్తు ప్రణాళికతో ముందుకు



- ఎల్‌నినో ప్రభావం వ్యవసాయం, తాగు నీరు, విద్యుత్ రంగంపై పడకుండా కార్యాచరణ రూపొందిస్తున్నాం
- రైతులు నష్టపోకుండా తక్కువ నీటితో సాగుచేసే పంటలను ప్రోత్సహిస్తున్నాం
- ప్రజల తోడ్పాటుతో ఎల్‌నినో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటాం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజల తోడ్పాటుతో ఎల్‌నినో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇందుకు ఎల్‌నినో ప్రభావంపై ప్రజల్లో గ్రామీణ స్థాయి వరకు అవగాహన కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ముందుకు కొనసాగుతున్నామని వెల్లడించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో 'పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతల పెరుగుదల నుంచి తెలంగాణ సంసిద్ధత వరకు' అనే అంశంపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాతావరణం, జలవనరుల నిపుణులు, వాటర్ మెనేజ్‌మెంట్ రంగాలకు చెందిన పలువురు నిపుణులు తమ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రణాళిక, ఆర్థిక, వ్యవసాయ, నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖల అధికారులకు ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ఎల్‌నినో తరువాయి 12లో

# ద్రోహులను క్షమించను

**08**

- కోల్‌కత్తాలో జరిగిన భారీ ప్రదర్శనలో టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ
- ముఖ్యమంత్రి సువేందు అధికారి నిజస్వరూపం బయట పెడతానని హెచ్చరిక
- కాక్రోచ్ జనతాపార్టీ నిరసన ప్రదర్శనల్లో పాల్గొంటా
- నాకు ఎలాంటి అహంభావం లేదు
- బెంగాల్‌లో బిజెపిని ఓడించేందుకు అందరూ ఇండియా కూటమి కింద ఏకం కావాలని వినతి



# అట్టుడుకుతున్న ఢిల్లీ మోదీకి కాంగ్రెస్ షాక్

ప్రశ్నా పత్రాల లీకేజీ జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ పార్లమెంటుకు కూతవేటుదూరంలోని జంతర్‌మంతర్‌లో 44రోజులుగా ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడటానికి మనసురాని నరేంద్ర మోదీ ప్రభుత్వం, సోమవారం వారి 'పార్లమెంట్ మార్చ్' సందర్భంగా ప్రదర్శకులపై పోలీసుదాడులు జరిపించిన తీరు ప్రజాస్వామ్య ఉద్యమాలపట్ల ప్రభుత్వానికున్న విముఖభావాన్ని బాహాటపరిచింది. విద్యార్థులపై నీచమైన, ఘోరమైన లాఠీఛార్జి, బాష్పవాయువు గోళాలు ప్రయోగించటంపై చర్చకు ప్రభుత్వం నిరాకరించిన కారణంగా ప్రతిపక్షాల నిరసనలతో పార్లమెంటు ఉభయ సభల సమావేశాలు మంగళవారం–రెండోరోజుకూడా మరుసటి రోజుకు వాయిదా పడ్డాయి. జంతర్‌మంతర్‌లో పోలీసులు సోమవారం తొలగించిన నిరాహారదీక్ష శిబిరాన్ని నిరసనకారులు మంగళవారం ఉదయం తిరిగి ఆక్రమించుకుని దీక్ష కొనసాగిస్తుండగా, కాంగ్రెస్‌పార్టీ విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావాన్ని నాటకీయమైన మలుపుతో తారా స్థాయికి తీసుకెళ్లింది. విద్యార్థులపై పాశవికమైన బలప్రయోగం, పరీక్షల సంక్షోభంపై ప్రభుత్వంలో పూర్తిగా కొరవడిన జవాబుదారీతనంపై సభలో చర్చ చేపట్టాలని స్పీకర్ ఓం బిర్లాను కలిసి ప్రతిపక్షనాయకుడు రాహుల్ గాంధీ, ఇతర ఎంపిలు కోరగా, ప్రభుత్వ అనుమతి కావాలంటూ ఆయన నిస్సహాయత వ్యక్తం చేశారు. సభ వాయిదా తదుపరి కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ వాద్రా, కె.సి.వేణుగోపాల్, జైరాం రమేష్, ఇతర ఎంపిలు, కర్నాటక, కేరళ ముఖ్యమంత్రులు డి.కె.శివకుమార్, సతీశన్, వందలాదిమంది కార్యకర్తలతో ప్రధాని నరేంద్ర మోదీ నివాస గృహం వద్దకు వెళ్లి, ప్రజాస్వామ్యానికి సంకెళ్లకు ప్రతీకగా చేతులు బంధించుకుని ఆకస్మికంగా రోడ్డుపై ధర్నాకు ఉపక్రమించి తమ ఆందోళన పట్ల దేశం దృష్టిని ఆకర్షించారు. విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరుతున్న విద్యార్థుల డిమాండ్‌ను, సోమవారంనాటి పోలీసు దారుణ కృత్యాలకు జవాబుదారీగా ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్ షా రాజీనామా డిమాండ్‌కు విస్తరించారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ సంబంధిత ఘటనలు, విద్యార్థులపై పోలీసు అకృత్యాలను పార్లమెంటులో చర్చించాలన్నది వారి ప్రధాన డిమాండ్. దాదాపు 3గంటల పాటు జరిగిన ఈ ఆందోళన సందర్భంలో ప్రభుత్వం తరఫున పిఎంఒ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వచ్చి రాహుల్‌తో జరిపిన చర్చలు ఫలించలేదు. పార్లమెంటులో చర్చకు ఆయన అంగీకరించారుగాని విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌ను తిరస్కరించారు. అనంతరం పోలీసులు కాంగ్రెస్ నాయకులను అక్కడినుంచి బలవంతంగా తరలించారు.

కేంద్ర ఆరోగ్యమంత్రి, బిజెపి మాజీ అధ్యక్షుడు జె.పి.నడ్డాను సోమవారం కలుసుకున్న కాక్రోచ్ జనతాపార్టీ ప్రతినిధులు మూడు డిమాండ్లు ఆయనకు అందజేశారు. ఒకటి, 21రోజుల నిరాహారదీక్షనుంచి బలవంతంగా సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించిన ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌కు స్వేచ్ఛ. (ఆయన ఇష్టానుసారం ప్రైవేటు ఆసుపత్రికి తరలించేందుకు కోర్టు మంగళవారం అనుమతించింది). రెండు, నీట్ పేపర్ లీకేజీకి జవాబుదారీతనం వహిస్తూ విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. మూడు, పేపర్ లీకేజీ దరిమిలా నిరాశోపహతులై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లింపు. 'నిరసనకారుల అభ్యర్థన'పైనే తాను వారితో సంభాషించానని, కోర్కెల పత్రం తీసుకున్నానని నడ్డా చెప్పటంలోనే ప్రభుత్వ అహంకారం వెల్లడవుతున్నది. నెలరోజులపైబడి నిరసన ఆందోళన ఉధృతంగా జరుగుతున్నా వారివద్దకు వెళ్లి లేదా వారి ప్రతినిధులను పిలిపించుకుని మాట్లాడాలన్న సున్నితత్వం కొరవడిన ప్రభుత్వం, వీధుల్లో రణరంగం జరుగుతుండగా విద్యార్థి ప్రతినిధులకు నడ్డాను కలుసుకునే అవకాశం ఎందుకు కల్పించినట్లు?

అమిత్ షా పోలీసుల తీరే ప్రత్యేకం. నిరాహారదీక్ష శిబిరం వద్ద ఎన్నో అవాంతరాలు కలిగిస్తూ వచ్చిన, అక్కడకు వచ్చి సంఘీభావం తెలియజేసే వారిగుర్తిస్తూ కూపీలు లాగుతున్న ఢిల్లీ పోలీసులు, ఇప్పుడు విద్యార్థుల ఆందోళన వెనుక ఎవరున్నారని ఆరాతీస్తున్నారట. విద్యార్థులు 60మందికి పైగా గాయపడితే 118 మంది పోలీసు అధికారులు గాయపడ్డారని లెక్కలు వెల్లడించి తమ అమానుష దాడిని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. 'చలో పార్లమెంట్' కు పర్మిషన్ లేదనేది వారు చెప్పే కారణం. పర్మిషన్ ఇచ్చి ఉంటే ప్రశాంతంగానే నిరసన ప్రదర్శన జరిగేది కాదా? పర్మిషన్ నిరాకరించమని ఆదేశించిందెవరు?

నిజానికి, మోదీ ప్రభుత్వానికి ప్రజల నిరసనలు గిట్టవు. పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా షహీన్‌బాగ్‌లో జరిగిన సుదీర్ఘ ఆందోళనలో పాల్గొన్న మహిళలను హింసించారు. వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగిన రైతులను ఢిల్లీలోకి రానివ్వకుండా హర్యానా, యుపి సరిహద్దుల్లోనే నిలువరించి సంవత్సరంపైగా అడ్డుకుంది ప్రభుత్వం. చివరకు మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి ఆ చట్టాలు ఉపసంహరించుకున్నారు. మళ్లీ ఇప్పుడు – అమెరికాతో కుదిరేదని చెప్పిన వాణిజ్య ఒప్పందాన్ని తిరస్కరించి చాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ ప్రదర్శనకు బయలుదేరిన పంజాబ్, హర్యానా రైతులను ఈ రోజు (మంగళవారం) హర్యానా పోలీసులు శంభు కేంద్రం వద్ద అటకాయించారు.

ఈ బిజెపి/ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వానికి నిరంకుశత్వంలో తప్ప ప్రజల ప్రజాస్వామిక హక్కుల్లో విశ్వాసం లేదని వెల్లడవుతున్నది. సిజెఐ విద్యార్థి ఆందోళనపట్ల మొండివైఖరి కూడా ఈ ప్రజావ్యతిరేక మానసిక స్థితిలో భాగమే. పార్లమెంటులో కూడా ప్రజాసమస్యలు చర్చించే అవకాశం ప్రతిపక్షాలకు ఇవ్వటం లేదు. దేశ ప్రజాస్వామిక సాంప్రదాయాలు ఈ నిరంకుశ లక్షణాన్ని ఎంతో కాలం అనుమతించవు.



## అప్పుడు ధన్‌ఖడ్, నేడు నీట్ నిరసనలు అణచివేత

**గతంలో రైతుల దుస్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన, మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చేత బలవంతంగా రాజీనామా చేయించారు. ఇప్పుడు పేపర్ లీకేజీలపై నిరసనలు చేస్తున్న యువతను, విద్యార్థులను అణచి వేస్తున్నారు. భారత ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ ఛైర్మన్‌గా ధన్‌ఖడ్‌కు ఐదేళ్ల పదవీ కాలం ఉంది. అయినప్పటికీ ఆయనను కేవలం మూడేళ్లు పూర్తయిన దశలోనే బలవంతంగా రాజీనామా చేయించారు. కనీసం రాజ్యసభ సభ్యుల నుంచి ధన్‌ఖడ్‌కు మర్యాదపూర్వకమైన, అధికారిక వీడ్కోలు కూడా లభించలేదు.**

– కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్




## భరతజాతి గుండె సవ్వడి.. మన జాతీయ జెండా

భారత జాతీయ జెండా రెపరెపలే 146 కోట్ల భారతీయుల గుండె లబ్ డబ్‌లు. దేశ ఔన్నత్యం, ఐక్యత, దేశ భక్తి, త్యాగం, జాతి గౌరవం, ఆకాంక్షలు, న్యాయం, సార్వభౌమాధికారం, శాంతి, సౌభాగ్యం, స్వేచ్ఛా స్వాతంత్ర్య పోరాటాలకు ఏకైక చిరునామాగా త్రివర్ణ పతాకం నిలుస్తున్నది. మచిలీపట్నానికి చెందిన తెలుగు బిడ్డ పింగళి వెంకయ్య రూపొందించిన ప్రస్తుత త్రివర్ణ జాతీయ పతాకాన్ని 22 జులై 1947న మన భారత రాజ్యాంగ సభ ఆమోదించడం, 15 ఆగష్టు 1947న భారత ప్రభుత్వం అధికారికంగా ఎగుర వేస్తూ అంగీకరించడం మన స్వతంత్ర భారత ఘన చరిత్రలో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచిపోయింది. ప్రతి ఏట జులై 22న దేశవ్యాప్తంగా భారతీయులు జాతీయ పతాక ఆమోద దినోత్సవం లేదా జాతీయ పతాక దినోత్సవం (నేషనల్ ఫ్లాగ్ డే ఆర్ నేషనల్ ఫ్లాగ్ అడాప్షన్ డే) రూపంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది.

**త్రివర్ణ పతాకంలో దాగిన నిగూఢ అనంత అర్థాలు:**

చేనేత వస్త్రంతో మాత్రమే రూపొందించబడుతున్న మన జాతీయ జెండా 2:3 నిష్పత్తితో దీర్ఘ చతురస్రాకారంలో మూడు రంగులతో, మధ్యలో నావీ బ్లూ రంగు అశోక చక్రం అమర్చబడి అందంగా ఉంటుంది. జాతీయ పతాకంలోని పై భాగంలో కాషాయ రంగు, మధ్యలో తెలుపు వర్ణం, క్రింది భాగాన ఆకుపచ్చ రంగు సమాన భాగాలుగా అమర్చబడి ఉంటాయి. మధ్యలో ఉన్న తెలుపు వర్ణం కేంద్రంగా నావీబ్లూ రంగు కలిగిన అశోక ధర్మ చక్రం అమర్చబడి ఉంటుంది. పై భాగాన ఉన్న కాషాయ రంగు దేశ శక్తి సామర్థ్యాలకు, త్యాగ స్ఫూర్తి, ధైర్యాలకు ప్రతీకగా నిలుస్తున్నది. మధ్యలో ఉన్న శ్వేత వర్ణం శాంతి, స్వచ్ఛత, సత్యాలను సూచిస్తున్నది. క్రింది భాగాన ఉన్న హరిత వర్ణం సమృద్ధి, హరిత సంపద, శుభప్రదం, సమగ్రాభివృద్ధిలను ప్రకటిస్తున్నది. మధ్య తెలుపు వర్ణం కేంద్రంగా సత్య ధర్మాలకు ప్రతీకగా అశోక ధర్మ చక్రం అమర్చబడి ఉన్నది. అశోక చక్రం ప్రగతి రథాలకు చిరునామాగా, చక్రంలోని 24 చువ్వలు స్వేచ్ఛ భారత స్ఫూర్తి, 24 గంటలు నిరంతర ప్రగతి పరుగులను ప్రకటిస్తున్నది. చక్రంలోని సారనాథ్ సింహం ధైర్య, గంభీర, న్యాయ, సుస్థిరతను సూచిస్తున్నది.

**భారత జాతీయ పతాక చరిత్ర :** 1907లో కాషాయం, పసుపు, ఆకుపచ్చ వర్ణాలతో కూడిన జెండాను బెర్లిన్ కమిటీ రూపొందించడం జరిగింది. అనంతరం అన్నీబిసెంట్, బాల గంగాధర తిలక్‌లతో కూడిన దేశ భక్తు లు ఐదు ఎరుపు చారలు, నాలుగు ఆకుపచ్చ చారలు, ఏడు నక్షత్రాలు, ఎడమ పై భాగాన యూనియన్ జాక్ సంతకంతో కూడిన పతాకాన్ని ఎగురవేయడం జరిగింది.1931లో వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకం మధ్యలో చరకా చేర్చబడింది. దేశ స్వాతంత్ర్యానికి కొద్దిరోజుల ముందు నేటి మన జాతీయ పతాకానికి తుది రూపం ఇస్తూ త్రివర్ణ పతాకం మధ్య భాగంలో చరకాకు బదులు గా అశోక ధర్మ చక్రం చేర్చబడింది. ఈ జాతీయ జెండాను 22 జులై 1947న భారత రాజ్యాంగ సభ అధికారికంగా ఆమోదించడం ఒక అపూర్వ ఘట్టంగా దేశ స్వాతంత్ర్య చరిత్రలో నిలిచిపోయింది. మన జాతీయ జెండాను ఉదయం ఎగుర వేసి సాయంత్రం సూర్యాస్తమయానికి ముందు వరకు ఉంచుకోవచ్చని, మతపరమైన సందర్భాల్లో వాడకూడదని, నేలకు గాని నీటికి గాని తగలకుండా చూసుకోవాలని, జాతీయ జెండా కన్న ఎత్తులో మరో జెండా ఉండకూడదనే నియమనిబంధనలు కూడా చేర్చబడినవి. జెండా ఎగురవేసిన వెంటనే జాతీయ గీతాన్ని ఆలపించడం ఒక అలవాటుగా మారింది.

**(22 జులై జాతీయ జెండా అమోదించిన దినోత్సవం శుభ సందర్భంగా)**

# ప్రశ్నించే గొంతులపై ఉక్కుపాదం... ప్రజాస్వామ్యానికి ప్రమాదం



ఎండి. ఉస్మాన్ ఖాన్
9912580645

ప్రజాస్వామ్య ఆరోగ్యాన్ని కొలవాలంటే ఎన్నికల సంఖ్యను కాదు, అధికారాన్ని ప్రశ్నించగల స్వేచ్ఛను చూడాలి. ఏ సమాజంలోనైనా యువత వీధుల్లోకి దిగడం ఒక సాధారణ రాజకీయ సంఘటన కాదు. అది సమాజం లోపల పేరుకుపోయిన అసంతృప్తి బయటపడే క్షణం. ముఖ్యంగా విద్య, ఉపాధి, అవకాశాల వంటి జీవితాన్ని నిర్ణయించే అంశాలపై వేలాదిమంది యువకులు ఒకే స్వరంతో మాట్లాడడం వెనుక తాత్కాలిక ఆవేశం ఉండదు. దీర్ఘకాలంగా పేరుకుపోయిన నిరాశ, అనిశ్చితి, నమ్మకద్రోహం, అవమానం కలిసిన అనుభవం ఉంటుంది. ఉద్యమాలు ఎప్పుడూ ఒక సంఘటనతో పుట్టవు; అనేక నిర్లక్ష్యాల సమాహారంగా పుడతాయి.

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో కనిపిస్తున్న ఆందోళనను కూడా ఈ నేపథ్యంతోనే అర్థం చేసుకోవాలి. ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల నిర్వహణలో లోపాలు, నియామకాల ఆలస్యం, ఉపాధి అవకాశాల సంకుచితం ఇవి విడివిడిగా కనిపించే సమస్యలు కావచ్చు. కానీ యువత దృష్టిలో ఇవన్నీ ఒక దానితో ఒకటి సంబంధమున్న ప్రశ్న లు. వ్యవస్థ నిజంగా మా శ్రమను గౌరవిస్తోందా? సంవత్సరాల పాటు పుస్తకాల మధ్య గడిపిన సమయం, కుటుంబాలు చేసిన త్యాగం, భవిష్యత్తుపై పెట్టుకున్న ఆశలు చివరకు అనిశ్చితి ముందర నిలబడితే, ఆ బాధ వ్యక్తిగతంగా మిగలదు. అది సామూహిక అసంతృప్తిగా మారుతుంది.

ఇలాంటి సందర్భాల్లో నిరసన కేవలం హక్కు మాత్రమే కాదు; ప్రజాస్వామ్యం తనను తాను సరిదిద్దుకునే ప్రక్రియ కూడా. ఎందుకంటే ప్రజలు వీధుల్లోకి రావడం అంటే, వ్యవస్థలో ఎక్కడో సంభాషణ ఆగిపోయిందని అర్థం. ప్రభుత్వ కార్యాలయాల్లో వినిపించని స్వరం చివరకు రోడ్ల మీద వినిపిస్తుంది. చర్చకు అవకాశం తగ్గిన చోటే ఉద్యమాలు పుడతాయి. అందుకే ప్రజాస్వామ్యంలో ప్రతి ఉద్యమాన్ని ముందుగా శాంతిభద్రతల సమస్యగా కాక, ఒక సామాజిక సంకేతంగా చూడడం అవసరం.

ఈ నేపథ్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ మరోసారి జాతీయ చర్చలోకి రావడం యాదృచ్ఛికం కాదు. అది కేవలం రాజధానిలోని ఒక ప్రదేశం కాదు; భారత ప్రజాస్వామ్య జ్ఞాపకాలతో నిండిన ఒక రాజకీయ స్థలం. రైతులు, విద్యార్థులు, ఉద్యోగార్థులు, మహిళలు, సామాజిక ఉద్యమకారులు ఎవరికి అధికార ద్వారాలు మూసుకుపోయాయని అనిపించినా, చివరకు చేరే చిరునామా అదే. అందుకే జంతర్ మంతర్‌ను ఒక భౌగోళిక ప్రదేశంగా మాత్రమే చూడలేం. వినిపించని స్వరాలు ఒకదానికొకటి తోడై ప్రజాస్వామ్యా న్ని మేల్కొలిపే ప్రతీకగా దాన్ని చూడాలి.

ప్రతి ఉద్యమం సరైనదే కావచ్చు అనడం ఎంత అతిశయోక్తో, ప్రతి ఉద్యమాన్ని కుట్రగా చిత్రీకరించడం కూడా అంతే ప్రమాదకరం. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు విమర్శలను దుష్ప్రచారంతో కాదు, వాస్తవాలతో ఎదుర్కోవాలి. ప్రశ్నలపై దేశద్రోహం, విదేశీ హస్తం, రాజకీయ ప్రేరేపణ వంటి ముద్రలు వేసే ప్రయత్నం చేసినప్పుడల్లా అసలు సమస్య చర్చ నుంచి తప్పుకుంటుంది. ప్రశ్నించిన వ్యక్తి మీదే విచారణ మొదలవుతుంది. కానీ ప్రశ్న మాత్రం సమాధానం కోసం అలాగే మిగిలి ఉంటుంది. ఇదే నేటి భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న అత్యంత కీలకమైన సవాలు. ప్రభుత్వాల బలం ఎన్నికల్లో సాధించిన మెజారిటీలో మాత్రమే ఉండదు; ప్రజలు అడిగే అసౌకర్యమైన ప్రశ్నలను వినగలిగే ధైర్యంలో కూడా ఉంటుంది. విమర్శలను భరించలేని అధికారం ఎంత బలవంతంగా కనిపించినా, అది అంతర్గతంగా అసురక్షిత భావానికే సంకేతం. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో అధికారానికి నిజమైన రక్షణ పోలీసు బారికేడ్లు కాదు; ప్రజల విశ్వాసం.

ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ అత్యున్నత శాసన వేదిక అయితే, వీధి అత్యున్నత ప్రజా వేదిక. ఈ రెండూ పరస్పర ప్రత్యర్థులు కావు; ఒకదానికొకటి పూరకాలు. పార్లమెంట్ ప్రజల ఆకాంక్షలను చట్టాలుగా మలచే స్థలం. వీధి, ఆ ఆకాంక్షలు విస్మరించబడినప్పుడు అధికారాన్ని అప్రమత్తం చేసే స్థలం. అందుకే చరిత్రను తిరగేస్తే, గొప్ప సామాజిక మార్పులు ముందుగా వీధుల్లోనే పుట్టి, తరువాత శాసనసభల వరకు చేరినట్టు కనిపిస్తుంది. స్వేచ్ఛ, సమానత్వం, కార్మిక హక్కులు, పౌరహక్కులు, విద్యా సంస్కరణలు ప్రజాస్వామ్యం సాధించిన ప్రతి విజయానికి ప్రజా ఉద్యమాల ముద్ర కనిపిస్తుంది.

భారతదేశ చరిత్ర కూడా దీనికి మినహాయింపు కాదు. స్వాతంత్ర్య పోరాటం వీధుల్లోనే మొదలై పార్లమెంటరీ ప్రజాస్వామ్యంగా రూపాంతరం చెందింది. అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)కి వ్యతిరేకంగా ప్రజలు రోడ్లపైకి రావడం భారత రాజకీయాలను కొత్త మలుపు తిప్పింది. రైతు ఉద్యమాలు, అవినీతి వ్యతిరేక ఆందోళనలు, మహిళా ఉద్యమాలు, విద్యార్థి పోరాటాలు ఇవన్నీ ప్రజాస్వామ్యాన్ని మరింత జవాబుదారీగా మార్చిన అధ్యాయాలే. అందుకే వీధిలో వినిపించే ప్రతి నినాదాన్ని అధికార వ్యతిరేకతగా మాత్రమే చూడడం చరిత్రను అర్థం చేసుకోలేని సంకుచిత రాజకీయ దృష్టికి సంకేతం.

ఈ నేపథ్యంలో ఒక ప్రశ్న తప్పనిసరిగా ఎదురవుతుంది. ప్రజలు ఎందుకు నిరసన వ్యక్తం చేస్తారు? ప్రతి ఉద్యమం వెనుక రాజకీయ పార్టీలు ఉంటాయా? చరిత్ర చెబుతున్న సమాధానం వేరేలా ఉంటుంది. ప్రజలు మొదట ప్రభుత్వాలను మార్చాలని ఉద్యమించరు. ముందుగా ఒక సమస్య పరిష్కారం కోరుతారు. ఆ సమస్యను నిర్లక్ష్యం చేసినప్పుడు అసంతృప్తి పెరుగుతుంది. ఆ అసంతృప్తిని కూడా పట్టించుకోనప్పుడు అది ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నగా మారుతుంది. చివరికి అదే రాజకీయ ప్రతిఘటనగా రూపాంతరం చెందుతుంది. ఒక సమస్య నుంచి ప్రారంభమైన ఉద్యమం, పాలనా తీరుపై ప్రజాభిప్రాయంగా మారే ప్రక్రియ అన్ని ప్రజాస్వామ్య దేశాల్లో కనిపించిన చారిత్రక వాస్త వం.



నేటి విద్యార్థి ఉద్యమాలను కూడా ఈ క్రమంలోనే చూడాలి. పరీక్షల్లో పారదర్శకత కోరడం, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం, విద్యా వ్యవస్థపై విశ్వాసాన్ని పునరుద్ధరించాలని కోరడం ఇవి ప్రజాస్వామ్య విరోధ డిమాండ్లు కావు. ఇవి రాజ్యాంగబద్ధమైన పౌర హక్కులే. వాటికి సమాధానం వాస్తవాలతో, విచారణలతో, బాధ్యతతో రావాలి. కానీ వాటికి బదులుగా అనుమానాలు, ముద్రలు, ప్రచారాలు మాత్రమే వినిపిస్తే, ప్రజల దృష్టిలో వ్యవస్థపై ఉన్న నమ్మకం మరింత దెబ్బతింటుంది.

ఇక్కడే అధికార వ్యవస్థలు తరచూ చేసే ఒక వ్యూహాత్మక తప్పిదం కనిపిస్తుంది. సమస్యను పరిష్కరించడం కంటే, సమస్యను లేవనెత్తిన వారిపైకే చర్చను మళ్లించడం. ఉద్యమం వెనుక ఎవరు ఉన్నారు? ఎవరు ప్రేరేపించారు? అనే ప్రశ్నలు ప్రధానమవుతాయి. కానీ, వేలాదిమంది ప్రజలు ఒకే డిమాండ్‌తో వీధుల్లోకి ఎందుకు వచ్చారు? అనే అసలు ప్రశ్న వెనక్కి వెళ్ళి పోతుంది. ప్రజాస్వామ్యంలో ఇది అత్యంత ప్రమాదకరమైన మలుపు. ఎందుకంటే అక్కడి నుండే సంభాషణ ముగిసి, పరస్పర అనుమానం మొదలవుతుంది.

యువతలో పెరుగుతున్న అసహనం కేవలం ఉద్యోగాల కొరత వల్ల మాత్రమే కాదు, శ్రమకు సరైన గుర్తింపు దొరకడం లేదనే ఆవేదన వల్ల కూడా. ఒక పరీక్ష కోసం సంవత్సరాల పాటు శ్రమించడం, కుటుంబాలు అప్పులు చేసి కోచింగ్‌కు పంపడం, అనేక అవకాశాలను వదులుకోవడం ఇవన్నీ ఒక యువకుడి జీవితంలో చిన్న విషయాలు కావు. అలాంటి సమయంలో పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతపైనే సందేహాలు తలెత్తితే, అది మొత్తం వ్యవస్థ నిష్పాక్షికతపైనే ప్రశ్నగా మారుతుంది.

ప్రభుత్వాలు ఈ సంకేతాలను ఎంత త్వరగా అర్థం చేసుకుంటే అంత మంచిది. ఎందుకంటే ఉద్యమాలను బలప్రయోగంతో కొంతసేపు చెదరగొట్టవచ్చు. రోడ్లను ఖాళీ చేయించవచ్చు. కానీ అసంతృప్తిని సృష్టించిన కారణాలను లాఠీలతో చెదరగొట్టలేరు. ప్రజల మనసుల్లో పేరుకుపోయిన అవిశ్వాసాన్ని దుష్ప్రచారంతో తుడిచేయలేరు. ఒక సమాజం యువత విశ్వాసాన్ని కోల్పోవడం ఏ ప్రభుత్వానికైనా కనిపించని పెద్ద సంక్షోభం. అలాంటి సంక్షోభాలకు పరిష్కారం శక్తి ప్రదర్శన కాదు; జవాబుదారీతనం, పారదర్శకత, సంభాషణ మాత్రమే.

జంతర్ మంతర్ ఖగోళ గమనాలను పరిశీలించేందుకు నిర్మించిన స్థలమైనా, కాలక్రమంలో భారత ప్రజాస్వామ్య స్పందనను నమోదు చేసే రాజకీయ ప్రదేశంగా మారింది. అక్కడ వినిపించే నినాదాలు కేవలం ఆనాటి కోపాన్ని మాత్రమే కాక, సమాజంలో పేరుకుపోతున్న అసంతృప్తికి రాజకీయ రూపాన్ని ఇస్తాయి. అందుకే జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు కదిలే అడుగులు ప్రజాస్వామ్యంలో ఒక ప్రతీకాత్మక ప్రయాణం. దేశ అత్యున్నత ప్రజాస్వామ్య సభకు, ప్రజల ఆవేదన చేరాలనే ఆకాంక్షకు అది ప్రతిరూపం. ఆ స్వరం వీధుల్లో ఎక్కువసేపు నిలవడం, శాసనవ్యవస్థలో సంభాషణ బలహీనపడిందనే సంకేతం.

భారత ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతో నడిచే వ్యవస్థ కాదు. ఎన్నికలు ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తాయి; కానీ ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచేది నిరంతర ప్రజా భాగస్వామ్యం. ఓటు వేసిన రోజుతో పౌరుడి బాధ్యత, ఎన్నికల్లో విజయం సాధించిన రోజుతో ప్రభుత్వ జవాబుదారీతనం ముగిసిపోవు. నిర్ణయాలు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయనే అభిప్రాయం బలపడుతున్న వేళ, ప్రజాస్వామ్య సంస్థల పాత్ర, స్వతంత్ర మాధ్యమాల బాధ్యత, పౌర సమాజ చైతన్యం మరింత కీలకంగా మారతాయి. బలమైన ప్రజాస్వామ్యం అంటే కేవలం బలమైన ప్రభుత్వం కాదు; బలమైన సంస్థలు, స్వేచ్ఛగా పనిచేసే వ్యవస్థలు, భయపడకుండా ప్రశ్నించే పౌర సమాజం.

ఇక్కడ ప్రతిపక్షాల పాత్రను కూడా విస్మరించలేం. ప్రజల సమస్యలను శాసనసభల్లో బలంగా వినిపించడం, వీధుల్లో వ్యక్తమవుతున్న ఆవేదనను రాజ్యాంగబద్ధమైన రాజకీయ చర్చగా మలచడం, ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టడం ఇవే ప్రతిపక్ష ప్రజాస్వామ్య రాజకీయాల అసలు ప్రమాణాలు. ఈ పాత్ర బలహీనపడినప్పుడు ప్రజా ఉద్యమాలే ప్రత్యామ్నాయ రాజకీయ భాషగా మారడం సహజం.

అయితే ఉద్యమాలకూ కొన్ని బాధ్యతలు ఉంటాయి. శాంతియుత నిరసన, రాజ్యాంగబద్ధమైన పోరాటం, ప్రజా ప్రయోజనాల పట్ల నిబద్ధత ద్వారానే ఉద్యమాలకు విశ్వసనీయత, నైతిక బలం లభిస్తాయి.

ఈ రోజు దేశం ఎదుర్కొంటున్న అసలు ప్రశ్న ఏమిటంటే, ప్రజల అసంతృప్తిని రాజకీయ శత్రుత్వంగా చూడడమా..లేక ప్రజాస్వామ్య హెచ్చరికగా అర్థం చేసుకోవడమా.. అధికారాన్ని సవాలు చేసే ప్రతి స్వరం ప్రభుత్వానికి వ్యతిరేకం కాకపోవచ్చు; కొన్నిసార్లు అదే స్వరం ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరిచే అవకాశాన్ని ఇస్తుంది. ప్రజాస్వామ్యం తనను తాను సరిదిద్దుకునే శక్తిని కోల్పోకుండా ఉండాలంటే మూలం ప్రజలే, వారి ప్రశ్నలే. ఏ ప్రభుత్వమూ కేవలం అధికారంతో శాశ్వతంగా ఉండలేదు, బలప్రయోగంతో ప్రజల మనసులను గెలుచుకోలేదు. అధికారం చట్టాలను అమలు చేయగలదు కానీ విశ్వాసాన్ని ఆదేశించలేదు; భయాన్ని సృష్టించగలదు కానీ సమ్మతిని కొనలేదు.

ఈ రోజు దేశంలోని విద్యార్థులు, యువత అడుగుతున్న ప్రశ్నలు వ్యవస్థ నిష్పాక్షికతను, శ్రమకు దక్కే న్యాయాన్ని, ప్రశ్నించే హక్కు భద్రతను పరీక్షిస్తున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానాలు దేశ ప్రజాస్వామ్య సంస్కృతిని నిర్ణయిస్తాయి. నిరసన అనేది వ్యవస్థ వైఫల్యానికి సంకేతం మాత్రమే కాదు, వ్యవస్థ ఇంకా సజీవంగా ఉందనడానికి కూడా నిదర్శనం. ప్రజలు ప్రశ్నించడం మానేసినప్పుడు, భయాన్ని విధిగా భావించినప్పుడే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది.

భారత రాజ్యాంగం 'మేము భారత ప్రజలం...' అని ప్రారంభమవుతుంది. ఈ దేశంలో సార్వభౌమాధికారం ప్రజలదే. పార్లమెంట్ ఆ సార్వభౌమాధికారానికి ప్రతినిధి మాత్రమే, ప్రభుత్వం ప్రజల తరఫున పాలించే వ్యవస్థ మాత్రమే.

ప్రజాస్వామ్యం కేవలం ఓట్లతో గెలిచేది కాదు, విశ్వాసాన్ని నిలబెట్టుకునేది. ఆ విశ్వాసం నిలవాలంటే అధికారానికి వినే సంస్కారం, ప్రతిపక్షానికి బాధ్యతాయుతమైన దృష్టి, పౌర సమాజానికి ప్రశ్నించే ధైర్యం ఉండాలి. నేడు దేశ వీధుల్లో వినిపిస్తున్న స్వరాలు భారత ప్రజాస్వామ్యం తన గురించి తాను వేసుకుంటున్న ప్రశ్నలు. వాటికి సమాధానం వెతకడం అందరి బాధ్యత. ఎందుకంటే నిరంతరం ప్రశ్నించే పౌర చైతన్యమే ప్రజాస్వామ్యానికి శాశ్వత ప్రాణవాయువు.

# విశ్వాసం – వ్యాపారం – రాజకీయం

శాస్త్ర సాంకేతికాభివృద్ధి శరవేగంగా జరుగుతుండగా, హేతువాద దృష్టి బలపడాల్సింది పోయి అనాదిగా సమాజంలో పాదుకుని ఉన్న ఆస్తికత్వం ప్రబలం కావటం మనదేశంలోని వైరుధ్యం. మనిషిలోని విశ్వాసాన్ని, బలహీనతను ఉపయోగించుకుని కొందరు భక్తిపై వ్యాపారం చేస్తుండగా, మరికొందరు రాజకీయాలకు ఉపయోగించుకుంటున్నారు. దానికితోడు సోషల్ మీడియా ప్రభావం కూడా భక్తులు ఆలయాలకు పెద్ద సంఖ్యలో వెళ్లేందుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడుతుంది. దేవాలయాల ప్రాశస్త్యం, మొక్కితే కోర్కెలు నెరవేరుతున్నాయన్న సోషల్ మీడియా ప్రచారాల నేపథ్యంలో తమ కష్టాలు కూడా తీరుతాయోమోనన్న ఆశ మానవునిలో పెరుగుతున్నది. ఇప్పుడు ఆ విశ్వాసాన్ని వ్యాపారంగా మలిచే ప్రక్రియ జోరందుకుంది. దేవుని దగ్గరకు భక్తులు వెళ్లే బదులు దేవాలయాలకు భక్తులను ఆకర్షించే పనిలో ఆయా దేవాలయాల కమిటీలు ఉన్నాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే విశ్వాసంపై వ్యాపారం చేస్తున్నారు. దేవాలయాల్లో భక్తుల దర్శనానికి ఒక రేటు, సత్వర దర్శనానికి మరో రేటు నిర్ణయించి భక్తుల మధ్య కూడా ఆర్థిక అంతరాలను చూపెడుతున్నారు. అన్నింటికి మించి దేవాలయాల్లో కానుకలు హుండీల్లో వేయండి అని అడుగడుగున దేవాల య ప్రాంగణాల్లో జరుగుతున్న ప్రచారం వ్యాపార ప్రక్రియను తలపిస్తుంది. తాము కోరిన కోర్కెలు నెరవేరాయనుకున్నప్పుడు తాము అనుకున్న మేరకు దేవునికి సమర్పించడం ఆనవాయితీ. కానీ ఇప్పు డు దేవాలయాల్లో జరుగుతున్న ప్రచారం వ్యాపార తంతును తలపిస్తూ కానుకలు వేయకపోతే అపరాధమేమోనన్న భావన స్ఫురించేలా జరుగుతున్నది. ఇక శఠగోపం విషయంలోనూ పళ్లెంలో వేసే నోటు ను బట్టే ఉంటుందంటే ఆశ్చర్యం కలుగక మానదు.

ఇక తెలుగు రాష్ట్రాల్లో ఉన్న దేవాలయాల్లో ప్రతి దానికి ఓ పైరవీ దానికో రేటు – రూములు కావాలన్న, సత్వర దర్శనం పొందాలన్న, వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్న పైరవీ, దానికో రుసుము చెల్లించాల్సిందే. ఈ పైరవీలు అడ్డదారుల్లో జరుగుతుండటం గమనార్హం. అయోధ్య రామాలయంలో నిధులే పక్కదారి పట్టాయి. కానీ తెలుగు రాష్ట్రాల్లోని ప్రసిద్ధ దేవాలయాల్లో పైరవీల మాటున రోజుకు ఎన్ని వేల రూపాయలు చేతులు మారుతున్నాయో ఆలోచించవచ్చు.

విశ్వాసం వ్యాపారంగా మారిన నేపథ్యంలో దాని నుంచి ఇప్పుడు రాజకీయం మొదలైంది. ప్రజల విశ్వాసాన్ని రాజకీయంగా మలుచుకుని అందలాలు ఎక్కేందుకు కొన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. దేవునిమీద నమ్మకం ఉన్న వారి ఆహార్యాన్ని, తీసుకునే ఆహారాన్ని ఎత్తి చూపుతున్నాయి. విశ్వాసం కలిగిన ప్రతి ఒక్కరికి ఒక మతాన్ని అంటగడుతూ ఆ మతంలో ఉన్న వారంతా ఒక పక్కనే నిలవాలన్న కోరిక ఇప్పుడు శృతిమించి డిమాండ్‌గా మారుతుంది. ఒక మతం వారు ఒక పార్టీకే ఓటు వేయాలని, వారు మాత్రమే దేశభక్తులన్న భావన స్ఫూరించేలా ప్రచారం జరుగుతుంది. చివరకు భక్తాగ్రేసురులైన మా పక్క నిలవకపోతే దేశద్రోహులేనన్న ప్రచారం ముంగిట చాలా మంది ఆలోచనలో పడే పరిస్థితిని తీసుకు వచ్చారు. ఒకప్పుడు ప్రకృతి పట్ల విశ్వాసంతో మొదలైన పూజ, ఆ పూజ నుంచి పుట్టుకొచ్చిన విగ్రహారాధన, విగ్రహారాధనతో మొదలైన దేవాలయాల నిర్మాణం, అభివృద్ధి ఆ తర్వాత వ్యాపారంగా మారింది. ఇప్పుడు వ్యాపారం నుంచి రాజకీయం మొదలైంది. దేవుడు ఉన్నాడా లేదా అన్నది వ్యక్తిగత విశ్వాసం. కొలిచే వారు కొలుస్తూనే ఉంటారు. ఏదో ఒక రూపాన్ని ఆరాధించే వారు ఆరాధించవచ్చు. ఇక్కడ తర్కానికి అవకాశం లేదు. కానీ విశ్వాసంతో వచ్చే భక్తులపై వ్యాపారం చేయడం, వ్యాపారం నుంచి రాజకీయంగా లబ్ది పొందేందుకు ప్రయత్నించడమే ప్రశ్నించదగిన అంశం.

విభిన్న సంస్కృతులు, పద్ధతులు కలిగిన దేశంలో ప్రజల ఆచార వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం, విశ్వాసాన్ని దెబ్బతీసే రీతిలో వ్యవహరించడం కూడా శిక్షార్హ మే. పాలకులు ప్రజల విశ్వాసాల మీద వ్యాపారాలు చేసే శక్తులను, వ్యక్తులను అరికట్టాల్సి ఉంది. దేశంలో లౌకికవాదం అన్న పదాన్నే అంతర్థానం చేయాలన్న ఆలోచనల నడుమ విశ్వాసాన్ని రాజకీయంగా మలుచుకునే చర్యలకు అడ్డుపడటం రాజ్యాంగబద్ధంగా అంత తేలిక కాకపోవచ్చు.

**ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం**



# నీట్ పేపర్ లీకేజీపై ప్రశ్నిస్తే విద్యార్థుల రక్తం కళ్ళ చూస్తారా?

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆగ్రహం**

**ప్రజాపక్షం/కరీంనగర్ :** నీట్ పేపర్ లీకేజీని ప్రశ్నిస్తూ వందలాది మంది విద్యార్థులు తమకు న్యాయం చేయాలని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను విచక్షణ రహితంగా చితకబాది.. భాష్పా వాయువు ప్రయోగించి వారి రక్తం కళ్ల చూసిన మోదీ నీకిది తగునా? అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాడ మాట్లాడారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను రక్తాలు కారే విధంగా కొట్టడం దుర్మార్గమని, ఉద్యమాలను అణచాలని చూస్తే మరింత పెరుగుతాయి తప్ప తగ్గవన్నారు. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన మోదీ ప్రభుత్వం ప్రజలపై దాడులు చేయడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నైతిక విలువల గురించి శ్రీ రాముని గురించి, రామరాజ్యం గురించి గొప్పలు చెప్పే నరేంద్ర మోదీ వాటిని ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. తెలంగాణ అంటేనే దక్కన్ పీఠమని, ఎత్తులో ఉందని, వంపులో గోదావరి ఉందని, కృష్ణా నది నీళ్ళకంటే గోదావరి నీళ్లే ఎక్కువగా ఉపయోగించుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కరువు కోరల్లో నుండి కాపాడి వెంటనే ప్రజలకు తాగునీరు, సాగు నీరు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు ఒకరి పై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నారని మండి పడ్డారు. తక్షణమే కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిల సహకారం తో మహారాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి తుమ్మిడి హట్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. కరీంనగర్ దిగువ మానేరు జలాశయం నీరు కనిష్ఠ స్థాయికి పడిపోయిందని, వెంటనే ఎల్లంపల్లి మిడ్ మానేరు నుండి ఎల్ఎండికి నీరు వచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు,బీర్ల పద్మ, కొట్టె అంజలి,నగర నాయకులు బాకం ఆంజనేయులు, కసిబోజుల సంతోష్ చారి పాల్గొన్నారు.

# ఆర్‌టిసి హమాలీలకు కూలీ రేటు తగ్గించడం అన్యాయం

**బస్తాకు రూ.20లకు పెంచాలి : కూనంనేని డిమాండ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్‌టిసి బస్‌స్టేషన్లలో గతంలో ఒక బస్తాకు రూ.10లుగా ఉన్న హమాలీ కూలీ రేటును రూ.7.40కు తగ్గించడం అన్యాయమని, దీనిని తక్షణమే సవరించి రూ.20 లకు పెంచాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్‌స్టేషన్లలో పనిచేస్తున్న లైసెన్స్ హమాలీ కార్మికుల సమస్యలను రానున్న అసెంబ్లీ సమావేశాలలో లేవనెత్తడం ద్వారా ప్రభుత్వ దృష్టి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ఆర్‌టిసి హమాలీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రథమ మహాసభలు మంగళవారం హైదరాబాద్ ఎంజిబిఎస్ బస్‌స్టేషన్ ఆవరణలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం.నరసింహ అధ్యక్షతన వహించారు. మహాసభను ఉద్దేశించి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఆర్‌టిసి సరుకు రవాణాలో కీలకపాత్ర పోషిస్తున్న హమాలీ కార్మికులకు తగిన గుర్తింపు, సంక్షేమం కల్పించాలన్నారు. హమాలీ కార్మికులకు ఆర్‌టిసి ఆసుపత్రుల్లో వైద్య సదుపాయం, ఉచిత బస్ పాస్, ప్రమాద బీమా, ఇతర కార్మిక సంక్షేమ చట్టాల ప్రయోజనాలు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ సీనియర్ నాయకులు అజీజ్‌పాషా మాట్లాడుతూ హమాలీ కార్మికుల సమస్యలు ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్నాయని అన్నారు. బస్ భవన్ ముట్టడి, అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అరవై ఏళ్ల దాటిన హమాలీ కార్మికులకు రూ.10 లక్షల బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ, ఇతర రంగాల హమాలీలకు లభిస్తున్న సంక్షేమ సౌకర్యాలు కూడా ఆర్‌టిసి హమాలీలకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రెండేళ్లకోసారి కూలీ రేట్లు పెంచే విధానాన్ని అమలు చేయాలని కోరారు. ర్యాలీలో హమాలీ కార్మికులు కూలీ రేట్ల పెంపు, ఏటా రెండు జతల యూనిఫామ్‌లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు పాస్, ఆర్టీసీ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ఎంజిబిఎస్‌లోని కార్గో పార్సిల్ సర్వీస్ కార్యాలయం నుంచి ఇమ్లీబన్ పార్క్ వరకు హమాలీ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యల పరిష్కారించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, హమాలీ యూనియన్ నాయకులు జి.దాసు, ఎం.డి.కాశీం, కె.కొండయ్య తదితరులు పాల్గొన్నారు. మహాసభ అనంతరం యూనియన్ నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు.





# పాత్రికేయులు ప్రజల పక్షాన పనిచేయాలి

**జర్నలిస్టు మునీర్ ఆశయాలను కొనసాగించాలి**


**మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి**

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పాత్రికేయులు ప్రజల పక్షాన పనిచేయాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో అక్షర ఫౌండేషన్, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన పాత్రికేయుడు మునీర్ జీవితంపై రాసిన ప్రొలిటేరియట్ జర్నలిస్టు మునీర్ పుస్తక ఆవిష్కరణ, పరిచయ సభలో శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. మొదట మునీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మునీర్ మంచి జర్నలిస్టుగా ప్రజాభిమానం చూరగొన్నాడని, అతని జీవితంపై పుస్తకం రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రధాన పత్రికలు, ఎలక్ట్రానిక్ చానెళ్లు ప్రజల మనోభావాలను ప్రతిబింబించే బాధ్యతను విస్మరించడంతో సోషల్ మీడియా తెరపైకి వచ్చి పెరుగుతుందని అన్నారు. ప్రధాన మీడియాకు చట్టపరమైన రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని, అందువల్ల అవి తప్పుచేస్తే చట్టపరమైన నియంత్రణ ఉంటుందని అన్నారు. కానీ సోషల్ మీడియాకి అవి ఏవీ ఉండవని, తప్పు చేసినా చట్టపరమైన చర్యలుండవని, అందుకే వాటిలో ప్రతి ఒక్కటి బాధ్యతారాహిత్యంగా ప్రజల్లో వ్యాపిస్తుందని, దీనిని ప్రధాన మీడియా జర్నలిస్టులు అడ్డుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లుగా మార్చడంతో జర్నలిస్టుల హక్కులు కూడా పోయాయని వివరించారు. అక్షర ఫౌండేషన్ అధ్యక్షులు మాదాసు రాంమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సభలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, మునీర్‌తో తనకు గల అనుబంధాన్ని వివరించారు. మేయర్ మహంకాళి స్వామి, జర్నలిస్టు నాయకులు నగునూరి శేఖర్, సంపత్, వంశీ, కోల లక్ష్మణ్, వివిధ, ప్రజాసంఘాలు, యూనియన్ల నాయకులు, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు మాట్లాడారు. ప్రెస్ క్లబ్ వ్యవస్థాపకులు అల్లంకి లచ్చయ్య, జక్కం మారుతీ, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

# ‘సర్’ పనులు వేగవంతం చేయాలి

**ఈ వారంలోగా 90 శాతానికి పైగా ఎన్యూమరేషన్ పూర్తి కావాలి**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రత్యేక సత్వర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్2026) కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి. సుధర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అదనపు సిఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సిఈఓ జి.ఎస్. చారి, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎస్ఐఆర్–2026 పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సిఈఓ పలు కీలక సూచనలు చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి అందుబాటులో ఉన్న సమయాన్ని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్‌ఓలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్‌ఓలు), బిఎల్ఓ సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఓలు) క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి ఎస్ఐఆర్ కార్యకలాపాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలతో నిర్వహించే సమావేశాల్లో పూర్తి పారదర్శకత పాటిస్తూ సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పట్టణ ప్రాంతాలు, తక్కువ పురోగతి నమోదైన అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అలాగే వివిఐపి, విఐపి ఓటర్ల పేర్లు తప్పనిసరిగా ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో ఇప్పటికే ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన ఓటర్లను మళ్లీ భౌతిక ఫారాలు ఇవ్వాలని, బిఎల్‌ఓలు ఒత్తిడి చేయరాదని స్పష్టం చేశారు. అలాగే ఫారం సమర్పణకు ఆధార్ కార్డును తప్పనిసరి చేయవద్దని సూచించారు. ఓటర్లు సులభంగా ఫారాలు సమర్పించేందుకు అవసరమైన సహకారం అందించడంతో పాటు వారి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గైర్హాజరు, చిరునామా మారిన, మరణించిన (ఏఎడి) ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా ధృవీకరించి ఖచ్చితమైన రికార్డులు నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి పర్యవేక్షణ అధికారులతో సమన్వయం పెంచాలని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా మ్యాపింగ్ కాని ఓటర్ల శాతం, 50 శాతం కంటే తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ కేంద్రాలు, సేకరించని ఎన్యూమరేషన్ ఫారాలపై కూడా సిఈఓ సమీక్ష నిర్వహించారు. ఈ వారాంతానికి ప్రతి జిల్లాలో ఎన్యూమరేషన్ ప్రక్రియ కనీసం 90 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, నో మ్యాపింగ్‌గా ఉన్న ప్రతి ఓటర్‌ని క్షుణ్ణంగా ధృవీకరించి, అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్–2026 కార్యక్రమాన్ని సజావుగా, సకాలంలో పూర్తి చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సిఈఓ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నోడల్ అధికారులు, సాంకేతిక బృంద సభ్యులు పాల్గొన్నారు.

# విప్‌లకు మంత్రుల హోదా

**గవర్నర్ ఆదేశాలతో సిఎస్ ఉత్తర్వులు జారీ**



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఇటీవల విప్‌లుగా నియమితులైన వారికి రాష్ట్ర మంత్రి హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2026 మార్చి 18న ప్రభుత్వ విప్‌లుగా నియమితులైన వేముల వీరేశంతో పాటు చింతకుంట విజయరమణారావు, యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలకు ఈ హోదా వర్తింపజేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన (పొలిటికల్) శాఖ జీఓ ఆర్.టీ. నెం.1064ను విడుదల చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర మంత్రి హోదా లభించింది. సంబంధిత ప్రజాప్రతినిధులు ప్రభుత్వ విప్‌లుగా కొనసాగినంత కాలం మాత్రమే ఈ హోదా వర్తిస్తుందని పేర్కొంది. రాష్ట్ర మంత్రులకు కల్పించే ప్రొటోకాల్, అధికారిక గౌరవ మర్యాదలు, సౌకర్యాలు ప్రభుత్వ విప్‌లకు కూడా వర్తించేలా అన్ని ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, ఇతర అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే రాష్ట్ర టేబుల్ ఆఫ్ ప్రిసిడెన్స్‌లో ఎలాంటి శాశ్వత మార్పు ఉండదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులను గవర్నర్ పేరుతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జారీ చేశారు. వేముల వీరేశంకు రాష్ట్ర మంత్రి హోదా లభించడం పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సేవలో మరింత సమర్థంగా పనిచేసే అవకాశం లభించిందని పేర్కొంటూ పలువురు శుభాకాంక్షలు తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గంలో ఈ సందర్భంగా ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.



# విద్యార్థుల బకాయిల విడుదలకు 23న ‘చలో కలెక్టరేట్’

**ఎఐఎస్ఎఫ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న రాష్ట్ర వ్యాప్తంగా చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.మంగళవారం ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఛలో కలెక్టరేట్ కార్యక్రమం వాల్ పోస్టర్‌ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి, లక్ష్మణ్ లు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలు ఫీజుల పేరుతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేయడం వల్ల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని విద్యార్థుల సర్టిఫికెట్లను విడుదల చేయించడంతో పాటు బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు సామిడి వంశీవర్ధన్ రెడ్డి, మహమ్మద్ అన్వర్, అనిల్, హరీష్, కృష్ణ, రఘు, అరుణ్, జోసెఫ్, భాను తదితరులు పాల్గొన్నారు.



# శాసనసభను సందర్శించిన మిజోరాం స్పీకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మిజోరాం రాష్ట్ర శాసనసభ స్పీకర్ పూ లాల్ బిక్జామా, ఆయన సతీమణి వాన్ లాల్ రుటి తెలంగాణ రాష్ట్ర శాసనసభను సందర్శించారు. వారికి తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ స్వాగతం పలికారు. అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్ లో ఇరు రాష్ట్రాల స్పీకర్లు సమావేశమయ్యారు. అసెంబ్లీల సమావేశాల నిర్వాహణ, పనితీరు, పద్ధతులపై వారు చర్చించారు. తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మిజోరాం స్పీకర్‌కు తెలంగాణ సభాపతి ప్రసాద్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర శాసనసభ తరుపున మిజోరాం స్పీకర్‌ను స్పీకర్ ప్రసాద్ కుమార్ శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో శాసనమండలి సెక్రటరీ డాక్టర్ వి.నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, లెజిస్లేటివ్ అధికారులు పాల్గొన్నారు.

# దేవాదుల వద్ద నీటిని ఎత్తడానికి ఏం అడ్డమొచ్చింది?

**బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీటిని ఎత్తే విషయంలో దేవాదుల ప్రాజెక్ట్ వద్ద ఏం అడ్డమొచ్చిందని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు మండిపడ్డారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 50 రోజులు ఎందుకు నీటిని లిఫ్ట్ చేయలేదని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తాగు, సాగు నీటి ఇబ్బందులకు, విద్యుత్ కోతలకు, పంటల సాగు తగ్గినా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ దేవాదుల కింద రూ.700 నుంచి రూ 800ల కోట్ల విలువైన పంట ఎండిపోయిందని, ఈసారి కూడా ఎల్‌నినో వస్తుందని చెబుతున్నప్పటికీ ప్రభుత్వం మొద్దునిద్ర పోతున్నాదా ? అని ప్రశ్నించారు. రామప్ప కింద తూములు మూసేశారని, ప్రస్తుతం నాట్లు వేసిన రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దేవాదుల సమ్మక్క బ్యారేజీ నుంచి 105 టీఎంసీల నీళ్లు ఏపీ వైపు వెళ్లిపోయాయని, రాష్ట్ర ప్రభుత్వం ఎత్తింది కేవలం 1.9 టీఎంసీలు మాత్రమేనని వివరించారు. రోజుకు పావు టీఎంసీ ఎత్తే అవకాశం ఉన్నప్పటికీ రెండు టీఎంసీలు కూడా ఎత్తలేదన్నారు. ప్రాజెక్టులు,లిఫ్టులు ఉన్నప్పటికీ నీళ్ల మాత్రం ఎత్తడం లేదన్నారు. 22 రిజర్వాయర్ల కెపాసిటీ 12 టీఎంసీలు అని, 50 రోజుల్లో అన్నీ నిండిపోయేవని, కానీ వాటిని ఎందుకు నింపలేదని ప్రశ్నించారు. 30 నెలలుగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌పైన పడి ఏడవడం తప్ప సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేసింది ఏముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో దేవాదుల వద్ద ఉన్న పది మోటార్లను నడపాలని, 22 రిజర్వాయర్లను నింపాలని, 3 లక్షల 17 వేల ఎకరాలకు తాగు, సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందిచకపోతే వరంగల్, నల్లగొండ, కరీంనగర్ రైతులతో కలిసి ప్రజాపోరుకు సిద్ధమవుతామని హరీశ్‌రావు హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, రాజయ్య, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఆరూరి రమేష్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# కవిత ఆరోపణలపై హరీశ్ సమాధానం చెప్పాలి

**మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు కాంట్రాక్టర్లు బిఆర్‌ఎస్‌కు రూ.1,400 కోట్లు చెల్లించారని మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. సచివాలయంలో మంగళవారం మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ హరీష్‌రావు రైతులను తప్పుదోవ పట్టించడం మానేసి ఆరోపణలపై ముందు స్పష్టత ఇవ్వాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి అసలు డిపిఆర్‌లో ప్రతిపాదించిన షీట్ ఫైల్ ఫౌండేషన్‌ను సెకెంట్ ఫైల్ ఫౌండేషన్‌గా ఎందుకు మార్చారో, ఆ నిర్ణయానికి ఎవరు బాధ్యులో హరీశ్‌రావు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు.

**దేవాదుల 9 పింపింగ్ యూనిట్లు 24 గంటలు పనిచేస్తాయి**

దేవాదుల ఎత్తిపోతల పథకం కింద మంగళవారం రాత్రి నుంచి 9 పంపింగ్ యూనిట్లు 24 గంటల పాటు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. గోదావరి నుంచి గరిష్ట స్థాయిలో నీటిని ఎత్తిపోసి 9 జిల్లాల్లోని 22 రిజర్వాయర్లను నింపడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, రాజకీయాల కోసం కాదని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసి 5.6 లక్షల ఎకరాలకు సాగునీరు, ఉత్తర తెలంగాణకు తాగునీటి భద్రత కల్పిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# 32 నెలల్లో కాంగ్రెస్ చేసిందేమిటి? : కెటిఆర్



**ప్రజాపక్షం/లక్షెట్టిపేట :** సుందిళ్ల బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగిన మాట నిజమేనని, అయితే అధికారంలోకి వచ్చి 32 నెలలు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రశ్నించారు. మంగళవారం లక్సెట్టిపేట మండలంలోని అంకత్ పల్లి వాసవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మేస్త్రీలు, సిమెంటు లేదా స్టీలు కొరత ఉందా అని విమర్శించారు. రైతులు పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో వర్షం నుండి ధాన్యాన్ని కాపాడుకునే క్రమంలో జిల్లాలో నలుగురు రైతులు అకాల మరణం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ బాధితులకు ఎలాంటి సాయం చేయలేదని ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్ పార్టీ తరపున హామీ ఇచ్చిన విధంగా మృతి చెందిన నలుగురు రైతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయల చొప్పున మొత్తం 20 లక్షల రూపాయల చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం అధికారంలోకి వచ్చేది బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, అక్రమాలకు వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, నడిపెల్లి దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య, కోవ లక్ష్మి, నారదాసు లక్ష్మణ్, ఖానాపూర్ ఇంచార్జి జాన్సన్ నాయక్, లక్సెట్టిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ సల్మాన్ కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: సర్కిల్-17, జల్‌పల్లి.

Date: 21.07.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| టెండర్ నోటీసు NIT No. 08/EEC-17/JLPY/GHMC-2026-27, Dated: 21.07.2026 | 3 పనుల కోసం జిహెచ్ఎంసి, శంషాబాద్ జోన్, జల్‌పల్లి సర్కిల్-17 పరిధిలోని షాహీన్ నగర్-63, పహాడి షరీఫ్-64 మరియు జల్‌పల్లి-65 ప్రాంతాలలో బోనాల పండుగ కోసం విద్యుత్ దీపాల (డే లైట్స్) ఏర్పాటు... అలాగే, జిహెచ్ఎంసి, శంషాబాద్ జోన్, జల్‌పల్లి సర్కిల్-17 పరిధిలోని జల్‌పల్లి-65 ప్రాంతంలో బోనాల పండుగ కోసం మంచి కంకర మరియు తడి మిశ్రమం పరిచే పనుల కోసం. | రూ. 15.00 లక్షలు | 25.07.2026 మ.03:00 గం.ల వరకు | శ్రీ కె.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జల్‌పల్లి సర్కిల్-17, జిహెచ్ఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.Tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, జల్‌పల్లి, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 6451-PP/CL/ADVT/2026-27, Date: 21-07-2026

వ్యవసాయ మార్కెట్ కమిటీ, కార్యాలయము, హైదరాబాద్.

నెం. వ్య మా.క./హై/Tenders/2026-27 టెండర్ నోటీసు తేది: 21/07/2026

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్, మలక్ పేట్ మార్కెట్ కార్యాలయమునకు సంబంధించిన ప్రింటింగ్ అఫ్ తక్ పట్టి పుస్తకములు, ఎగుమతి పుస్తకములు; ప్రింటింగ్ రిజిస్టర్స్, స్టేషనరి సరఫరా, క్యాంటిన్ నిర్వహణ చేయుటకు మరియు ఎర్రగడ్డ, మెహిదీపట్నం రైతు బజార్ల యందు ఒక్క సంవత్సరం కాల వ్యవధికి గాను ఈ దిగువ తెలిపిన పనుల నిర్వహణకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

| క్రమ సంఖ్య | టెండరు పేరు | టెండరు షెడ్యూలు ధర రూ. | ధరావత్తు (EMD) రూ. | టెండరు షెడ్యూలు సరఫరా చేయు తేది మరియు సమయము | టెండరు షెడ్యూలు దాఖలు చేయు చివరి తేది మరియు సమయము | టెండరు తెరువబడు తేది మరియు సమయం |
|---|---|---|---|---|---|---|
| 1. | కార్యాలయమునకు అవసరమగు ప్రింటింగ్ అఫ్ తక్ పట్టి పుస్తకములు, ఎగుమతి పుస్తకములు సరఫరా చేయుటకు | Rs.3,000/- | Rs.50,000/- | 24.07.2026 మరియు 27.07.2026 ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు | 29.07.2026 రోజున మధ్యాహ్నం 12.00 గంటల వరకు | 29.07.2026 రోజున మధ్యాహ్నం 1.00 గంటలకు |
| 2. | ప్రింటింగ్: కార్యాలయమునకు అవసరమగు రిజిస్టర్స్ ప్రింటింగ్ చేసి సరఫరా చేయుటకు | Rs.3,000/- | Rs.50,000/- | | | |
| 3. | స్టేషనరి: కార్యలయముకు అవసరమగు స్టేషనరి సరఫరా చేయుటకు | Rs.3,000/- | Rs.50,000/- | | | |
| 4. | మలక్‌పేట్ మార్కెట్ యార్డు యందు క్యాంటిన్ నిర్వహణ కొరకు | Rs.3,000/- | Rs.20,000/- | | | |
| 5. | వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్ మలక్‌పెట్ కార్యలయంకు సంభందించిన scrap (పాత సామాన్లు) కొనుగోలు చేయుటకు | Rs.1,000/- | Rs.5,000/- | | | |
| 6. | ఎర్రగడ్డ రైతు బజార్: టాయిలెట్ బ్లాక్-I | Rs.3,000/- | Rs.20,000/- | | | |
| 7. | టాయిలెట్ బ్లాక్-II | Rs.3,000/- | Rs.20,000/- | | | |
| 8. | చెత్త చెదారము ఊడ్చుట, ప్రోగుచేయుట, ఎత్తివేయుట మరియు చెత్తను బయటకు తరలించుటకు గాను | Rs.3,000/- | Rs.50,000/- | | | |
| 9. | మెహదిపట్నం రైతు బజార్ : చెత్త చెదారము ఊడ్చుట, ప్రోగుచేయుట, ఎత్తివేయుట మరియుచెత్తను బయటకు తరలించుటకుగాను | Rs.3,000/- | Rs.50,000/- | | | |

నిబంధనలు:-
1. టెండర్ షెడ్యూలు కొరకు GST రిజిస్ట్రేషన్ ఉన్న కాంట్రాక్టర్లు లిఖితపూర్వ దరఖాస్తుతో పాటు, టెండర్ ఫారం ధర మరియు టెండర్ వారిగా ధరావత్తు (EMD) బాపతు రూపాయలను డి.డి.ల రూపేనా Selection Grade Secretary, Agril. Market Committee, Hyderabad గారి పేరున తీసిన వారికి మరియు ఈ క్రింద తెలిపిన అర్హత పత్రములు సమర్పించిన వారికీ మాత్రమే టెండర్ షెడ్యూల్ ఫారం ఇవ్వబడును. DDల పై టెండర్ వేయువారి పేరున మాత్రమే ఉండవలెను, చెక్కులను తిరస్కరించబడును.
2. చెత్త చెదారము ఊడ్చుట, ప్రోగుచేయుట, ఎత్తివేయుటకు గాను సొంత / లీజుకు తీసుకొనబడిన డంపింగ్ యార్డు ఉండవలెయును. దాని ధ్రువికరించిన పత్రములు ధరఖాస్తుతో పాటు జతపర్చవలెను.
3. బుల్ గార్బేజ్ లిఫ్టింగ్, 200 సి.సి.టి.కి. తక్కువ కాని చెత్త తరలింపుకు రెండు వాహనములు ఉండవలెయును వాటి ఆర్.సి కాపీలు ధరఖాస్తుతో పాటు జత పర్చవలెను.
4. 10 మందికి తక్కువ కాకుండా లేబర్ కలిగియుండవలెను వారి యొక్క వివరాముల, ఆధార్ కార్డు Xerox copy లను దరఖాస్తుతో పాటు జతపర్చవలెను.
5. కాలుష్య నియంత్రణ బోర్డు వారి యొక్క ధ్రువికరించిన పత్రములు ధరఖాస్తుతో పాటు జతపర్చవలెను.
6. టాయిలెట్ బ్లాక్ నిర్వహణ కొరకు రిజిస్టర్ / సొసైటీ ఫరమ్స్ వారు మాత్రమే టెండరు కొరకు దరఖాస్తు చేసుకోగలరు.
7. వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్ మలక్‌పేట్ కార్యలయంకు సంభందించిన scrap (పాత సామాను) కొనుగోలు చేయుటకు ఆసక్తి గల సంస్థలు / వ్యక్తుల నుండి దరఖాస్తులు కోరడమైనది.
8. పై తెలిపిన పనులను ఏదేని ప్రభుత్వ సంస్థలో కనీసం (2) సంవత్సరములు పని చేసిన అనుభవం వుండాలి (అట్టి ధృవీకరణ పత్రములు ధరఖాస్తుతో పాటు జతపర్చవలెను).

అసంపూర్తిగా ఉన్న టెండర్ గాని, అభ్యంతరములు ఉన్న టెండర్లు గాని చెక్కులు సమర్పించిన టెండర్ గాని, టెండర్ దారు పేరున DD లేని వాటిని తిరస్కరించబడును మరియు ఎలాంటి కారణము చూపకుండా టెండర్ రద్దు చేయు అధికారము ఈ దిగువ సంతకముదారునకు కలదు. ఇట్టి విషయము నందు ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు. ఇతర వివరములకు కార్యాలయము పనిచేయు దినములలో ఉదయము 11.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్, మలక్ పేట్ కార్యాలయము నందు సంప్రదించవచ్చును.

సం/- ఉన్నత శ్రేణి కార్యదర్శి(FAC), వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్.

DIPR R.O. No. : 6438-PP/CL/ADVT/2026-27, Date: 21-07-2026

## 'సర్' ప్రక్రియ విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే సంజయ్ కుమార్




ప్రజాపక్షం/జగిత్యాల : జగిత్యాల నియోజక వర్గంలో సర్ ప్రక్రియను వంద శాతం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు.జగిత్యాల పట్టణంలోని 7,8,9 వార్డులలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రోగ్రామ్ సరళిని అధికారులు,ప్రజా ప్రతినిధులు తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వారి ఓటు ఉండేలా శ్రద్ధ వహించాలన్నారు.ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు వార్డులో సర్ కార్యక్రమంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి కుటుంబం సర్వేలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.నిర్దేశిత గడువు ముందే పూర్తి చేయడానికి బిఎల్ఓలు కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.రాజకీయాలకు అతీతంగా అందరూ సర్ ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు గాజంగి నందయ్య,కమిషనర్ సత్య ప్రణవ్, తదితరులు ఉన్నారు.

## అర్హులైన ప్రతి ఓటునూ కాపాడండి

కాంగ్రెస్ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి



ప్రజాపక్షం/కొమురవెల్లి: మండల కేంద్రంలో సర్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మంగళవారం రోజు కొమురవెల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) కార్యక్రమాన్ని జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కార్యక్రమం నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, బూత్ లెవెల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి పలు సూచనలు చేశారు.ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా ఓటరు జాబితా నుండి మినహాయించబడకుండా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు.అదేవిధంగా గ్రామ శాఖ అధ్యక్షులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు. సర్ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతగా తీసుకొని ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ఎల్ నినో'పై రైతులకు అవగాహన



ప్రజాపక్షం/సిద్ధిపేట అర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి గ్రామ రైతులకు ఎల్‌నినో పరిస్థితులపై వ్యవసాయ అధికారులు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్,ఎడిఎ పద్మ,సిద్దిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ గోపికృష్ణ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో తక్కువ వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని,ఎల్‌నినో ప్రభావం,వర్షాభావ పరిస్థితుల గురించి రైతులకు వివరించారు. తక్కువ వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు కంది, పెసర,అలసంద,సజ్జ,కొర్రెలు,రాగులు.పొద్దు తిరుగుడు వంటి పంటలను సాగు చేసుకోవాలని తద్వారా వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోగలమని తెలిపారు. పంట పొలాలలో రైతులందరూ తప్పని సరిగా నీటికుంటలను ఏర్పాటు చేసుకోవాలని,ప్రతి వర్షపు నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించుకోనుటలో నీటికుంటలు ఎంతగానో తోడ్పడతాయని తెలియజేశారు. గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితునికి 10 సంవత్సరాల జైలు శిక్ష

జిల్లా ఎస్పి మహేష్ బి.గితే

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : మైనర్ బాలిక పై లైంగిక వేధింపుల(పోక్సో) కేసులో నిందితుడుకి 10 సంవత్సరాలు జైలు శిక్ష, 2000 రూ. జరిమానా విధిస్తు సిరిసిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ మంగళవారం తీర్పు వెల్లడించినట్టు జిల్లా ఎస్పి మహేష్ బి.గితే తెలిపారు. సిరిసిల్ల లోని బి. వై నగర్ కి చెందిన వేముల శ్రీనివాస్ అనే వ్యక్తి మైనర్ బాలికను లైంగిక వేధింపులకి గురి చేసిన విషయంలో చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కి ఫోన్ ద్వారా సమాచారం అందించగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం పిర్యాదు మేరకు సిరిసిల్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి అప్పటి సిరిసిల్ల టౌన్ శ్రీకాంత్ దర్యాప్తు అనంతరం నిందితుడినీ రిమాండ్ కి తరలించి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేసినట్లు తెలిపారు. పకడ్బంధిగా దర్యాప్తు జరిపి నిందితుడికి శిక్ష పడేలా కృషి చెసిన అప్పటి విచారణ అధికారి శ్రీకాంత్, ప్రస్తుత సి.ఐ శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్,కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ జనార్దన్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్,పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల లను జిల్లా ఎస్పి అభినందిచారు.

## మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలి

ప్రజాపక్షం/రామగిరి : ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలి:రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు "ఏక్ పెడ్ మాకే నామ్" కార్యక్రమంలో భాగంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ వారి ఆదేశాల మేరకు మంగళవారం సింగరేణి వ్యాప్తంగా ఒక్కొక్క ఏరియాకు పదివేల మొక్కలు నాటే కార్యక్రమం "మాసివ్ ప్లాంటేషన్ డ్రైవ్" (మెగా ప్లాంటేషన్) నిర్వహించడం జరిగింది. సింగరేణి సంస్థ పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఎన్నో పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టి, ఉద్యోగుల చేత లక్షలాది మొక్కలు నాటించడం, వాటిని సంరక్షించడం జరుగుతుందని, అంతేకాకుండా చెట్లను పెంచడం వలన కలిగే లాభాలను తెలియజేస్తూ, అవగాహన కల్పిస్తూ పరిసర గ్రామాల ప్రజలకు మొక్కలను పంపిణీ చేయించి, నాటించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వీలైనన్ని మొక్కలు నాటుతూ, నాటిస్తూ వాటిని సంరక్షిస్తూ, జీవన వైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

# ప్రజాస్వామ్యంపై దాడిని ఖండించాలి

కేంద్ర విద్యా శాఖ మంత్రిని భర్త రఫ్‌చేయాలి, తుమ్మిడి హట్టి వద్ద ప్రభుత్వం డ్యాం నిర్మాణం పూర్తి చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/పెద్దపల్లి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థ పై దాడిని ఖండించాలని, నీట్ పరీక్ష రద్దుకు కారణమైన కేంద్ర విద్యా శాఖ మంత్రినీ వెంటనే బర్తరపు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తుమ్మిడి హట్టి వద్ద డ్యామ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం రోజున పెద్దపెల్లి జిల్లా సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారం రోజున దేశ రాజధాని ఢిల్లీలో నీట్ పరీక్ష లీక్ చేసిన దోషులను శిక్షించాలని విద్యార్థులు, మేధావులు జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తుంటే వారిపై దాడిని సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని,విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని,బిజెపి ప్రభుత్వం నీట్ లీకేజీ పై కేంద్ర విద్యాశాఖమంత్రి నీ వెంటనే మంత్రివర్గంలో నుండి బర్తరఫ్ చేయాలని ప్రధానిమోదీని డిమాండ్ చేశారు. పెద్దపెల్లి, భూపాలపల్లి జిల్లాలకు తలాబున గోదావరి ఉన్న రైతులకుసాగునీటికి, ప్రజలకు త్రాగునీటికి కష్టాలు తప్పడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉమ్మడి హట్టి వద్ద డ్యామ్ నిర్మాణం పూర్తి చేసి రైతులకు సాగు నీటిని అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్రాల్లోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఆగస్టు నెలలో సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్రను చేపడుతున్నామని, సెప్టెంబర్ నెలలో చలో ఢిల్లీ విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీ పటిష్టతకు కలిసికట్టుగా కృషి చేయాలని, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న బ్రాహ్మణ కాండకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.జిల్లా సహ కార్యదర్శి గోశిక మోహన్, కార్యవర్గ సభ్యుడు గౌతమ్ గోవర్ధన్, కె.కనకరాజ్, తాళ్లపల్లి మల్లయ్య,కోడం స్వామి,తాళ్లపల్లి లక్ష్మణ్, మార్కాపురి సూర్య,తదితరులు పాల్గొన్నారు.

## 'సర్'లో ప్రతి ఒక్కరూ.. భాగస్వాములు కావాలి

సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం/ఎండపెల్లి : భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.మంగళవారం జగిత్యాల జిల్లా ఎండపెల్లి మండలంలోని ముంజంపల్లి, మారేడువెల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్ ప్రక్రియను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓటరు నమోదు, వివరాల ధృవీకరణ పనులను అధికారులను అడిగి తెలుసుకుని, కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.అనంతరం మారేడువెల్లి ప్రభుత్వ పాఠశాలలో రూ.5 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్డును మంత్రి ప్రారంభించారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ప్రజలు అధికారులకు పూర్తి వివరాలు అందించి సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## వేగంగా 'సర్' డిజిటలైజేషన్ ప్రక్రియ

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి హాజరయ్యారు. ముందుగా జిల్లాల వారిగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రగతి వివరాలు సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో వెనుకబడి ఉన్న జిల్లాలలో ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు వారంలోగా అన్ని జిల్లాల ఎస్ఐఆర్ ప్రక్రియ 90 శాతానికి చేరుకోవాలని, వీలైనంత త్వరగా ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ ఆర్ఓలు, ఏఈఆర్ఓలు తమ పరిధిలో పర్యవేక్షణ చేయాలని, రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా మీటింగులు పెట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, తహసీల్దార్లు మహేష్, జయంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, సిరిసిల్ల ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# వేద పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజా పక్షం/వేములవాడ: వేద పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడలోని శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పార్వతీ రాజరాజేశ్వర అఖిల భారత వేద శాస్త్ర స్మార్త ఆగమ విద్వత్ సదస్సు మరియు వేద స్మార్త పరీక్షా మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అర్చకులు, వేద పండితులు స్వస్తితో స్వాగతం పలికారు. అనంత రం ఆయన శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేయగా, ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.వేద–స్మార్త పరీక్షా మహోత్సవాల ప్రారంభానికి సంకేతంగా వేదపండితులతో కలిసి జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.వేదాలు మన సనాతన ధర్మానికి మూలస్తంభాలని అన్నారు. వే దాలను పరిరక్షించడం అంటే ధర్మాన్ని పరిరక్షించినట్లేనని పేర్కొన్నారు. భారతదేశంలోని ఆధ్యాత్మిక సంప్రదాయాలు, ఆగమ శాస్త్ర విధానాలు ప్ర పంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఇతర దే శాల ప్రజలు సైతం మన సంస్కృతిని అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. వేద విద్యను భావితరాలకు అందించేందుకు ఇలాంటి వేద స్మార్త పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. తె లంగాణ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి వి శేష ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధితో పాటు ఉద్యోగ నియామకాలు కూడా చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. వేములవాడ రాజన్న ఆలయం అభివృద్ధి కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తన లక్ష్యమని తెలిపారు. వేద విశ్వవిద్యాలయం ఏర్పాటు, సంస్కృత విద్యాభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఇప్పటికే అసెంబ్లీలో ప్రస్తావించినట్లు వెల్లడించారు. అలాగే ఈ నెల 30, 31న ఆగస్టు 1న నిర్వహించనున్న వరుణ యాగం ద్వారా సకాలంలో వర్షాలు కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని, స్వామివారిని ప్రార్థించనున్నట్లు తెలిపారు.



# జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు

కలెక్టర్ చిత్రా మిశ్రా



ప్రజాపక్షం/కరీంనగర్: జాతీయ రహదారుల పై ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు జారీ చే సిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పా టించేందుకు రవాణా, పోలీస్, నేషనల్ హైవే అ ధికారులు సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నా రు. జాతీయ రహదారులపై రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల అ మలు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రత్యేక కా ర్యదర్శి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. పోలీసు, రవాణా, ఎన్.హెచ్.ఎ.ఐ అధికారులు సమన్వయ ంతో రహదారుల భద్రత, ప్రమాదాల నివారణ కు తగిన కార్యాచరణ రూపొందించాలని ఆ దేశించారు. జిల్లా రహదారి భద్రతా టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రతకు సంబంధించి చేపట్టిన చర్యలపై సమగ్ర నివేదికను సిద్ధం చే యాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రైట్ ఆఫ్ వే మార్గం వెంబడి కొత్త గా ఎలాంటి వాణిజ్య నిర్మాణాలు అనుమతించరాదని, మునిసిపల్, ట్రేడ్ లైసెన్స్ వంటివి రైట్ ఆఫ్ వే వెలుపల ఏర్పాటు చేయకుండా చూడాలని, ఎలాంటి కొత్త అనుమతులూ ఇవ్వరాదని పేర్కొన్నారు. జాతీయ రహదారుల వెంట ఆక్రమణలు పరిశీలించేందుకు, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు డ్రోన్ ద్వారా నిఘా ఉంచాల ని తెలిపారు. రోడ్డు భద్రత చర్యలకు అవసర మై న నిధులు కేటాయిస్తామని అన్నారు. జాతీయ రహదారుల వెంట గట్టి నిఘా, పెట్రోలింగ్, అక్రమ పార్కింగ్ వంటి అంశాలను పర్యవేక్షించాలని పోలీస్, రవాణా, నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి పెట్రోలింగ్ కోసం పోలీస్ రవాణా శాఖ సిబ్బందితో కూడిన ప్రత్యేక హైవే నిఘా బృందాలను ఏర్పా టు చేయాలని అన్నారు. స్పీడ్ డిటెక్టర్లు, కెమెరాలు, సైన్ బోర్డులు, ఎమర్జెన్సీ కాల్ బాక్సులు వంటివి పరిశీలించాలని తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. బ్లాక్ స్పాట్ వద్ద హైమాస్ట్ లైటింగ్, స్పీడ్ ఎన్ఫోర్స్ మెంట్ కెమెరాలు, మెట్రో రిఫ్లెక్టివ్ హెచ్చరిక స ంకేతాలు వంటివి ఏర్పాటు చేయాలని అన్నారు. భారీ వాహన డ్రైవర్లకు విశ్రాంతి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పు డు తక్షణ వైద్య సహాయం కోసం సమీప ఆసుపత్రులను మ్యాపింగ్ చేయాలని తెలిపారు. పరిశీలించాలని, లేని చోట్ల అవసరమైన చర్యలు తీసుకుని నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని పేర్కొన్నారు.

## ఢిల్లీలో విద్యార్థులు,యువతపై పోలీసుల లాఠీచార్జీ అమానుషం

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్



ప్రజాపక్షం/కరీంనగర్: ఢిల్లీలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చలో పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జీ చేయడం అత్యంత అమానుషమైన చర్య అని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు ఉందని, అలాంటి హక్కును అణిచివేసే విధంగా పోలీసులు లాఠీ ఛార్జ్ చేస్తూ, టియర్ గ్యాస్ ప్రయోగించినా విద్యార్థులు యువకులు పార్లమెంట్ ను తాకి నిరసన చెప్పారని, నీట్ పరీక్షను సక్రమంగా నిర్వహించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. 2024, 2026లో నీట్ పేపర్ లీకేజ్ పరీక్ష ఫలితాల్లో తప్పుల వల్ల లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఎన్టీఏ సంస్థ చెలగాటమాడుతుందని, బిజెపి పాలిత రాష్ట్రాలు ఉత్తర ప్రదేశ్, బిజెపి, గుజరాత్ లోనే వరుసగా పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని, పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా విద్యార్థులు యువకులు డిమాండ్ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్రాలకు ఇవ్వకుండా కేంద్రం ఆధీనంలో పెట్టుకొని రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. మహిళా విద్యార్థులను, యువతను ఇష్టం వచ్చినట్లుగా మగ పోలీసులు దాడులు చేసి వారిపై వికృతంగా వ్యవహరించారని వీరిని సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెడతామని పార్లమెంట్లో చెప్పిన మోడీకి పార్లమెంటులో వద్ద జరిగే నిరసనలో మహిళలపై పోలీసుల దాడులు కనబడడం లేదా అని ప్రశ్నించారు. విద్యార్థుల గొంతును లాఠీలతో మూయాలని చేసే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవు. ఉద్యమాలను అణచివేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ కరీంనగర్ జిల్లా సమితి తరపున ఢిల్లీ పోలీసుల లాఠీ చార్జీని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గాయపడిన విద్యార్థులకు తక్షణమే మెరుగైన వైద్య సహాయం అందించి, ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని మచ్చ రమేష్ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## స్త్రీ నిధి రుణాలు మహిళలకు గొప్ప వరం

అక్టోబర్‌లోగా వందశాతం వసూలు

కలెక్టర్ హైమావతి

ప్రజాపక్షం/ సిద్దిపేట : స్త్రీ నిధి రుణాలు మహిళలు, అర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కల్పించిన గొప్ప అవకాశం అని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. మంగళవారం కలెక్టర్ సమావేశమందిరంలో జిల్లా కలెక్టర్ ఐకెపి, స్త్రీనిధి. మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించి జిల్లాలో మహిళా సంఘాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ స్త్రీ నిధి రుణాలు తీసుకొని మహిళలు అర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. కాని రుణాలను తిరిగి చెల్లించటంలో జిల్లా చాల వెనుకబడి ఉందన్నారు. అందుకే మళ్లీ ప్రభుత్వం కేటాయించే రుణాల్లో కోతపడుతుందని, అందుకే మళ్లీ మనకు ప్రభుత్వం కేటాయించే రుణాల్లో కోతపడుతుందన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి రుణాలు అక్టోబర్ చివరిలోగా వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. రికవరీలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్త్రీనిధి ఫండ్‌ను మిస్ యూజ్ చేసిన విఓఏలు వారం రోజుల్లోగా చెల్లించకపోతే టర్మినెట్ చేస్తామని హెచ్చరించారు. జిల్లాకు కేటాయించిన ఈ బైకులు, ఆటోలు, లబ్దిదారులకు అందించాలన్నారు. జిల్లాకు కేటాయించిన 125 సిఎం సూర్య గర్ సోలార్ యూనిట్లకు లబ్దిదారులకు త్వరగా ఎంపిక చేయాలన్నారు. మహిళా సంఘాలకు వ్యాపారవేత్తలుగా చేసేందుకు ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పించిందని, వాటిని సద్వినియోగం చేసుకొని వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఈ కామర్స్ మహిళలు ప్రవేశించాలన్నారు. మహిళ సంఘాలు ముందుకు వస్తే వ్యాపారం చేసుకునేందుకు స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. చేపలపెంపకం లాభాదాయకమైన వృత్తి విబిజి రామ్ పథకం ద్వారా ఫామ్ ఫాండ్లు నిర్మించుకొని చేపలు పెంపకం చేసుకునేలా మహిళను చైతన్యం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డిఆర్‌డిఓ జైదేవ్‌ఆర్య, అడిషనల్ డిఆర్‌డిఓ సుదీర్. మెప్మా పిడి హన్మంతరెడ్డి, డిస్ట్రిక్ మేనేజర్ రవీందర్ చౌహాన్, స్త్రీ నిధి ఆర్ఎం మోహన్ రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, సభ్యులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా నీటి సంరక్షణ పనులు

కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జిల్లావ్యాప్తంగా నీటి సంరక్షణ పనులు ముమ్మరంగా చేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తెలంగాణ జలసిరి, ఇందిరమ్మ ఇండ్ల పై హౌసింగ్ ఏఈలు, ఎంపీడీఓలు, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయని తెలిపారు. భవిష్యత్తు అవసరాలు, పంటల సాగు, తాగునీరు, భూగర్భ జలాల వృద్ధి కోసం వర్షం నీటిని ఒడిసి పట్టాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ జల సిరి కింద జల సంరక్షణ కోసం చేపట్టనున్న పనులు, లాభాలపై టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇంకుడు గుంతలు, పంట కుంటలు (పామ్ పాండ్), ఊట కుంట (పర్కొలేషన్ ట్యాంక్), బోరు బావుల రీచార్జ్ పనులు జిల్లాలోని మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టి.. పూర్తి చే యాలని ఆదేశించారు. ఫాం పాండ్స్ తో రైతుల పొలాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని, ఎన్నో లాభాలు ఉన్నాయని తెలియజేస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫాం పాండ్స్, బోర్ వెల్స్ రీచార్జ్ పనులు చేసుకునేలా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమగ్ర ప్రణాళిక రూపొందించుకుని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో మొదటి దశలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రస్తుత పరిస్థితి, ఇప్పటివరకు ప్రారంభమైన నిర్మాణాలు, వివిధ దశల్లో ఉన్న ఇండ్లు, పూర్తయిన ఇండ్ల వివరాలను మండలాల వారీగా అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. రెండో దశలో మంజూరు చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి చేపడుతున్న ప్రక్రియ, లబ్ధిదారుల ఎంపిక, అర్హత కలిగిన లబ్ధిదారుల వివరాలను ఆరా తీశారు.ఇందిరమ్మ ఇండ్లు వేగంగా పూర్తి చేసుకుంటే కలిగే లాభాలపై లబ్దిదారులకు వివరించాలని తెలిపారు. గుడిసెలు, రేకుల షెడ్లలో ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.



## ప్రభుత్వ సేవల నాణ్యత పెంపే లక్ష్యం

కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా, నాణ్యంగా అందించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ గుండారం ఎం.పీ.పీ.ఎస్. పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నూతన తహసీల్దార్ కార్యాలయం, ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియ, పెంచికల్‌పేట్ గ్రామంలోని సింగరేణి భూములు, రామగిరి నూతన తహసీల్దార్ కార్యాలయం, మేడిపల్లి ఇండస్ట్రియల్ పార్క్ స్థలాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.కమాన్‌పూర్ మండలంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన అనంతరం, మిగిలి ఉన్న చిన్నచిన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి 2026 ఆగస్టు 1వ తేదీ నుంచి కొత్త భవనం నుంచే తహసీల్దార్ కార్యాలయ కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జరుగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

16 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు జిల్లాలో అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్న నేపథ్యంలో సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న 16 మంది వ్యక్తులను సంగారెడ్డి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగింది. సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరుట్ల గ్రామ శివారులో సర్వే నెం. 44 లో ఉన్న రామకృష్ణ రెడ్డి ఫామ్‌హౌస్‌లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో సంగారెడ్డి రూరల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పోలీసు సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో 16 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి. రూ. 1,55,080 నగదు, 15 మొబైల్ ఫోన్లు, 52 ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ పేకాట, జూదం, మట్కా వంటి అక్రమ కార్యకలాపాలు చట్టరీత్యా నేరం, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని అలాగే జిల్లాలో ఎక్కడైనా పేకాట, జూదం, ఇతర అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంగారెడ్డి జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నెం 8712656739, డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

## అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు: ప్రిన్సిపాల్ శ్రీదేవి

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను వివిధ విభాగాల్లో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు 1, ఇంగ్లీష్ 2, కామర్స్ 2, బోటనీ 1, జువాలజీ 1, పొలిటికల్ సైన్స్ 2, హిస్టరీ 2, ఎకనామిక్స్ 1, కంప్యూటర్ సైన్స్ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని సూచించారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు 23వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

## 'నాన్న ఒక నిశ్శబ్ద సముద్రం' పుస్తకానికి ప్రశంసలు

యువ రచయిత ఆకాష్ కేదేవార్‌కు కలెక్టర్ అభినందనలు



**ప్రజాపక్షం/కుంటాల :** మండలంలోని లింబా (కె) గ్రామానికి చెందిన యువ రచయిత ఆకాష్ కేదేవార్ రాసిన 'నాన్న ఒక నిశ్శబ్ద సముద్రం' పుస్తకం జిల్లా కలెక్టర్ ప్రశంసలను అందుకుంది. ఇటీవల ఈ పుస్తకాన్ని ప్రత్యేకంగా వీక్షించిన కలెక్టర్, పుస్తకంలోని సారాంశం మరియు తండ్రిపై రాసిన భావోద్వేగపూరితమైన రచనా శైలి ఎంతో అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు.ఈ సందర్భంగా రచయిత ఆకాష్ కేదేవార్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తన పుస్తకాన్ని బహుకరించారు. సమాజంలో తండ్రి పాత్రను, ఆయన నిశ్శబ్ద త్యాగాలను ఈ పుస్తకంలో అద్భుతంగా ఆవిష్కరించారని, ఇది ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఎంఎస్సీ మైక్రోబయాలజీ చదువుతూ పాటలు పాడటం,రాయడంలో మంచి సృజనాత్మకత చూపిస్తున్న ఆకాష్ భవిష్యత్తులో మరిన్ని గొప్ప పుస్తకాలు రాయాలని ఆకాంక్షిస్తూ, ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.కలెక్టర్ గారి నుంచి అభినందనలు లభించడంపై ఆకాష్ కేదేవార్ హర్షం వ్యక్తం చేస్తూ, ఇది తనలో బాధ్యతను మరింత పెంచిందన్నారు. తన అక్షరాలకు ప్రోత్సాహం, స్ఫూర్తినిచ్చే ఈ పుస్తకం రాయగలిగానని, కలెక్టర్ మాటలు భవిష్యత్తులో మరిన్ని మంచి రచనలు చేయడానికి స్ఫూర్తి నిచ్చాయని తెలిపారు. ఆకాష్‌ను కలెక్టర్ అభినందించడం పట్ల లింబా (కె) గ్రామ ప్రజలు, మండల ప్రముఖులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## 'ఆల్ఫోర్స్' అడ్వెంచర్ ఫ్రెషర్స్ పార్టీ

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో హోరెత్తిన దివ్య గార్డెన్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** స్థానిక దివ్య గార్డెన్ వేదికగా ఆల్ఫోర్స్ జూనియర్ ఇంటర్ కళాశాల (నిర్మల్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ఫోర్స్ అడ్వెంచర్ ఫ్రెషర్స్ పార్టీ ఆదివారం అత్యంత వైభవంగా, కోలాహలంగా జరిగింది. కళాశాలలో నూతనంగా చేరిన ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థులు, యాజమాన్యం సంయుక్తంగా ఈ వేడుకను అట్టహాసంగా నిర్వహించారు. సరికొత్త ఆశలు, ఆశయాలతో కళాశాల జీవితంలోకి అడుగుపెట్టిన నూతన విద్యార్థులకు ఈ ఉత్సవం ఒక చిరస్మరణీయ అనుభూతిని మిగిల్చింది. సాయంత్రం నుంచి ప్రారంభమైన ఈ వేడుకల్లో విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలతో అలరించారు. నూతన, సీనియర్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రదర్శించిన జానపద గీతాల నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు, నాటికలు, వినోదాత్మక ఆటలు సదస్సులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కేరింతలు, చప్పట్లతో దివ్య గార్డెన్ ప్రాంగణం మారుమోగింది. చదువుతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ... ఇంటర్మీడియట్ విద్య అనేది విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన మైలురాయి. ప్రతి ఒక్కరూ ఇప్పట్నుంచే ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రమశిక్షణ, నిరంతర కృషి, ఆత్మవిశ్వాసాన్ని అలవర్చుకున్నప్పుడే అనుకున్న శిఖరాలను అధిరోహించగలరు. అని పిలుపునిచ్చారు.ఈ వేడుకలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్,అధ్యాపక బృందం,లెక్చరర్లు, సిబ్బంది అంతా విద్యార్థులతో కలిసి పాల్గొని సందడి చేశారు.

# జాతీయ రహదారులపై.. ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తాం

కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను మెదక్ జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేస్తామని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. రవాణా, రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ అధ్యక్షతన హైదరాబాద్ నుంచి నిర్వహించిన రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని జిల్లాలో చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రోడ్డు సేఫ్టీ కమిటీ ఇప్పటికే జాతీయ రహదారుల వెంట గుర్తించిన బ్లాక్ స్పాట్లలో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రమాదాలకు కారణమయ్యే లోపాలను గుర్తించి వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. రోడ్లపై అక్రమ పార్కింగ్, ఆక్రమణలు, ట్రాఫిక్‌కు ఆటంకాలు కలిగించే అంశాలపై టాస్క్‌ఫోర్స్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామని వెల్లడించారు. జాతీయ రహదారులపై పోలీసు, రవాణా, జాతీయ రహదారుల అధికారుల సమన్వయంతో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు వేగంగా వైద్య సేవలు అందించేందుకు జిల్లాలోని ఆసుపత్రులు, ట్రామా కేర్ లకు సంబంధించిన వివరాలను మ్యాపింగ్ చేసి సిద్ధంగా ఉంచుతామని తెలిపారు. అలాగే భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అవసరమైన కార్యాచరణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్ అండ్ బి ఈఈ శంకర్, అరుణ్, జాతీయ రహదారుల అధికారులు దివ్య, వేణు, వినోద్, రవాణా శాఖ అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కామన్ కమ్యూనిటీ షెడ్ ప్రారంభం

రూ.5 లక్షలతో షెడ్డు నిర్మాణం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని బిజెపి శాసనసభాపక్ష నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని దివ్యనగర్ కాలనీలో రూ.5 లక్షల కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మించిన కామన్ కమ్యూనిటీ షెడ్డును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దివ్యనగర్ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు . ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వినీష లక్ష్మి ,బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, కౌన్సిలర్లు గంజి రాజు, రావులవార్ విఠల్, కూన శశాంక్, శ్రీరామోజీ నరేష్,బీజేపీ నాయకులు జుట్టు దినేష్, సాదం అరవింద్, చందు, ఈశ్వర్, ఆనంద్, ప్రజోత్, జమాల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలలో పరిశుభ్రతకు ప్రాధాన్యత

కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో, మున్సిపాలిటీకి సంబంధించిన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో నిరంతరం మెరుగైన పారిశుద్ధ్య పనులు కొనసాగించాలని అన్నారు.వర్షాకాలం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్‌లు రవి బాబు, సుందర్ సింగ్, యాదయ్య, ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఒబిసి మహాసభల ఆహ్వాన కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కరపత్రాలను అందజేశారు. మండల సిఫారసులు అమలుపరచిన ఆగస్టు 7న ప్రతీ సంవత్సరం జాతీయ స్థాయిలో ఓబీసీ జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తెలిపారు. ఈ సంవత్సరం కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు నగరంలో ఓబీసీ 11వ జాతీయ మహాసభలను జరుగుతున్నాయని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు జాతీయ ఓబీసీ మహాసభ ఆహ్వాన కరపత్రాలను అందజేసినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న 80 కోట్ల మంది ఓబీసీల డిమాండ్ల పరిష్కారమే ధ్యేయంగా, రాజకీయ అధికారమే లక్ష్యంగా ఈ మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో మండల కమిషన్ సిఫారసులను అమలు చేసిన రోజును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఓబీసీ జాతీయ మహాసభను నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్స ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ ఏడాది 11వ జాతీయ మహాసభను బెంగళూరులోని డాక్టర్ మన్మోహన్‌సింగ్ సిటీ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ మహాసభకు 29 రాష్ట్రాల నుంచి ఓబీసీ ప్రతినిధులు హాజరవుతున్నారని నగర అధ్యక్షుడు దర్శనం దేవేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్, డీసీసీ నగర అధ్యక్షుడు రామకృష్ణ, సుధాకర్‌తో పాటు బుస్స ఆంజనేయులు, దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, చంద్రకాంత్, శ్రీలత, సాయి బసవ, దారం భూమన్న, గంగాధర్, సత్యనారాయణ, అనిల్, శ్రీనివాస్, నరహరి పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు

ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ అజ్మీరా శ్యామ్ నాయక్ సూచన



**ప్రజాపక్షం / వాంకిడి :** ఓటరు జాబితాలో అర్హులైన ప్రతీ ఒక్కరి పేరు నమోదయ్యేలా బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు), బూత్ లెవల్ ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ అజ్మీరా శ్యామ్ నాయక్ సూచించారు. మండల కాంగ్రెస్ కార్యాలయంలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బిఎల్ఏలు, బిఎల్ఓలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ఓటరు ఎవరూ విడుదలయ్యే జాబితా నుంచి తొలగిపోకుండా ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బంబారా సర్పంచ్ బెండరే కృష్ణజీ, ఖేడేగం సర్పంచ్ మాడవి భీమారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణ, మాజీ ఎంపిపి కిషన్, భీమారావు, బిసి ప్రెసిడెంట్ గణేష్, వార్డు సభ్యుడు పాండు, బిఎల్ఓలు, బిఎల్ఏలు, బూత్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు

# వెంటనే వంతెన నిర్మాణం పూర్తి

అప్పాపెలి గ్రామస్తుల విజ్ఞప్తి



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ మండలం అప్పాపెల్లి నుంచి మోతుగూడ వెళ్లే మార్గంలో నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు. పనులు పూర్తికాకపోవడంతో రెండు గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో వాగు ఉప్పొంగి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని, దీంతో విద్యార్థులు, రైతులు, అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రవాణా సౌకర్యం లేక ప్రాణాలను పణంగా పెట్టి రాకపోకలు సాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వేడుకుంటున్నారు.

# సదర్మాట్ కాల్వ దుస్థితిపై రైతుల్లో ఆందోళన



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్, కడెం మండలాలకు వరప్రదాయనిగా భావించే గోదావరి నదిపై నిర్మించిన సదర్మాట్ ఆయకట్టకు అనుసంధానంగా ఉన్న సదర్మాట్ ప్రధాన కాల్వ ప్రస్తుతం అధ్వాన్న స్థితికి చేరుకుంది.కాల్వలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో పాటు, సిమెంట్ గోడల్లో కూడా చెట్లు మొలిచి ప్రమాదకరంగా మారాయి. అయినప్పటికీ నీటిపారుదల శాఖ అధికారులు వాటి తొలగింపుపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆయకట్ట రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వలో పిచ్చి మొక్కలు,మట్టి పేరుకుపోవడంతో సాగునీరు పిల్లకాల్వలకు సక్రమంగా చేరడం లేదని రైతులు తెలిపారు. దీంతో పంట పొలాలకు నీటి సరఫరా దెబ్బతింటోందని, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాల్వపై ఉన్న తూముల నుంచి పిల్లకాల్వలకు నీరు వెళ్లే పైపులను కూడా అధికారులు సక్రమంగా పరిశీలించడం లేదని ఆరోపిస్తున్నారు.కాల్వలోని సీసీ లైనింగ్ భాగంలో అనేక చోట్ల మట్టి పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మేడంపల్లి,సుర్జాపూర్,మస్కాపూర్,గ్రామాలలో అలాగే ఖానాపూర్ పట్టణంలోని శ్రీరాంనగర్,అంబేద్కర్ నగర్ ప్రాంతాల వరకు కాల్వలో తుమ్మ చెట్లు,పిచ్చి మొక్కలు విస్తరించి ఉన్నాయని రైతులు పేర్కొన్నారు. ముఖ్యంగా శ్రీరాంనగర్ నుంచి అంబేద్కర్ నగర్ వరకు సైడ్ జాలి ఉందన్న కారణంతో చెట్లను పూర్తిస్థాయిలో తొలగించడం లేదని వారు విమర్శించారు. కాల్వ గట్టుపై పెరిగిన చెట్లు భవిష్యత్తులో కాల్వ నిర్మాణానికి నష్టం కలిగించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.సాగునీటి విడుదలకు ముందే కాల్వలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించి, పేరుకుపోయిన మట్టిని శుభ్రం చేసి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని ఆయకట్ట రైతులు నీటిపారుదల శాఖ అధికారులను కోరుతున్నారు. నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే చర్యలు చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు



**ప్రజాపక్షం / మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా శిశు సంక్షేమ ఆసుపత్రిలో పనిచేస్తున్న మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా ఆసుపత్రి ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రుల్లో రాత్రింబవళ్లు శ్రమిస్తూ రోగులకు సేవలు అందిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికులకు ఇఎస్ఐ పథకంలో వారి కుటుంబ సభ్యుల పేర్లను తక్షణమే నమోదు చేయాలని, అందరికీ ఇఎస్ఐ గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంలో ఆలస్యం చేస్తే ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు, ఏఐటియుసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు



**ప్రజాపక్షం / మందమర్రి :** మందమర్రి పట్టణంలోని ప్రశాంతి నగర్‌లో గుడుంబా విక్రయిస్తున్న మానుపాటి ఎల్లమ్మపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మందమర్రి ఎస్ఐ ఆదేశాల మేరకు బ్లూ కోర్టు కానిస్టేబుళ్లు రాజేందర్, కుమారస్వామి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఎల్లమ్మ ఇంటిని తనిఖీ చేయగా 5 లీటర్ల గుడుంబా లభ్యమవ్వడంతో దానిని స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేశారు. అక్రమంగా గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. గుడుంబా విక్రయాల సమాచారం తెలిస్తే పోలీసులకు అందించాలని కోరారు.

## ఖానాపూర్‌లో ప్రధాన రహదారి పనులు పునఃప్రారంభించాలి

కలెక్టర్‌కు మున్సిపల్ చైర్మన్ వినతి



**ప్రజా పక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలో నిలిచిపోయిన ప్రధాన రహదారి విస్తరణ, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పనులను వెంటనే పునఃప్రారంభించాలని కోరుతూ ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్, కౌన్సిలర్లు మంగళవారం నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొన్ని సంవత్సరాల క్రితం ప్రారంభమైన ప్రధాన రహదారి విస్తరణ, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పనులు రహదారికి ఇరువైపులా ఉన్న కొందరు ఇంటి యజమానులు కోర్టు నుంచి స్టే తీసుకురావడంతో నిలిచిపోయాయని తెలిపారు. దీంతో పనులు పూర్తికాక ట్రాఫిక్ సమస్యలు తీవ్రమయ్యాయని, వాహనదారులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే ఖానాపూర్ బస్టాండ్ నుంచి శ్రీరామ్‌నగర్ మీదుగా గోదావరి నది తీరం వరకు నూతన రహదారి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న ఇరుకైన రహదారి కారణంగా గోదావరి తీరం వద్ద జరిగే పుణ్య స్నానాలు, పండుగలు, అంత్యక్రియలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు కాలనీలోకి చేరడం కూడా కష్టంగా మారిందన్నారు. బస్టాండ్ సమీపంలోని సదర్‌మాట్ కాల్వపై నూతన వంతెన నిర్మించి, గోదావరి తీరం వరకు రహదారి వేయించాలని కోరారు. ఈ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని తమ పంట పొలాల నుంచి ఇవ్వడానికి శ్రీరామ్‌నగర్ కాలనీ రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొప్పరపు సత్యవతి, ప్రకాశ్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన వసతులు

జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య



**ప్రజాపక్షం / హాజీపూర్ :** విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, పరిశుభ్రమైన వసతులు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.చంద్రయ్య అన్నారు. హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామపంచాయతీ, లక్షెట్టిపేట, దండేపల్లి మండలం కర్ణపేట గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాల పరిశుభ్రత, తరగతి గదులు, వసతి, భోజనశాల, వంటశాల, తాగునీటి వసతులు, విద్యాబోధన, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంపుపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాల పరిశుభ్రతను కట్టుదిట్టంగా నిర్వహించాలని, క్లోరినేషన్ చేసిన సురక్షిత నీటిని అం దుబాటులో ఉంచాలని సూచించారు. గ్రామాల్లో శి థిలావస్థ లో ఉన్న ఇళ్లను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సుమన్, ఎంఇఒలు, ఎంపిడిఒలు, మున్సిపల్ అధికారులు, పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నా రు.

## కనుమరుగైన చేతిపంపునకు మోక్షం

ప్రజాపక్షం ఎఫెక్ట్



**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** చెట్ల పొదల్లో కనుమరుగైన చేతిపంపు దుస్థితిపై 'ప్రజాపక్షం' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించారు. వార్త ప్రచురితమైన మరుసటి రోజే అధికారులు స్పందించి, చేతిపంపు పరిసరాల్లో పేరుకుపోయిన ముళ్లపొదలు, చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగింపజేశారు. ఈ సందర్భంగా చేతిపంపులోని సాంకేతిక లోపాలను సరిచేసి, దానిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీర్ఘకాలంగా తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్న తాము, 'ప్రజాపక్షం' పత్రికలో వచ్చిన వార్త వల్లనే సమస్య పరిష్కారమైందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యను పత్రిక దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ప్రజాపక్షం దినపత్రిక యాజమాన్యానికి, త్వరితగతిన చర్యలు చేపట్టిన మున్సిపల్ అధికారులకు స్థానిక కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## పత్తి పంటకు జీవం పోసిన వర్షం

### రైతుల్లో చిగురించిన ఆశలు



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం:తిరుమలాయపాలెం మండలంలో కురిసిన భారీ వర్షంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. గత కొంతకాలంగా వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటూ నాటిన పత్తి పంట ఎండిపోతుందేమోనని ఆందోళన చెందిన రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. వర్షపు నీటితో పదును ఏర్పడటం పత్తి మొక్కలకు జీవం లభించిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం, కొక్కిరేణి, ఎర్రగడ్డ, తాళ్లచెరువు, బీరోలు, దమ్మాయిగూడెం, కేశవాపురం, తిప్పారెడ్డిగూడెం, హైదర్‌సాయిపేట, పాతర్లపాడు, జల్లేపల్లి, మాధురిపురం, సుబ్లేడు, కాకరవాయి, జూపెడ, పైనంపల్లి, సోలిపురం, బచ్చోడు, హస్నాబాద్‌తో పాటు పలు గ్రామాల్లో సోమవారం, మంగళవారం భారీ వర్షం కురవగా వర్షంతో ప్రతి పంట పొలాలు కళకళలాడుతున్నాయి. వర్షం అనంతరం రైతులు కలుపు తీయడం, ఎరువుల వేయడం, ఇతర వ్యవసాయ పనులను వేగవంతం చేశారు. ఖరీఫ్ సీజన్‌కు ఈ వర్షాలు ఎంతో ఉపయోగపడతాయని, రానున్న రోజుల్లో కూడా ఇదే విధంగా వర్షాలు కురిస్తే పంటలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల నిర్వహణ చేపట్టాలని సూచిస్తున్నారు.

## బంజారాల పవిత్ర ప్రకృతి పండుగ శ్రీసీత్లా భవానీ ఉత్సవాలు



ప్రజాపక్షం/బూర్గంపాడు:బంజారాల పవిత్ర ప్రకృతి ఆరాధన పండుగ శ్రీ సీత్లా భవానీ పండుగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బూర్గంపాడు మండలం అంజనాపురం గ్రామ శివారులో జరిగిన వేడుకల్లో భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ పాల్గొని బంజారా సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఈసందర్భంగా పీవో రాహుల్ మాట్లాడుతూ సీత్లా భవానీ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిని దైవంగా భావించి పూజించడం గిరిజన సంస్కృతిలో గొప్ప విశిష్టత అని పేర్కొన్నారు. తండాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు, పశువులకు ఆరోగ్యం కలగాలని సీత్లా భవానీ అమ్మవారిని ప్రార్థిస్తూ బంజారా సమాజం ఈ పండుగను తరతరాలుగా నిర్వహిస్తోందన్నారు. అంజనాపురం గ్రామ బంజారా ప్రజలు ఐటీడీఏ పీవో రాహుల్‌కు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బానోత్ నరసింహారావు, ఉప సర్పంచ్ భూక్య విజయలక్ష్మీ, బంజారా పెద్దలు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువతను మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలి




ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్: ప్రతి విద్యా సంస్థలోని యువతను మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం యువత కోసం ప్రారంభించిన మై భారత్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా యువజన కార్యక్రమాల సలహా సంఘం సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మై భారత్ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం యువతకు వివిధ రంగాలలో అవకాశం కల్పిస్తుందన్నారు.అలాగే ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులను కూడా తప్పనిసరిగా నమోదు చేయించాలన్నారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ వెంకట్రామ్ బాబు, జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జ్యోతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రవిప్రసాద్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, డిఎస్‌డివో సునీల్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'సర్' డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి: కలెక్టర్




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మంజిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రీవిజన్) కార్యక్రమాన్ని వేగవంతం చేసి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి. సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్ ప్రక్రియ, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్ నుండి కలెక్టర్ దివాకర టిఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా కలెక్టర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరిస్తూ ఖమ్మంజిల్లాలో 80 శాతం డిజిటలైజేషన్ పూర్తి అయిందని ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 65 శాతం డిజిటలైజేషన్ జరిగిందన్నారు. జిల్లాలో శాశ్వతంగా, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన ఓటర్ల సంఖ్య సుమారు 55వేలు (ఐదు శాతం) ఉండగా వాటిని కూడా పరిగణలోకి తీసుకుంటే 85 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లేనని ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు.ఒక్క రోజే జిల్లాలో 20వేల మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేశామని తెలిపారు.

## ఆయిల్ పామ్ సాగు రైతుల

# ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాది

### ఉమ్మడి ఖమ్మం జిల్లాలకు గోదావరి జలాలు అందించడమే జీవిత లక్ష్యం: మంత్రి తుమ్మల




ప్రజాపక్షం/ములకలపల్లి:ఆయిల్ పామ్ సాగు రైతుల ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పంటల మార్పిడే రైతులకు సరైన ప్రత్యామ్నాయమని సూచించారు. ములకలపల్లి మండలంలో మంగళవారం నిర్వహించిన ఆయిల్ పామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ప్రత్యామ్నాయ పంటలు, నీటి సంరక్షణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్యం వంటి మౌలిక సదుపాయాలతో పాటు గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గిరిజన పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జిల్లాలో సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే వర్షపాతం లోటు నమోదైందని, రానున్న నెలల్లో కూడా వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున బోర్లపై ఆధారపడి అధిక నీటి అవసరమున్న వరి సాగు చేయకుండా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ములకలపల్లి మండలంలో ప్రస్తుతం 8వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, మరో 10వేల ఎకరాల్లో సాగు విస్తరిస్తే ఈ ప్రాంతంలో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రైతు తన పొలంలో ఫామ్ పాండ్ నిర్మించుకుని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని తెలిపారు. దీని వల్ల భూగర్భజలాలు పెరిగి భవిష్యత్తులో వ్యవసాయానికి ఉపయోగపడతాయని చెప్పారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు గోదావరి జలాలు అందించడమే తమ జీవత లక్ష్య మని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్రంర్ల ఆయిల్ పామ్ సాగులో ముందంజలో ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 90వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, ఈ ఏడాది కొత్తగా 15వేల ఎకరాల్లో సాగు లక్ష్యం పెట్టుకున్నామని తెలిపారు. ఆయిల్ పామ్ నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభించి సుమారు 30 సంవత్సరాల పాటు రైతులకు స్థిరమైన ఆదాయం అందించే పంటగా నిలుస్తుందని చెప్పారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరన ప్రణాళిక అమలు చేస్తున్నామని వివరించారు. ఈసందర్భంగా మంత్రి, కలెక్టర్ రైతులకు రాయితీపై కంది, మినుము విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తహసీల్దార్, ఇద్దరు ఆర్ఐలకు బదిలీ

### 'ప్రజాపక్షా'నికి రైతుల కృతజ్ఞతలు

ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/బోనకల్:భూ లావాదేవీలకు సంబంధించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. "వార సత్వానికి తూట్లు.. భూ భారతికి వక్రభాష్యం" అనే శీర్షికతో ప్రజాపక్షం దినపత్రిక సోమవారం ప్రచురించిన ప్రత్యేక కథనంపై స్పందించిన ఉన్నతాధికారులు ప్రాథమిక విచారణ చేపట్టారు. విచారణలో ప్రజాపక్షం కథనంలో పేర్కొన్న అంశాలు వాస్తవమేనని ప్రాథమికంగా తేలడంతో బోనకల్ మండల తహసీల్దార్‌తో పాటు ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపై బదిలీ వేటు వేశారు. తహసీల్దార్ సుధాకర్‌ను కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయానికి, ఆర్ఐ 1 మైథిలిని కూసుమంచి మండలానికి, ఆర్ఐ 2ను ఎన్కూర్ మండలానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలతో బోనకల్ మండల రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజాపక్షం వెలుగులోకి తీసుకువచ్చిన కథనానికి విశేష స్పందన లభించగా, భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పలువురు బాధిత రైతులు పెద సంఖ్యలో ఫోన్ చేసి ప్రజాపక్షంకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలను పునఃసమీక్షించాలి



ప్రజాపక్షం/చుంచుపల్లి: ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై పునఃసమీక్ష చేపట్టి, అనారోగ్యంతో ఉన్న కార్మికులకు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఎఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపు మేరకు మంగళవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, విభాగాల్లో వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో ఎఐటీయూసీ నాయకులు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా సుమారు 2000 మంది కార్మికులు ఏళ్ల తరబడి మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తుండగా, కేవలం 120 మందికి మాత్రమే బోర్డు నిర్వహించడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. మెడికల్ బోర్డుకు ఎంపికైన వారిలో 28 మంది కార్మికులకు హాజరు కావాల్సిన సమాచారం సకాలంలో అందకపోవడం యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అలాగే బోర్డుకు హాజరైన 120 మందిలో కేవలం 24 మందిని మాత్రమే ఇన్వాలిడేషన్‌కు అర్హులుగా ప్రకటించడం గతంలో నిర్వహించిన మెడికల్ బోర్డులతో పోలిస్తే అత్యంత తక్కువ శాతమని తెలిపారు. బొగ్గు గనుల్లో, ముఖ్యంగా అండర్‌గ్రౌండ్‌లో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులు కీళ్ల నొప్పులు, వెన్నెముక సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ వాటిని సమగ్రంగా పరిగణనలోకి తీసుకోకుండా ఫలితాలు ప్రకటించడం వల్ల నిజంగా అనారోగ్యంతో ఉన్న కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి గట్టయ్య, ఉపాధ్యక్షులు కత్తర్ల రాములు, ఆఫీస్ బేరర్లు సందబోయిన శ్రీనివాస్, హీరాలాల్, కర్రు రమేష్, నాయకులు రాజాలపూడి సాంబమూర్తి, బండారి మల్లయ్య, సాయి పవన్, సందీప్, శశివర్ధన్ రెడ్డి, సురేంద్రరెడ్డి, వెంకటరమణ, కుమార్‌రావు, మురళి, అప్పారావు, కొవ్వూరు రాజేశ్వరరావు, అవినాష గావిని నాగరాజు, సుబ్రమణ్యం, మెంగన్ రవి, కోటి, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.



## ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు


- బ్లాక్ స్పాట్లలో శాశ్వత పరిష్కారం
- రావాణ శాఖ కమిషనర్ విసిలో పాల్గొన్న కలెక్టర్, సిపి



ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్: ఖమ్మం జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు, ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి జాతీయ రహదారులపై రోడ్డు భద్రతా ప్రమాణాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జాతీయ రహదారులపై రోడ్డు భద్రతా చర్యలు, ప్రమాదాల నివారణ, సుప్రీం కోర్టు మార్గదర్శకాల అమలు, అనుసరణ, నివేదికల సమర్పణ ప్రమాదాల తగ్గింపుకు తీసుకోవాల్సిన చర్యలు, జాతీయ రహదారుల వెంట ఉన్న ఆసుపత్రుల మ్యాపింగ్, ఆక్రమణల తొలగింపు, అత్యవసర స్పందన వ్యవస్థ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ దివాకర టిఎస్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్ నుండి సిపి సునీల్ దత్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.వీసీ అనంతరం సంబంధిత శాఖలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను, ఇప్పటికే గుర్తించనవి, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.జాతీయ రహదారిపై ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగించాలన్నారు. బ్లాక్ స్పాట్లను శాశ్వతంగా సరి దిద్దేందుకు అందుబాటులో ఉన్న నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాలన్నారు. ప్రతి నెల మూడవ శుక్రవారం జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించి సమీక్షించాలన్నారు.ఈ సమావేశంలో పిడి దివ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఒకే సారి మూడు నెలల రేషన్

### ఆగస్టు నుండి అక్టోబర్ కోటా పంపిణీకి సన్నాహాలు
### భద్రాద్రి జిల్లాలో మొత్తం 2,79,179 రేషన్ కార్డులు
### మూడు నెలలకుగానూ 16473 మెట్రిక్ టన్నులు సరఫరా



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వం మరో సారి మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి మూడు నెలల కోటా రేషన్ బియ్యం పంపిణీకి సన్నాహాలు ప్రారంభించారు. ఆగస్టు, సెప్టెంబర్ అక్టోబర్ ల బియ్యాన్ని ఒకే సారి లబ్ధిదారులకు అందించేందుకు అవసరమైన నిల్వలు, రవాణా తదితర అంశాలపై ప్రజాపంపిణీ పౌరసరఫరాల శాఖ సిద్ధమవుతోంది. మూడునెలల బియ్యాన్ని నిల్వ చేసుకునేందుకు రేషన్ డీలర్లు సైతం అవసరమైన స్టాక్ పాయింట్లను సమకూర్చుకుంటున్నారు.

**జిల్లాలో ఇలా:** జిల్లాలోని 23 మండలాల వ్యాప్తంగా 559 రేషన్ షాపులు ఉన్నాయి. ఈ మొత్తంగా 2,79,179 రేషన్ కార్డులు ఉండగా 915090 మంది సభ్యులున్నారు. వీరిలో ఒక్కక్కరికి నెలకు 6 కిలోల చొప్పున 5500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తారు.

**మిశ్రమ స్పందన :** మూడునెలల ప ంపిణీపై ఈ సారి కూడా శ్రీకారం చుట్టంగా, కైవలం జూన్ మెలలో మాత్రమే ఒక్క నెల బియ్యాన్ని అందించారు. ఇప్పుడు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాలకు సంబంధించి ఇవ్వనున్నారు. అయితే ఈ విధానంపై లబ్దిదారులు, రేషన్ షాపుల డీలర్లతో పాటు హమాలీలు, అధికారుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ఇలా మూడు నెలల రేషన్ ఒకేసారి ఇవ్వడం వల్ల తరుచూ రేషన్ దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుందని లబ్దిదారులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా రేషన్ షాపుల డీలర్లు మాత్రం మూడు నెలల స్టాక్ నిల్వలు పెట్టడానికి ఇబ్బందిగా మారుతోందని, మరో ప్రక్క మూడు నెలలకు సంబంధించి మూడు సార్లు వేలిముద్రలు వేయడం వల్ల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోదని అంటున్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులు

ప్రజాపక్షం/మణుగూరు:ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మణుగూరులో 2026–27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల (గెస్ట్ లెక్చరర్లు) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ యర్రం చిన్నప్పయ్య తెలిపారు. ఇంగ్లీష్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, కామర్స్, పొలిటికల్ సైన్స్ విభాగాల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉంది. సంబంధిత సబ్జెక్టులో కనీసం 55% మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. నెట్/సెట్/పీహెచ్‌డీ అర్హతలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుంది. దరఖాస్తులను అవసరమైన సర్టిఫికెట్లతో కలిసి జూలై 23 సాయంత్రం 4 గంటలలోపు ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలి.

## టెక్స్‌టైల్ రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేంటి?

### లోక్‌సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపి రఘురాంరెడ్డి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : టెక్స్‌టైల్ రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలపాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి లోక్‌సభలో ప్రశ్నించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా మంగళవారం టెక్స్‌టైల్ రంగానికి సంబంధించి ఎంపి రఘురాంరెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో ఆమోదించిన చేనేత, పవర్‌లూమ్ రంగాలకు అందుతున్న కేంద్ర సహాయం, ఎగుమతుల ప్రోత్సాహం, కార్మికుల సామాజిక భద్రతపై ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిట లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లి, హ్యాండ్‌లూమ్ పార్కు ద్వారా 189 యూనిట్లు, రంగారెడ్డి జిల్లాలోని వైట్‌గోల్డ్ టెక్స్ టైల్ పార్కు ద్వారా 10 యూనిట్లు పూర్తయి వాణిజ్య కార్యకలాపాలు సాగిస్తున్నాయని వివరించారు. వరంగల్‌లో పిఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్కు ద్వారా రూ. 3,862 కోట్ల పెట్టుబడితో 24,500 మందికి ఉపాధి లభించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు 2021 26 మధ్య కాలంలో చిన్న క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాల క్రింద 26 క్లస్టర్లు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. దీని కోసం రూ.1223.97 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించినట్లు ప్రత్యక్షంగా 4,971 మంది చేనేత కార్మికులు లబ్ది పొందారన్నారు. మోడిఫైడ్ గ్రూప్ వర్క్ షెడ్ పథకం క్రింద ఒక ప్రాజెక్టు మంజూరు కాగా 13.04 లక్షల గ్రాంట్‌లో రూ. 7.82 లక్షలు విడుదలయ్యాయన్నారు. మూతపడిన నాలుగు మిల్లులకు సంబంధించి 643 మంది కార్మికులకు రూ.3.19 కోట్లు పంపిణీ చేశామన్నారు. హైదరాబాద్ సర్వీస్ సెంటర్ ద్వారా 1586 మంది ట్రైనీలకు శిక్షణ ఇచ్చి కామన్ ఫెసిలిటీస్ సెంటర్ కోసం రూ. 2 కోట్లు, నూలు బ్యాంక్ కార్పస్ ఫండ్ కొరకు రూ. 1.98 కోట్లు విడుదల చేశామన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం క్రింద 54387 మంది నమోదు కాగా సహజ మరణాలకు సంబంధించి 262 క్లైయిమ్స్ క్రింద రూ.21950000, ఎస్ఏస్వై క్రింద 4,902 మంది విద్యార్థులకు రూ.5872800 ఉపకార వేతనాలు పంపిణీ అయ్యాయని తెలిపారు. ఎగుమతి ప్రోత్సాహక పథకాలు అమలులో ఉన్నాయని తెలిపారు.


## 'సర్'లో బిఎల్ఎలు, పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా పనిచేయాలి

### ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి : సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా




ప్రజాపక్షం/చుంచుపల్లి:ఎస్ఐఆర్ ప్రక్రియలో పార్టీ శ్రేణులు, బిఎల్ఏలు క్రియాశీలకంగా పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా పిలుపునిచ్చారు. పారదర్శకమైన, తప్పుల్లేని ఓటరు జాబితా రూపకల్పనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం చుంచుపల్లి మండల పరిధిలోని గౌతంపూర్, రుద్రంపూర్, పెనగడప గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులకు ముఖ్య అతిథిగా హాజరైన సాబీర్ పాషా మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన సాధనమని, అర్హులైన పౌరులెవరూ ఓటరుగా నమోదు కాకుండా ఉండిపోకూడదని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించడమే కాకుండా, ప్రస్తుతం ఉన్న ఓటర్ల ఓటు హక్కు రద్దు కాకుండా బిఎల్ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు) ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ఓటర్ల జాబితాలోని తప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామాల మార్పు వంటి అంశాలను బిఎల్ఏలు నిరంతరం పర్యవేక్షిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న బిఎల్ఓలు, ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయిలో మద్దతుగా నిలిచి సహకరించాలని కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేసి, పారదర్శకమైన జాబితా తయారీ ద్వారానే ప్రజాస్వామ్యం మరింత పరిపుష్టమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సుల్లో మేయర్ మూడ్ గణేష్, నాయకులు సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, గానగళ్ల వీరాస్వామి, వట్టికొండ మల్లికార్జున్ రావు, తోట రాజు, కె.రాములు, నీడలా సుధాకర్, వెంకన్న, కట్ట ఉదయ్, జగదాంబ, తాజుద్దీన్, సర్పంచ్ కళ్యాణి, సతారాములు, బివి రమణ, బండారి మల్లయ్య, లక్ష్మణ్, గంగారాం, కొవ్వూరి రాజేశ్వరరావు, గుడిపూడి రవి, జోసెఫ్, బిక్షపతి, గిరిజాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టూరిస్ట్ బస్సు, డిసిఎం ఢీ డిసిఎం డ్రైవర్ మృతి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:ప్రైవేట్ బస్సు డ్రైవర్ అతివేగం అజాగ్రత్త కారణంగా ఓ డీసీఎం డ్రైవర్ అత్యంత విషాదకరంగా మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు మండలం సీతంపేట గ్రామానికి చెందిన పూటి తేజ(24) చేపలుపట్టే వాళ్ళతో సూర్యాపేట జిల్లా, మోతే మండలం, నామవరం గ్రామానికి వెళ్లి డీసీఎం తోలుకుంటూ సత్తుపల్లికి తిరిగివస్తున్నాడు. ఈ నేపథ్యంలో మార్గం మధ్యలోని కోదాడక్రాస్‌రోడ్ దగ్గరకు రాగానే ఖమ్మం వైపు నుండి హైదరాబాద్ వైపు వెలుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ పూటి తేజ తల మొండెం నుంచి వేరయ్యింది. అలాగే బస్సు డ్రైవర్‌కి స్వల్ప గాయాలు అయ్యాయి. అందులో ప్రయాణిస్తున్న ప్యాసింజర్లకు ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుడు కూటి వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ ముష్కరాజు తెలిపారు.

## విద్యార్థులపై లాఠీఛార్జి..
# అట్టుడికిన ఉభయసభలు

నీట్ పేపర్ లీక్, రామాలయ విరాళాల చోరీపై చర్చించాలని పట్టుబట్టిన విపక్ష సభ్యులు
లోక్‌సభ, రాజ్యసభలో కొనసాగిన వాయిదాల పర్వం
రెండవ రోజూ తుడిచిపెట్టుకుపోయిన కార్యకలాపాలు



**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్, సోమవారం ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీఛార్జి, అయోధ్య రామ మందిర విరాళాల దొంగతనం వివాదం పార్లమెంట్ ఉభయసభల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ, రాజ్యసభ బుధవారానికి వాయిదా పడింది. కాగా, లోక్‌సభలో రెండవ రోజు కూడా ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు. నీట్ పేపర్ లీక్, సిజెపి నిరసన, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీపై చర్చ పట్టుబడుతూ ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలిపారు. నినాదలు చేశారు. దీంతో సభ అట్టుడికింది. కార్యకలాపాలకు పదేపదే అంతరాయాలు ఏర్పడటంతో సభను వాయిదా వేశారు. ఉదయం 11 గంటలకు సభ మొదటి ప్రశ్నను చేపట్టగానే, ప్రతిపక్ష సభ్యులు నీట్ పేపర్ లీక్, నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జిపై నినాదాలు చేయడం ప్రారంభించారు. నిబంధనల ప్రకారం తమ సమస్యలను లేవనెత్తే అవకాశం సభ్యులకు కల్పిస్తామని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హామీ ఇచ్చారు. అయితే, నిరసన చేస్తున్న సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో, బిర్లా సభను వాయిదా వేశారు. ఆ తర్వాత, మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి ప్రారంభం కాగానే, ప్రతిపక్ష సభ్యులు మళ్లీ నినాదాలు చేయడం మొదలుపెట్టారు. ఈ గందరగోళం మధ్య మంత్రులు పార్లమెంటరీ పత్రాలను సభలో ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష సభ్యులు తమ తమ స్థానాలకు తిరిగి వెళ్లాలని సభాపతి పదేపదే కోరినా సానుకూల స్పందన రాకపోవడంతో, సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు, ప్రతిపక్షాల నిరసనలు, నినాదాలు కొనసాగాయి. అధ్యక్ష స్థానంలో ఉన్న దిలీప్ సైకియా, ప్రతిపక్ష సభ్యులు తమ తమ స్థానాలకు తిరిగి వెళ్లి సభా కార్యకలాపాలలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ప్రతిపక్ష సభ్యులు ఆ విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంతో, స్పీకర్ సభను మరుసటి రోజుకు సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

### రాజ్యసభ పలుమార్లు వాయిదా

కాగా, ఇవే అంశాలపై అటు రాజ్యసభలోను విపక్ష సభ్యులు నిరసనకు దిగారు. దీంతో మంగళవారం మధ్యాహ్న భోజనానంతరం రాజ్యసభ సమావేశమైన వెంటనే సభా కార్యకలాపాలను మరుసటి రోజుకు వాయిదా వేశారు. అంతకుముందు, అధికారిక పత్రాలను సభ ముందు ఉంచిన అనంతరం, ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, వైద్య ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రాలు లీకయ్యాయన్న ఆరోపణలపై సోమవారం నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసుల చర్య గురించి మాట్లాడారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జి చేశారని, పోలీసులు బాష్పవాయువు కూడా ప్రయోగించారని ఖర్గే ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలు అధికార పక్ష సభ్యుల నినాదాలకు దారితీయగా, ప్రతిపక్షాల ప్రతినినాదాలతో సభ దద్దరిల్లింది. గందరగోళం మధ్య, చైర్మన్ సి పి రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం సభ తిరిగి సమావేశమైనప్పుడు, కొనసాగుతున్న గందరగోళం మధ్య సెక్రటరీ జనరల్ పి సి మోదీ లోక్‌సభ నుండి వచ్చిన ఒక సందేశాన్ని చదివి వినిపించారు. ఎన్ ఆర్ ఎలాంగో, దీపక్ ప్రకాష్‌ల పదవీ విరమణ వల్ల ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడానికి, లాభదాయక పదవులపై ఏర్పాటు చేసే సంయుక్త కమిటీకి ఇద్దరు సభ్యులను రాజ్యసభ ఎన్నుకోవాలని సిఫార్సు చేస్తూ, లోక్‌సభ తన సోమవారం నాటి సమావేశంలో ఒక తీర్మానాన్ని ఆమోదించిందని మోదీ సభకు తెలియజేశారు. అయితే విపక్ష సభ్యులు నిరసన కొనసాగించడంతో, చైర్మన్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు రెండవసారి వాయిదా వేశారు.

## అమానుష దాడిపై
# చర్చకు అనుమతించండి


లోక్‌సభ స్పీకర్‌కు ప్రతిపక్ష ఎంపిల విజ్ఞప్తి
ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతో పాటు ఓమ్‌బిర్లాను కలిసిన విపక్ష ఎంపిలు



**న్యూఢిల్లీ :** పరీక్షల నిర్వహణలో నెలకొన్న సంక్షోభం, విద్యార్థులపై జరిగిన అమానుష దాడిపై లోక్‌సభలో చర్చకు అనుమతించాలని విపక్ష సభ్యులు స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష ఎంపిలతో కలిసి మంగళవారం వారు ఓమ్ బిర్లాను కలిశారు. సభ కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందే, రాహుల్ గాంధీతో పాటు ఎస్‌పికి చెందిన ధర్మేంద్ర యాదవ్, శివసేన (యుబిటి)కి చెందిన అరవింద్ సావంత్, ఆర్‌ఎస్‌పికి చెందిన ఎన్.కె. ప్రేమచంద్రన్ తదితరులు స్పీకర్ కార్యాలయంలో ఆయనను కలిశారు. విద్యార్థులపై జరిగిన అమానుష దాడి, పరీక్షల సంక్షోభం విషయంలో ప్రభుత్వానికి ఉన్న బాధ్యతారాహిత్యంపై పార్లమెంటులో సమగ్ర చర్చ జరగాలని, తమ భవిష్యత్తు గురించి న్యాయమైన ప్రశ్నలు అడిగినందుకు విద్యార్థులపై దాడి జరిగిందని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు. భారత యువత భవిష్యత్తు గురించి పార్లమెంటు చర్చించలేక పోతే, ఇక దాని ఉనికికి అర్థం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాన్ని ప్రతిపక్షం అణచివేయనివ్వదు. విద్యార్థుల గళం వీధుల్లోనూ, పార్లమెంటులోనూ వినిపించేలా చూస్తామన్నారు. పేపర్ లీక్ వ్యవహారం, విద్యార్థులపై జరిగిన దాడి విషయంపై హోం మంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ విప్ మాణిక్కం ఠాగూర్ తెలిపారు. అంతకుముందు, పార్లమెంటు వర్షాకాల సమావేశాల రెండో రోజు ప్రారంభానికి ముందు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో 'ఇండియా' కూటమి ఫ్లోర్ లీడర్లు సమావేశమై, తమ తదుపరి వ్యూహంపై చర్చించారు. ఈ సమావేశంలో ఖర్గేతో పాటు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు జైరాం రమేష్, కె.సి. వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ధర్మేంద్ర యాదవ్, ఎన్‌సిపి (ఎస్‌పి)కి చెందిన సుప్రియా సూలే, శివసేన (యుబిటి)కి చెందిన సంజయ్ రౌత్, జెఎంఎంకు చెందిన మహువా మాజీ, సిపిఐకి చెందిన పి. సందోష్ కుమార్, సిపిఐ(ఎం)కు చెందిన జాన్ బ్రిట్టాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలకు
# ఇది సమయం కాదు..

జవాబుదారీతనం కోరి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాల్సిన రోజు
తన పుట్టినరోజు వేడుకలపై మల్లికార్జున ఖర్గే వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** లాఠీచార్జీలు, బాష్ప వాయువు షెల్స్ ప్రయోగించడం, శాంతియుత ప్రజాస్వామ్య నిరసనను అణచివేయడం వంటి కేంద్ర సర్కార్ చర్యలను యావత్ దేశం చూసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఈ బాధాకరమైన పరిస్థితుల్లో తాను తన పుట్టినరోజు జరుపుకోకూడదని నిర్ణయించుకున్నానని చెప్పారు. 'ఈ రోజు సంబరాలు చేసుకునే రోజు కాదు, జవాబుదారీతనం కోరి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాల్సిన రోజు' అని మంగళవారం 84వ ఏట అడుగుపెట్టిన ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య తల్లి తన పసిబిడ్డలతో ఇలా ప్రవర్తించకూడదని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. అయితే 'నాకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు, శ్రేయోభిలాషులు మరియు ప్రతి పౌరుడికి నేను హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మీ ఆప్యాయత నాకు ఎంతో విలువైనది, మీలో ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని ఖర్గే అన్నారు. కానీ ఈ రోజు సంబరాలు చేసుకునే రోజు కాదు, ఇది జవాబుదారీతనం కోరే రోజు, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించండని అని అన్నారు. న్యాయం కోరుతున్న విద్యార్థులపై క్రూరమైన లాఠీలు, బాష్ప వాయువు ఎందుకు ప్రయోగించారని ప్రయోగించారు. పార్లమెంటును ఎందుకు సీల్ చేశారు, ఇంటర్నెట్‌ను ఎందుకు నిలిపివేశారని ప్రభుత్వాన్ని నిలదీశారు. పదేపదే జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకేజీలకు, లక్షలాది మంది యువత పడుతున్న బాధకు ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. ఈ విషయంపై పార్లమెంటులో పూర్తిస్థాయి చర్చకు ప్రభుత్వం తక్షణమే అనుమతించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయానికి నైతిక, రాజకీయ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఖర్గే అన్నారు.

## సిజెపి 'చలో సంసద్'ఘటనలో
# నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు



**న్యూఢిల్లీ :** కాక్‌రోచ్ జనతా పార్టీ (సిజెపి), విద్యార్థులు సోమవారం (జులై 20) నిర్వహించిన 'సంసద్ చలో' యాత్ర సందర్భంగా జరిగిన విధ్వంసం, ఇతర సంఘటనలకు సంబంధించి ఢిల్లీ పోలీసులు నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. మరో రెండు కేసులు నమోదు చేసే దిశగా పోలీసులు చర్యలు చేపడుతున్నారని మంగళవారం సంబంధిత వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ స్ట్రీట్, కన్నాట్ ప్లేస్, ఇతర పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయబడ్డాయని వివరించారు. భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) ఆయుధాల చట్టం, ప్రభుత్వ ఆస్తుల నష్ట నివారణ చట్టంలోని పలు నిబంధనలను వర్తింపజేశారని వారు చెప్పారు. కన్నాట్ ప్లేస్‌లోని 'రీగల్ సినిమా' సమీపంలోజరిగిన హింస, రాళ్లదాడికి సంబంధించి ఒక ఎఫ్ఐఆర్ నమోదుకాగా, చట్టవిరుద్ధంగా గుమిగూడటం, పార్లమెంట్ సమావేశాల సందర్భంగా అనధికారికంగా డ్రోన్ ఎగురవేయడం, హింస వెనక కుట్ర ఉందంటూ వేర్వేరు కేసులు నమోదు అయ్యాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, ఇతర సంబంధిత నేరాలకు సంబంధించి మరో రెండు ఎఫ్ఐఆర్‌లు కూడా సిద్ధం చేస్తున్నారని ఒక పోలీస్ అధికారి తెలియజేశారు. ఈ ఎఫ్ఐఆర్‌లో ప్రజా ఆస్తి నష్ట నివారణ చట్టంలోని నిబంధనలను కూడా పొందుపరిచారు. నిందితులు చట్టవిరుద్ధంగా గుమిగూడి, ప్రజా శాంతికి భంగం కలిగించి, ప్రభుత్వ విధులను నిర్వర్తించనీయకుండా అడ్డుకుని, హింసకు పాల్పడ్డారని, ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించినట్లు ఆరోపణలు ఉన్నాయని ఎఫ్ఐఆర్‌లో నమోదయ్యాయి.మార్చ్ సందర్భంగా కన్నాట్ ప్లేస్, ఔటర్ సర్కిల్‌లోని రీగల్ సినిమా సమీపంలో జరిగిన హింస, రాళ్లదాడి, పోలీస్ వాహనాల విధ్వంసానికి సంబంధించి గుర్తు తెలియని వ్యక్తులపై మరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వర్గాలు తెలిపాయి. హింసాకాండ సమయంలో నిరసనకారులు పోలీసుల మీద రాళ్లు రువ్వడంతో పాటు ఆ ప్రాంతంలో మోహరించిన పోలీస్ వాహనాలను కూడా ధ్వంసం చేశారని ఒక అధికారి చెప్పారు. హింసాకాండలో పాల్గొన్నవారిని గుర్తించేందుకు దర్యాప్తు అధికారులు సిసిటివి ఫుటేజీ, డ్రోన్ దృశ్యాలు, మొబైల్ ఫోన్ వీడియోలు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను పరిశీలిస్తున్నారు. విచారణలో భాగంగా సోషల్ మీడియా కంటెంట్, ఇతర డిజిటల్ సమాచారాన్ని కూడా వారు విశ్లేషిస్తున్నారని వర్గాలు తెలిపాయి.సోమవారందేశరాజధానిలో చోటుచేసుకున్న ఘర్షణల నేపథ్యంలో ఢిల్లీలో పోలీసుల భద్రతను కట్టుదిట్టం చేశారు.

# సిక్కింలో కుప్పకూలిన టన్నెల్

కొండచరియలు విరిగిపడడంతో పెనుప్రమాదం
అధికారులు, కార్మికులు సహా సొరంగంలో చిక్కుకున్న 25 మంది
10 మంది మృత్యువాత
కొనసాగుతున్న గాలింపు, సహాయక చర్యలు




**గ్యాంగ్‌టక్ :** సిక్కింలో ఘోర ప్రమాదం సంభవించింది. నామ్చి జిల్లాలో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో నిర్మాణంలో ఉన్న సొరంగం కూలిపోయింది. ఈ ఘటనలో పది మంది మృత్యువాత పడినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఘటనాల్థలిలో గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని నామ్చి జిల్లా అధికారి పేర్కొన్నారు. జోలుంగేలోని సమర్దుంగ్‌లో ఉన్న ఎన్‌హెచ్‌పిసి తీస్తా స్టేజ్–4 జలవిద్యుత్ ప్రాజెక్ట్ సొరంగం కొండచరియలు విరిగిపడటం వల్ల కూలిపోయిందని సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ తెలిపారు. సోమవారం ఎడిఐటి–3 సొరంగం అకస్మాత్తుగా కూలిపోయినప్పుడు, ప్రాజెక్ట్ అధికారులు, కార్మికులతో సహా మొత్తం 25 మంది అందులో చిక్కుకుపోయారని ఆయన చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తనతో మాట్లాడి, సహాయక చర్యల గురించి ఆరా తీశారని ముఖ్యమంత్రి తెలిపారు.
'మంగళవారం ఉదయం 9.30 గంటల వరకు పది మృతదేహాలను వెలికితీశారు. మరణించిన వారిలో ఏడుగురిని గుర్తించారు, కాగా గుర్తించని మూడు మృతదేహాలను సింగ్టమ్ జిల్లా ఆసుపత్రికి, ఎస్‌టిఎన్ఎం ఆసుపత్రికి తరలించారని నామ్చి పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తించిన ఏడుగురు మృతులలో నలుగురు పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురికి చెందినవారు కాగా, అసోం, పంజాబ్, ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లకు చెందినవారు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. మరొకరు నామ్చి నివాసి అని పోలీసులు తెలిపారు. 'ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ విషాద సమయంలో, రాష్ట్రం మొత్తం ఆ కుటుంబాలకు అండగా ఉంది, ఈ క్లిష్ట సమయంలో మేము వారికి దృఢంగా మద్దతుగా నిలుస్తాము' అని తమాంగ్ ఒక ప్రకటనలో అన్నారు. కొనసాగుతున్న సహాయక చర్యలను తాను నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. సొరంగంలో చిక్కుకున్న మిగిలిన కార్మికుల మృతదేహాలను వెలికితీసేందుకు నామ్చి జిల్లా యంత్రాంగం, సిక్కిం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఎస్ఎస్‌డిఎంఎ), సిక్కిం పోలీసులు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్ఎఫ్), అగ్నిమాపక, అత్యవసర సేవల విభాగం, అలాగే పాక్యోంగ్, సిలిగురి నుండి వచ్చిన జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌టిఆర్ఎఫ్) బృందాలు ఇతర ప్రత్యేక ఏజెన్సీలతో కలిసి అవిశ్రాంతంగా పనిచేస్తున్నాయని తమాంగ్ చెప్పారు. ఘటనపై ప్రధాని మోదీ ఫోన్ చేసి ఆరా తీశారన్నారు. 'బాధిత కార్మికులు, సోమవారం నాడు, నిర్మాణంలో ఉన్న సొరంగం ప్రవేశద్వారం వద్ద కొండచరియలు విరిగిపడటం, మధ్యాహ్న సమయంలో గ్యాస్ లీక్ అయ్యే అవకాశం ఉండటంతో సుమారు 27 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయారని జిల్లా అధికారులు తెలిపారు. సొరంగం లోపల గ్యాస్ ఉండటం వల్ల సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడిందని, చిక్కుకుపోయిన కార్మికుల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన పలువురు సిబ్బందికి తల తిరగడం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు ఎదురయ్యాయని వారు చెప్పారు.

## పేపర్ లీకేజీల నివారణకు
# రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రావాలి


'మంగళ మిలన్' సమావేశంలో ప్రధాని మోదీ పిలుపు
సమస్య పరిష్కారానికి పార్టీలకు అతీతంగా అందరితో చేతులు కలుపుతాం
లాయర్ల సహాయంతో లీకేజీ నేరస్థులకు వీలైనన్ని కఠిన శిక్షలు
సాక్ష్యాలతో నిరూపించేందుకు కట్టుదిట్టమైన ఉమ్మడి వ్యవస్థ
విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా చర్యలు తీసుకున్నాం



**న్యూఢిల్లీ:** ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో భవిష్యత్తులో విద్యార్థుల జీవితాలతో ఎవరూ చెలగాటం ఆడకుండా ఉండేందుకు వీలుగా కఠిన చర్యలు తీసుకున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ప్రతి మంగళవారం జరిగే ఎన్‌డిఎ పార్లమెంటరీ పార్టీ ఎంపీల సమావేశం''మంగళ మిలన్'లో మోదీ ప్రసంగిస్తూ, ఈ ప్రశ్నాపత్రాల లీకేజీ బెడద నివారణకు జాతీయ ప్రయోజనాల రీత్యా రాష్ట్రాలలోని ప్రభుత్వాలు కూడా కలిసి రావాలని పిలుపు ఇచ్చారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం సమస్య పరిష్కారానికి పార్టీలకు అతీతంగా అందరితో చేతులు కలుపుతుందని చెప్పారు. నేరస్థులను శిక్షించేందుకు, సాక్ష్యాధారాలతో సహా అన్నీ నిరూపించేందుకు కట్టుదిట్టమైన ఒక ఉమ్మడి వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఆయన ఉద్ఘాటించారు. ఈ లీకేజీ వ్యవహారాలలో నేరస్థులుగా తేలినవారికి దేశ అత్యున్నత న్యాయవాదుల సహాయంతో వీలైనన్ని కఠిన శిక్షలు పడేట్టు చూస్తామన్నారు.
రాబోయేకాలంలో ఇక ప్రశ్నాపత్రాల లీకేజీలు ఎదురుకాకుండా మళ్ళీ జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నామన్నారు.
కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) నాయకత్వంలో పలు విద్యార్థి,యువజన సంఘాలన్నీ కలిసి సోమవారం వేలాదిమందితో పార్లమెంటుకు నిర్వహించతలపెట్టిన భారీ ప్రదర్శనను పోలీసులు భగ్నం చేసి అతి పెద్ద కళంకాన్ని మూటగట్టుకున్న ఒక రోజు తర్వాత ప్రధానమంత్రి మోదీ ఎన్‌డిఎ ఎంపీల సమావేశంలోఈ విషయం గురించి ప్రముఖంగా మాట్లాడారు. ఈ సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ వివరాలన్నీ తెలియజేశారు. సమావేశానికి ప్రతి ఎంపీ తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా ప్రధానమంత్రి ముందుగానే మార్గదర్శకాలు జారీ చేశారని చెప్పారు. గంటసేపు ప్రధానమంత్రి ఈ సమావేశంలో ప్రసంగించారని చెప్పారు. ప్రశ్నాపత్రాల లీజీలకు సంబంధించిన వ్యవహారంలో ఇప్పటి వరకూ ప్రభుత్వం 13 మందిని అరెస్టు చేసి జైలుకు పంపామని కూడా ఎంపీలకు మోదీ వివరించారన్నారు. ''అదే సమయంలో ప్రధానమంత్రి ఏం చెప్పారంటే, విద్యార్థుల భవిష్యత్తుకు ఇక రాబోయే కాలంలో ఎలాంటి ఆటంకాలు రాకుండా, సమస్యలు ఎదురు కాకుండా చూసేందుకు నీట్ పునఃపరీక్షకు తాము ప్రాధాన్యత ఇచ్చామని, ఈ పునఃపరీక్షను చాలా విజయవంతంగా నిర్వహించామని, పరీక్షా ఫలితాలను ఎలాంటి జాప్యం లేకుండా విడుదల చేశామని చెప్పారు'' అని రిజుజు పాత్రికేయులతో అన్నారు.
రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన ఎంపీలుసహా బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. నితిన్ నబీన్ ఇటీవల రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ సమావేశం ద్వారా ఎన్నో మంచి ఫలితాలు వచ్చాయని, ప్రధానమంత్రి చాలా ముఖ్యమైన విషయాలు సమావేశంలో మాట్లాడారని చెప్పారు. దేశంలో గడచిన కొద్ది నెలలుగా ఎన్‌డిఎ ప్రభుత్వం సాధించిన విజయాలను మోదీ వివరించారని చెప్పారు. అనేక దేశాలతో ఎన్‌డిఎ ప్రభుత్వం చేసుకున్న స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాల గురించి ఆయన వివరించారని చెప్పారు.దేశంలో రైతు,వ్యాపారులు,చిన్న,సూక్ష్మ పరిశ్రమలు,యువకులు,నిరుద్యోగుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని ఈ ఒప్పందాలు చేసుకున్నామని చెప్పారన్నారు. ఏ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం చేసుకున్నా దానిలో మన దేశ రైతుల ప్రయోజనాలే ప్రధానంగా ఉంటాయని చెప్పారన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎన్‌డిఎ ఎంపీలు కీలకపాత్ర నిర్వహిస్తారన్నారు.''అన్నిముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసేందుకు మేం ఐక్యంగా ఉన్నాం,జాతీయ ప్రయోజనాలకోసమే ఈ బిల్లులను సభముందుకు తీసుకువస్తాం,మేం ప్రతిపక్షాలకు కూడా విజ్ఞప్తి చేస్తున్నాం, వారికి భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు, కానీ వారు కూడా దేశంకోసం ముందుకు రావాలి,దేశ భవిష్యత్తు,దేశ యువకుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతిపక్ష ఎంపీలు ముందుకు రావాలి'' అని కిరెణ్ రిజుజు కోరారు.

## సోనమ్ వాంగ్‌చుక్‌ను..
# ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించేందుకు 'ఢిల్లీ హైకోర్టు ఒకే'

సతీమణి గీతాంజలి ఆంగ్మో
పిటిషన్‌పై ఆదేశం జారీ



**న్యూఢిల్లీ :** విద్యా వ్యవస్థలో వైఫల్యాలపై 20రోజులకు పైగా నిరాహారదీక్ష చేస్తున్న హక్కుల కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేందుకు ఢిల్లీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సోనమ్ వాంగ్‌చుక్ ఆందోళనను విస్మరించలేమనే అభిప్రాయాన్ని వ్యక్తంచేసింది. దీంతో వాంగ్‌చుక్‌కు ఊరట లభించింది. ఆయన సతీమణి గీతాంజలి జె.ఆంగ్మో కోర్టులో పిటిషన్ వేయడం ద్వారా చేస్తున్న న్యాయపోరాటం ఫలితాన్ని ఇచ్చింది. పరీక్షల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని గత నెల 28వ తేదీ నుంచి నిరాహారదీక్ష చేస్తున్న హక్కుల కార్యకర్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను తక్షణమే ఇక్కడి సఫ్దర్‌జంగ్ హాస్పిటల్ నుంచి గుర్‌గావ్‌లోని మెదాంత హాస్పిటల్‌కు తరలించాలని ఢిల్లీ హైకోర్టు మంగళవారం ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వ హాస్పిటల్‌లో ఆయనకు జరుగుతున్న చికిత్సలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ హైకోర్టు ఆదివారం ఇచ్చిన ఉత్తర్వుకు వ్యతిరేకంగా సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి డి.కె.ఉపాధ్యాయ, జస్టిస్ తేజాస్ కరియాలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాన్ని జారీ చేశారు. వాంగ్‌చుక్‌ను నిరంతరం పర్యవేక్షించడానికి అవసరమైన వైద్యులను ఏర్పాటు చేయాలని కోర్టు మేదాంత హాస్పిటల్ డైరెక్టర్‌ను ఆదేశించింది. వైద్యులచే ఆమోదించబడిన, వైద్య ప్రమాణాలు, నియమావళికి అనుగుణంగా మందులు ఇవ్వాలని 'దానికి అప్పీల్‌దారు భర్త కట్టుబడి ఉండాలి' అని హైకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21 ప్రకారం సోనమ్ వాంగ్‌చుక్ ప్రాథమిక హక్కులన నెరవేర్చే విధంగా, అతడిని తనకు నచ్చిన హాస్పిటల్ అయిన మెదాంత ఆసుపత్రికి తరలించాలని పేర్కొంది. సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె. ఆంగ్మో కోరుకున్నప్పుడు ఆయనను సందర్శించడానికి అనుమతి ఉంటుందని కూడా ఆ ఆదేశంలో పేర్కొన్నారు. విచారణ సందర్భంగా వాంగ్‌చుక్‌ను మెదాంత హాస్పిటల్‌కు తరలించడానికి ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతర లేదని ధర్మాసనానికి సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. 'మెదాంత ఒక పేరొందిన ఆసుపత్రి. అతడిని ఆ హాస్పిటల్‌క తరలించడానికి ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదు' అని మెహతా అన్నారు. ఎఐఐఎంఎస్ (ఎయిమ్స్) డాక్టర్లతో పాటు, సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌లో సోనమ్ వాంగ్‌చుక్‌కు వైద్యం అందిస్తున్న డాక్టర్ల బృందం, సోనమ్ వాంగ్‌చుక్ సొంత వైద్యులను కూడా కోర్టు సంప్రదించి ఒక ఏకాభిప్రాయం ఉన్నట్లు గమనించింది. ఆదివారం జరిగిన ఒక ప్రత్యేక విచారణలో సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో సోనమ్ వాంగ్‌చుక్‌కు జరుగుతున్న చికిత్స విషయంలో జోక్యం చేసుకోవడానికి జస్టిస్ మిని పుష్కర్ణ నిరాకరించారు. నిరాహారదీక్ష చేస్తున్న వాంగ్‌చుక్‌ను జంతర్ మంతర్ నుంచి ఒక ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించడాన్ని ఏకపక్షచర్యగా పరిగణించలేమని జస్టిస్ మిని పుష్కర్ణ పేర్కొన్నారు. తన నిరాహారదీక్ష 21న జంతర్‌మంతర్ నిరసన స్థలం నుంచి హక్కుల కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను ఢిల్లీ పోలీసులు బలంతంగా అదుపులోకి తీసుకుని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌కు తరలించిన ఒక రోజు అనంతరం ఆదివారం ఆయన భార్య గీతాంజలి జె.ఆంగ్మో తన పిటిషన్‌పై తక్షణ విచారణను కోరారు.
**హైకోర్టు మా వాదనను సమర్థించింది :** గీతాంజలి జె. వాంగ్మో హక్కుల కార్యకర్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను సఫ్దర్‌జంగ్ హాస్పిటల్ నుంచి మెదాంత హాస్పిటల్‌కు తరలించేందుకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని వాంగ్‌చుక్ సతీమణి గీతాంజలి జె.ఆంగ్మో స్వాగతించారు. తమ వైద్యులను ఎంచుకునే పౌరుడి ప్రాథమిక హక్కును ఆ ఆదేశం పునరుద్ఘాటించిందని ఆమె అన్నారు. వాంగ్‌చుక్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చించడం 'నిర్బంధంతో సమానం' అని ఆంగ్మో ఆరోపించారు. రోగి మానసిక స్థితి చాలా ముఖ్యం. 'ఢిల్లీ హైకోర్టు అనుకూలమైన ఆదేశం ఇవ్వడం నాకు చాలా సంతోషంగా ఉన్నది' అని ఆమె అన్నారు.

## ఆరుగురు ఎంపీలు షిండే నేతృత్వంలోని శివసేనలో చేరడాన్ని సవాల్‌చేస్తూ...
# 'సుప్రీం'ను ఆశ్రయించిన శివసేన (యుబిటి)



**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో తమ ఆరుగురు ఎంపీల విలీనానికి లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఇచ్చిన ఆమోదాన్ని సవాల్ చేస్తూ శివసేన (యుబిటి) మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. శివసేన (యుబిటి) తరపున హాజరైన న్యాయవాది దేవదత్ కామత్ ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పాంచోలి ముందు ఈ విషయాన్ని ప్రస్తావించారు. పిటిషన్‌ను బుధవారం విచారణకు జాబితా చేయాలని కామత్ ధర్మాసనాన్ని కోరారు. 'మేం చూస్తాం' అని సిజెఐ అన్నారు. జులై 18న షిండే నేతృత్వంలోని శివసేనలో ఆరుగురు శివసేన (యుబిటి) ఎంపీలు విలీనం అయ్యేందుకు ఆమోదం లభించిందని కామత్ బెంచ్‌కు వివరించారు. వర్షాకాల సమావేశాలకు ముందు జులై 18న షిండే నేతృత్వంలోని శివసేనలో ఆరుగురు శివసేన (యుబిటి) ఎంపీల విలీనానికి బిర్లా ఆమోదం తెలిపారు.ఆరు ఎంపీల విలీనంతో శివసేన బలం 13కు పెరిగిందని అధికారవర్గాలు తెలిపాయి.శివసేన (యుబిటి)తరపున మొత్తం 9మంది ఎంపీలు ఎన్నిక కాగా, వారిలో ఆరుగురు ఎంపీలు షిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు. ఫిరాయింపులు ఈ పరిధిలోకి వస్తాయి కాబట్టి తిరుగుబాటు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని శివసేన (యుబిటి) స్పీకర్ ముందు వాదించింది.

# పది రోజులు కాల్పుల విరమణ

## మధ్యవర్తుల ప్రతిపాదన
## పదోరోజు కొనసాగిన అమెరికా దాడులు
## హోర్ముజ్‌లో నౌక దగ్ధం: నావికులు క్షేమం
## 17 మంది సైనికుల్ని చంపారు,మూల్యం చెల్లించాలి : ట్రంప్



**దుబాయ్ :** అమెరికా—ఇరాన్ మధ్య పదిరోజుల పాటు కాల్పుల విరమణ తక్షణం పాటించాలని మధ్యవర్తి దేశాలు ప్రతిపాదించాయి. కాగా, ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన పశ్చిమాసియా హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం జరుగుతున్న యుద్ధంలో అమెరికా—ఇరాన్ మధ్య వరుసగా పదోరోజు మంగళవారం తీవ్రస్థాయిలో దాడులు కొనసాగినప్పటికీ, మరోవైపు మధ్యవర్తి దేశాలు విరామం లేకుండా శాంతికోసం తమ దౌత్య ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. ఈ చర్యలకు ఇరాన్ కూడా పూర్తి సహకారాన్ని అందిస్తోందని, ఇరాన్ కూడా తనదైన దౌత్య యత్నాలు చేస్తోందని ఆ దేశ విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ సోమవారం ప్రకటించిన నేపథ్యంలో మధ్యవర్తుల నుండి పది రోజులపాటు కాల్పుల విరమణ పాటించాలనే ప్రతిపాదన ముందుకు వచ్చింది. ఈ కాల్పుల విరమణ ప్రయత్నాల నేపథ్యంలో ఇరాన్ హోంశాఖామంత్రి పాకిస్థాన్‌లో పర్యటించి పశ్చిమాసియా పరిణామాలపై చర్చించడం ప్రాముఖ్యత సంతరించుకుంది. పది రోజులుగా అమెరికా తీవ్రస్థాయిలో దాడులు చేస్తున్నప్పటికీ, ఇరాన్‌ను ఓడించి హోర్ముజ్ జలసంధిని స్వాధీనం చేసుకోలేకపోయింది. తమ సైనికులను చంపినందుకు ప్రతీకారం తీర్చుకుంటామని ట్రంప్ హెచ్చరిక చేయగా, హోర్ముజ్‌లో రెండు నౌకలను దగ్ధం చేశామని, జోర్డాన్,కువైట్, బహ్రైన్‌లలో ఉన్న అమెరికా మిలిటరీ స్థావరాలను ధ్వంసం చేశామని ఐఆర్‌జిసి ప్రకటించింది. అమెరికాతో ఇప్పుడు ఇరాన్ పూర్తిస్థాయి యుద్ధంలో నిమగ్నమై ఉందని ఆ దేశాధ్యక్షుడు పెజెష్కియన్ ప్రకటించారు. ఇదిలా ఉండగా, పదోరోజు ఇరాన్‌లోని కీలక మౌలిక వ్యవస్థలపైన, ఇరాన్‌కు ఉన్న సముద్ర సామర్థ్యాన్ని ధ్వంసం చేయడంపైనా అమెరికా సైన్యాలు ప్రధాన లక్ష్యాలుగా దాడులు సాగించాయి. మంగళవారం తెల్లవారకముందే దాడులను విజయవంతంగా వైమానిక పూర్తిచేసినట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. ఇరాన్ మిలిటరీ కమాండ్ సెంటర్లు, క్షిపణి ప్రయోగ కేంద్రాలు, డ్రోన్ ప్రయోగ వేదికలు,కోస్తా ప్రాంత నిఘా కేంద్రాలు,టవర్లను ధ్వంసం చేసినట్లు ఎక్స్ వేదికగా పేర్కొంది. జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు కొనసాగకుండా ఇరాన్ అడ్డుకుంటోందని, అందువల్ల ఈ విధంగా అడ్డుకునే సముద్ర సంబంధమైన శక్తిసామర్థ్యాలను ధ్వంసం చేసేందుకు, ఇరాన్‌ను నిర్వీర్యం చేసేందుకు అమెరికా వరుస దాడులు చేస్తోందని సెంట్‌కామ్ ప్రకటించింది. ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైనప్పటికీ జులై వరకూ ఎక్కువగా అమెరికాకు సైనిక నష్టం జరగలేదు. కానీ ఇప్పటివరకూ 17 మంది అమెరికా సైనికులు ఇరాన్ దాడుల్లో మరణించారు. అదేవిధంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా పౌరులు అప్రమత్తంగా ఉండాలని, ఇరాన్ శక్తులు దాడులుచేసే ప్రమాదం పొంచి ఉందని ట్రంప్ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమాసియా వెలుపల ఉన్న అమెరికన్లు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరింది.

కాగా 17 మంది అమెరికా సైనికులను చంపినందుకు ఇరాన్ భారీ మూల్యం చెల్లించాల్సిందేనని డోనాల్డ్ ట్రంప్ తాజా హెచ్చరిక చేశారు. ప్రతిసారీ మీరు మా సైనికుణ్ణి చంపుతున్నారు, అలా చంపిన ప్రతిసారీ, ప్రతి ఘటనకు మీరు మూల్యం చెల్లించాల్సిందే, ఈ దిశగా మా దాడుల వ్యూహం కొనసాగుతుంది అని ట్రంప్ హెచ్చరించారు.అదే సమయంలో ఐఆర్‌జిసి కూడా ఆమెరికాకు ఒక హెచ్చరిక చేస్తూ, ఖర్గ్ ద్వీపం జోలికి వస్తే సహించబోమని పేర్కొంది. ఇరాన్ ఐఆర్‌జిసి సైన్యాలు కువైట్‌లో ఉన్న విద్యుత్ ప్లాంటులు, నీటి శుద్ధి కర్మాగారాలపై పెను దాడులు కొనసాగించాయి. బహ్రైన్, జోర్డాన్‌లలో అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. కానీ ఈ దాడులను తిప్పికొట్టామని, ఇరాన్ క్షిపణులను కూల్చివేశామని ఆ రెండు దేశాలు ప్రకటనలు చేశాయి. హోర్ముజ్ జలసంధిలో ఒక గుర్తు తెలియని ప్రొజెక్టైల్ ఒక చమురు ట్యాంకర్‌పై దాడి చేయడంతో ఆ ట్యాంకర్‌లో మంటలు చెలరేగాయి. ట్యాంకర్ దగ్ధమైంది. దీంటో ఉన్న నావికులు అందరూ లైఫ్‌బోట్ ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. వీరంతా క్షేమంగా ఉన్నారని, నౌక దగ్ధం అవుతోందని యుకెఎంటిఓ (బ్రిటన్ సముద్ర వాణిజ్య కార్యకలాపాల సంస్థ) ప్రకటించింది. ఒమన్‌లోని లిమాకు తూర్పున ఎనిమిది నాటికల్ మైళ్ళదూరంలో నౌకపై దాడి జరిగింది. కాగా హోర్ముజ్ దక్షిణ మార్గంలో రెండు నౌకలపై దాడుల తర్వాత ఈ రెండు నౌకలూ మంటల్లో దగ్ధమైనట్లు ఐఆర్‌జిసి సైన్యాలు ప్రకటించాయి.

### సౌదీ అరేబియా నౌకలపై హౌతీల దిగ్బంధనం ప్రారంభం :

ఎర్రసముద్రంలో సౌదీ అరేబియా వాణిజ్య నౌకల రాకపోకలపై యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటు సైన్యాలు దిగ్బంధనం అమలు చేయడం ప్రారంభించాయి. దీంతో సౌదీ అరేబియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటివరకూ కేవలం హోర్ముజ్ ద్వారా మాత్రమే రాకపోకలు స్తంభించిపోవడంవల్ల ప్రపంచ వాణిజ్యానికి, చమురు,ఇతర సరుకు రవాణాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఇప్పుడు ఎర్ర సముద్రానికి ముఖద్వారం వంటి బాబ్ ఎల్—మాండెబ్ జలసంధిని మూసివేస్తున్నట్లు యెమెన్‌లోని హౌతీలు ప్రకటించారు. దీనివల్ల సౌదీఅరేబియా వాణిజ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. హౌతీల ప్రకటనను సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది. ప్రతి సంవత్సరం అంతర్జాతీయ వాణిజ్యంలో 12 శాతం మేరకు బాబ్ ఎల్‌మాండెబ్ జలసంధి ద్వారానే జరుగుతూ ఉంటుంది. ఇరాన్ పూర్తిస్థాయి యుద్ధంలో ఉందని, ఈ వాస్తవాన్ని గుర్తించాలని ఆ దేశాధ్యక్షుడు పెజెష్కియన్ ఒక ప్రకటనలో చెప్పారు. శత్రువర్గమైన అమెరికా—ఇజ్రాయెల్‌పై పూర్తిస్థాయి దాడులకు సిద్ధంగా ఉండాలని యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు,లెబనాన్‌లోని హెజ్బొల్లాసైన్యాలు, హమాస్ ఉగ్రవాదులకు ఇరాన్ ఇంతకుముందే పిలుపు ఇచ్చింది. ఎర్ర సముద్రాన్ని మూసివేసేందుకు సిద్ధపడాలని కూడా హౌతీలకు తొలుత ఆదేశాలు ఇచ్చింది. కాగా జులై 14 నుండి ఇరాన్ ఓడరేవులపై అమెరికా సైన్యాలు దిగ్బంధనాన్ని తిరిగి అమలు చేస్తున్నాయి. అంతకుముందు విధించిన దిగ్బంధనం ఎంఓయుపై సంతకాల తర్వాత జూన్ 18వ తేదీన ఎత్తివేశారు.

కానీ ఎంఓయును అమెరికా రద్దు చేయడంతో దిగ్బంధనం తిరిగి మొదలైంది. ఇప్పుడు దీనికి ప్రతిగా హౌతీ తిరుగుబాటుదారులు కూడా సౌదీ అరేబియా నౌకల రాకపోకలను అడ్డుకుంటూ దిగ్బంధనం ప్రారంభించారు.

# అమెరికా—ఇరాన్ సంయమనం పాటించాలి

## ‘ఏసియన్’ విదేశీ మంత్రుల వార్షిక సమావేశం పిలుపు




**మనీలా :** పశ్చిమాసియాలో సంభవిస్తున్న పరిణామాలపై ‘‘ఏసియన్’’ (ఆగ్నేయ ఆసియా దేశాల కూటమి) విదేశీమంత్రుల వార్షిక సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వరుస యుద్ధ దాడుల వల్ల మధ్యవర్తుల ప్రయత్నాలకు విఘాతం కలుగుతుందని, శాంతియుత పరిష్కారానికి ఉన్న అవకాశాలు తగ్గిపోతాయని అందువల్ల ఉభయపక్షాలు సంయమనం పాటించాలని పిలుపు ఇచ్చింది. ఈ సమస్యపై ఐక్యత సాధించాలని కోరింది. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఏసియన్ విదేశీమంత్రుల సమావేశం మంగళవారం ప్రారంభమైంది. వారం రోజులపాటు జరిగే ఈ సమావేశాలలో పశ్చిమాసియాలో తీవ్ర పరిణామాలు,మయన్మార్‌లో అంతర్గత సంఘర్షణలు, వలసలు,చైనా—ఫిలిప్పీన్స్ మధ్య కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతలు,ప్రాంతీయ అస్థిరత,భద్రత,అంతర్జాతీయ చట్టాలను గౌరవించడం,ఇంధన మార్కెట్లు,సరఫరా వ్యవస్థ నిర్వహణ వంటి అంశాలపై ప్రధానంగా చర్చలు జరుగుతాయి. హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలు సక్రమంగా,స్వేచ్ఛగా కొనసాగేందుకు కూడా ఒక ప్రణాళికపై చర్చిస్తారు.2021లో చేసిన పంచసూత్రాల ప్రణాళికను అమలు చేయకుండా మయన్మార్ ఉల్లంఘనలకు పాల్పడినందువల్ల ఈసారి సమావేశాలకు మయన్మార్‌ను రానీయకుండా బహిష్కరించారు. తప్పుచేసిన సభ్యదేశంపట్ల ఎలాంటి వైఖరి తీసుకోవాలనే విషయంపై కూడా ఈ సమావేశంలో చర్చలు జరుగుతాయి. ఫిలిప్పీన్స్ విదేశీమంత్రిత్వశాఖ కార్యదర్శి మా థెరిసా లజారో ప్రారంభోపన్యాసం చేస్తూ,పశ్చిమాసియా సమస్య పరిష్కారానికి చురుకైన,క్రియాశీల పద్ధతుల్లో సమస్య పరిష్కారం కోసం ఏసియన్ దేశాలు స్పందించాలని పిలుపు ఇచ్చారు. విచ్ఛిన్నమైన ప్రపంచంలో ఏ ఒక్క దేశం కూడా ఈ తీవ్రమైన అస్థిర పరిస్థితులను, సంక్షోభాన్ని ఒంటరిగా తట్టుకోలేదని, మన బలం,మన స్థైర్యం అన్నీ ఐక్యతతోనే ముడిపడి ఉన్నాయని, ఈ విధంగా ఘర్షణలు సాగితే విడిపోయే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. అమెరికా,రష్యా,చైనా,జపాన్ దేశాలకు చెందిన విదేశాంగమంత్రులు కూడా ఈ సమావేశంలో పాల్గొంటారు. వారం రోజులపాటు ఈ సమావేశాలు జరుగుతాయి. ఈ సమావేశంలో ముఖ్యంగా అమెరికా—చైనాలకు చెందిన విదేశాంగ మంత్రులు మార్కో రుబియో, వాంగ్ యీ రాబోయే గురువారం ఈ సమావేశం సందర్భంగా ముఖాముఖీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ తరుణంలో అందరూ వీరిద్దరిమధ్యా సమావేశంపైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించారు. ప్రస్తుతం దక్షిణ చైనా సముద్రంలో చైనా—ఫిలిప్పీన్స్‌దేశాల మధ్య ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజా ఘర్షణల నేపథ్యంలో అమెరికా కూడా ఈ విషయంలో జోక్యం చేసుకుని చైనాకు హెచ్చరిక చేసింది. దీనిపై చైనా కూడా తీవ్రంగా స్పందించింది.

**దక్షిణ చైనాలో ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు అమెరికా ప్రయత్నం**

దక్షిణ చైనాలో ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు అమెరికా ప్రయత్నం చేస్తోందని చైనా విమర్శించింది. దక్షిణ చైనాలో సిసిజి చట్టం అమలును పర్యవేక్షించే చైనా సిబ్బంది,అధికారులపట్ల ఫిలిప్పీన్స్ సముద్ర నావికులు దూకుడుగా ప్రవర్తించారని చైనా చెబుతుండగా,అమెరికా అందుకు విరుద్ధ ప్రకటన చేసింది. చైనా సిబ్బంది దాడిచేసి ఘటనను అమెరికా విదేశాంగ శాఖ ఖండించింది. ఆసియా—పసిఫిక్‌లో, ఏసియన్ కూటమిలో తన ప్రభావం,వైభవం క్షీణించిపోతోందన్న అమెరికా బాధ,ఆక్రోశమే వారి చర్యలకు కారణమని చైనా విదేశీమంత్రిత్వశాఖ విమర్శించింది. ఏసియన్ కూటమి సమావేశాల సందర్భంగా ఈ అంశానికి ఆజ్యంపోసి ఉద్రిక్తతలు రెచ్చగొట్టాలని అమెరికా ప్రయత్నం చేస్తోందని చైనా విదేశీమంత్రిత్వశాఖ విమర్శించింది.చైనాలోని రెనాయ్ జియోవో వద్ద అక్రమంగా నిలిపి ఉంచిన ఫిలిప్పీన్స్ నౌకనుండి రబ్బరు పడవలో వచ్చిన సిబ్బంది చైనా నౌకను ఢీకొట్టి వివాదానికి దిగారని విమర్శించింది.

# నెతన్యాహూను అరెస్టు చేయం : ట్రంప్



**వాషింగ్టన్ :** ఒకవేళ నెతన్యాహూ అమెరికాలో పర్యటన చేస్తే ఆయనను తమ భూభాగంపై ఎన్నటికీ అరెస్టు చేయబోమని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అదే సమయంలో న్యూయార్క్ మేయర్ మమ్దానీ మాత్రం ఆయన అరెస్టుకు పలు ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నారు. 2024లో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఇచ్చిన తీర్పులో నెతన్యాహూపై అరెస్టు వారెంటు జారీ చేసింది. ఏ దేశంలో కాలు పెట్టినా ఆయనను అరెస్టు చేయాలని ఆదేశించింది. సెప్టెంబరులో జరిగే ఐక్యరాజ్యసమితి సాధారణ సభ సమావేశాల సమయంలో నెతన్యాహూ అమెరికా వస్తే తాము తమ దేశంలో అరెస్టుకు అనుమతించబోమని ట్రంప్ చెప్పారు. కానీ తమ యంత్రాంగం ద్వారా నెతన్యాహూను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయేమో అని పరిశీలిస్తున్నట్లు మమ్దానీ ప్రకటించిన కొద్ది రోజుల తర్వాత ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పై వ్యాఖ్యానాలు చేశారు. యుద్ధ నేరాల్లో హేగ్ కోర్టు అరెస్టు వారెంటు ఎదుర్కొంటున్న నెతన్యాహూ అమెరికాలో ఎంతకాలం ఉన్నాగానీ, అరెస్టుచేయబోమని స్పష్టత ఇచ్చారు. డెమోక్రాట్స్‌పార్టీలో మమ్దానీ వామపక్ష భావజాల విభాగ నాయకుడుగా దేశంలో పేరుపడ్డారు. రాబోయే నవంబరు ద్వైవార్షిక ఎన్నికలలో ట్రంప్‌ను దెబ్బతీసే ప్రత్యర్థిగా ఆయన వెనుక అనేకమంది మద్దతుదారులు రిపబ్లికన్లపై పోటీకి సిద్ధమవుతున్నారు.

# ద్రోహులను క్షమించను

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో బిజెపి పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ఐక్యంగా కలిసి ముందుకు అడుగులు వేద్దామని ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, టిఎంసి నాయకురాలు మమతా బెనర్జీ ‘‘ఇండియా కూటమి’’లో కాంగ్రెస్,వామపక్షాలకు కీలక ప్రతిపాదన చేశారు. ఇండియా కూటమిలో ఉన్న కాంగ్రెస్,వామపక్షాలు పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు తీవ్ర ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ, వారు అదే కూటమి ఛత్రం కింద ఉంటూ తమతో కలిసి రావాలని కోరారు. రాష్ట్రంలో బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ఒక ఐక్య సంఘటన ఏర్పాటు చేసి కలిసి పోరాటం చేద్దామని మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో తనకు ఎలాంటి అహంభావం,భేషజాలు లేవని, బెంగాల్‌లో బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేసే ఇతర పార్టీలు కూడా విభేదాలు పక్కనపెట్టి అదే స్ఫూర్తితో ముందుకు రావాలని కోరారు.

జులై 21న నేలకొరిగిన (1993) టిఎంసి అమరవీరులకు నివాళులు అర్పించేందుకు నిర్వహించిన వార్షిక ర్యాలీలో కోల్‌కతాలో మమతాబెనర్జీ ప్రసంగిస్తూ, బిజెపి పాలకులపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అవసరమైతే తాను కాక్రోచ్ జనతాపార్టీ నిరసన ప్రదర్శనల్లో పాల్గొంటానని ప్రకటించారు. నీట్ అవకతవకల వల్ల మరణించిన విద్యార్థుల ప్రాణాలను కేంద్రం తిరిగి తీసుకురాగలదా? అని ప్రశ్నించారు. కేవలం అయోధ్య ఆలయంలోనే కాదు, బెంగాల్‌లో కూడా వివిధ ఆలయాలలో బిజెపి నిదులు దోచుకుంటోందన్నారు. త్వరలోనే బెంగాల్ వ్యాప్తంగా జిల్లాలో పర్యటనలు చేస్తానన్నారు. ‘‘బెంగాల్‌లో బిజెపి పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ఇండియా కూటమి కింద అందరూ ఏకం కావాలని నేను కోరుకుంటున్నాను, ఈ విషయంలో నాకు ఎలాంటి అహంభావం లేదు, ఇతరులు కూడా కలిసి పోరాడాలని కోరుకుంటున్నాను’’ అని పార్టీల పేర్లు ప్రస్తావించకుండా చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భవించిన తర్వాత మొదటిసారి సంస్థాగతంగా అతిపెద్ద చీలికను ఆమె ఎదుర్కొంటున్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో తిరిగి పట్టు సాధించేందుకు టిఎంసి చేస్తున్న ప్రయత్నాలలో భాగంగానే మమతా బెనర్జీ ఈ ప్రతిపాదన చేశారని భావిస్తున్నారు. బెంగాల్ ఎన్నికల్లో ఘోర ఓటమి, పార్టీలో నాయకులు, ఎంపిలు, ఎంఎల్ఏల అసమ్మతి,,పార్టీ చీలిక, కోర్టు కేసులు, పోరాటపరంగా టిఎంసి బలహీన పడటం వంటి అనేక పరిణామాల పూర్వరంగంలో ఆమె ఈ సరికొత్త ప్రతిపాదన చేశారు. పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్—వామపక్షాలతో సంబంధాల విషయంలో చేసిన ఈ అభ్యర్థన ఆమె పార్టీ వైఖరిలో ముఖ్యమైన మార్పును సూచిస్తోందని పిటిఐ పేర్కొంది. ఐతే తన సొంత పార్టీలో ఉంటూ ద్రోహం చేసినవారిని క్షమించేది లేదని,అసమ్మతివాదులను ఎప్పటికీ తిరిగి పార్టీలో చేర్చుకోబోమని ఆమె ప్రకటించారు. అసమ్మతివాదులపట్ల తాము కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

తృణమూల్ కాంగ్రెస్‌పార్టీని బలహీనపరచేందుకు ముఖ్యమంత్రి సువేందు అధికారి రాష్ట్రంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. ఆయన తొడుక్కున ముసుగు తొలగించి నిజస్వరూపం బయట పెడతానని హెచ్చరించారు. ‘‘నేను గనుక నోరు విప్పితే, పార్టీలో ఉన్న పది సంవత్సరాలలో నువ్వు చేసిన పనులు ఏమిటో అన్నీ బయటపెడతా, నువ్వు తొడుక్కున ముసుగు తొలగించి నీ నిజస్వరూపం బహిర్గతం చేస్తా,కేంద్రంలో గనుక ఎన్నికల్లో బిజెపి ఓడిపోతే పశ్చిమ బెంగాల్‌లో కూడా ప్రభుత్వం కుప్పకూలిపోయే పరిస్థితి వస్తుంది’’ అని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండీ టిఎంసి నాయకులను, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని కేంద్ర దర్యాప్తు సంస్థలను అధికారి వాడుకుంటున్నారు, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టిఎంసి నాయకులు,కార్యకర్తలపై 14,000 కేసులు నమోదు చేశారు,ఈ విధంగా వారు సిఐడి పనిచేసి గిన్నిస్‌బుక్కులోకి ఎక్కాలని చూస్తున్నారు’’ అని వ్యంగ్య విమర్శలు చేశారు.

# బెదరని యువత

(మొదటి పేజీ తరువాయి)

అవకతవకలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మద్దతుదారులు నినాదాలు చేయడంతో, విద్యాశాఖ మంత్రి హర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించడంతో మధ్యాహ్నం అంతా నిరసన ప్రదేశం జనంతో కిక్కిరిసిపోయింది. సోమవారం భద్రతా సిబ్బందితో జరిగిన ఘర్షణ తమను నిరుత్సాహపరచలేకపోయిందని, పైగా మరింత మందిని ఉద్యమంలోకి చేర్చిందని చాలా మంది నిరసనకారులు అన్నారు. అయితే పేరు ట్యాగ్‌లు లేని పోలీసు సిబ్బంది మహిళలతో సహా నిరసనకారులను కొట్టి, వారిని ఉగ్రవాదులు అని పిలిచారని ఆరోపిస్తూ, యువ మద్దతుదారుల బృందం ఒకటి తమ అనుభవాలను దీప్కేకు వివరించింది. దీప్కే చేతులు జోడించి వారికి క్షమాపణ చెబుతూ కనిపించారు. సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లు ఉద్యమ నాయకులెవరూ నిరసన స్థలాన్ని విడిచిపెట్టలేదని ఆయన సభకు తెలిపారు. ప్రతిష్టంభనకు పరిష్కారం కనుగొనే ప్రయత్నంలో భాగంగా సిజెపి అధికార ప్రతినిధి అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ కేంద్ర మంత్రి జెపి నడ్డాను కలవడానికి వెళ్లారని ఆయన వారికి చెప్పారు. తరువాత, ఒక ఎక్స్ పోస్ట్‌లో, అణచివేతలో గాయపడిన వారికి దీప్కే క్షమాపణలు చెప్పారు.

‘మా మద్దతుదారులందరికీ, ముఖ్యంగా మగ పోలీసు అధికారుల చేతిలో దారుణంగా దెబ్బలు తిన్న అమ్మాయిలకు క్షమాపణలు చెబుతున్నాను. ఢిల్లీ పోలీసుల అమానుష చర్యల నుండి మిమ్మల్ని కాపాడటానికి ఇంకా మెరుగ్గా చేసి ఉండాల్సింది‘ అని దీప్కే ఎక్స్‌లో రాసుకొచ్చారు. 20 మందికి పైగా విద్యార్థుల మరణాలకు కారణమైన ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడటానికి, ప్రభుత్వం ఇంకా ఎంతో మంది యువ విద్యార్థుల రక్తాన్ని చిందించాలని కోరుకుంటోందని దీప్కే ప్రశ్నించారు. గాయపడిన వారు తనకు ఫోన్ చేస్త వ్యక్తిగతంగా క్షమాపణలు చెప్పాలనుకుంటున్నానన్నారు. విద్యార్థుల కోసం తాము పోరాడుతూనే ఉంటామని మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 24వ రోజుకు చేరుకుందని సిజెపి ప్రతినిధి అశుతోష్ రాంకా తెలిపారు. ఆయన ఇప్పటికీ మన కోసం పోరాడుతున్నారని, ప్రధాన్‌ను తొలగించాలని రాంకా ఎక్స్ ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు.

# రైతుల అడ్డగింత

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు అంచనా వేయడంతో కీలక జాతీయ రహదారుల పొడవునా భద్రను కట్టుదిట్టం చేశారు. పంజాబ్ సహా హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాల నుంచి రైతులు భారీయెత్తున తరలివస్తారని గతంలో రైతు నాయకులు తెలియజేశారు.ఈ ప్రణాళికలో భాగంగా పంజాబ్ నుంచి 1000 మంది రైతులు బస్సుల్లో ఢిల్లీకి తరలివెళుతున్నారు. రైతుల కాన్వాయ్ మంగళవారం ఉదయం గురుద్వారాశ్రీ పతేగఢ్ సాహిబ్ నుంచి బయల్దేరింది. వారు సోమవారం రాత్రి గురుద్వారా వద్ద నున్న సరాయి (యాత్రికుల సత్రం) వద్ద బసచేశారు. గురుద్వారా నుంచి వారు జిటి రోడ్డుపై సిర్‌హింద్ సమీపంలో ఉన్న మాధోపూర్ వద్దకు చేరుకుని, అక్కడ నుండి శంభువైపు బయల్దేరారు. కురుక్షేత్రలోని షాహబాద్ సమీపంలో ఖనౌరి సరిహద్దు వద్ద, కర్నాల్‌లో కూడా రైతులను పోలీసులు అడ్డుకున్నారు. కురుక్షేత్రలో జ్యోతిసర్ వద్ద తమను అడ్డుకున్నారని రైతులు ఆరోపించారు. హర్యానా—జాతీయ రాజధాని ప్రాంతాల మధ్య ఉన్న సింఘూ సరిహద్దువద్ద మంగళవారం దాదాపు నలుగురు రైతులను అదుపులోకి తీసుకున్నారని రైతు నాయకులు తెలిపారు. పోలీసులు తమను ఢిల్లీకి వెళ్లనివ్వలేదని, తమ వాహనాలను సరిహద్దు వద్ద నిలిపివేసి అక్కడే ఉండాలని ఆదేశించారని ఒక రైతు నాయకుడు వివరించారు. పంజాబ్ రైతు నాయకుడు సర్వాన్ సింఘ్ పాంధర్ మాట్లాడుతూ నయాబ్ సింగ్ సైని ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తాము శాంతియుతంగా ఢిల్లీ వెళదామని అనుకున్నామని, అయితే హర్యానా వద్దే అడ్డుకున్నారని పాంధర్ ఆరోపించారు.

# సీతక్కపై నమోదైన కోవిడ్ కేసు రద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర మంత్రి, ములుగు ఎమ్మెల్యే దనసరి అనసూయ అలియాస్ సీతక్కపై కోవిడ్ నిబంధనల ఉ ల్లంఘన ఆరోపణలతో నమోదైన క్రిమినల్ కేసును హైకోర్టు కొ ట్టివేసింది. ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు లేవని, చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించకుండా కేసు నమోదు చేశారని పే ర్కొంటూ జస్టిస్ కె. సుజన మంగళవారం ఉత్తర్వులు జారీ చేశా రు. 2021 ఏప్రిల్ 26న కోవిడ్‌ను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలంటూ ఇందిరాపార్క్ వద్ద సీతక్కతో పాటు కాంగ్రెస్ నాయకులు చేపట్టిన నిరాహార దీక్ష సందర్భంగా అనుమతి లేకుండా కార్యక్రమం నిర్వహించారని, కోవిడ్ వ్యాప్తికి కారణమయ్యారంటూ గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. హైకోర్టు కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

# ప్రకటన చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. బ్రిట్టాస్ మాట్లాడుతూ శాంతియుత ఉద్యమాన్ని అణచివేయడానికి కేంద్రం బలప్రయోగం చేస్తోందన్నారు. దేశంలో వాస్తవంగా సైనిక పాలన అమలవుతోందని, అమాయక యువకులపై జరిగిన ఈ దారుణం మునుపెన్నడూ చూడలేదన్నారు. వారి ఆందోళన దేశం కోసమే, కానీ వారిపై క్రూరంగా దాడి చేశారని మండిపడ్డారు. జాతీయ రాజధానిలో ఇంతటి రక్తపాతాన్ని మునుపెన్నడూ చూడలేదన్నారు. అమాయక యువకుల పుర్రెలు కూడా పగలగొట్టారని, ఇందులో పోలీసులే కాకుండా, ఆర్ఎస్ఎస్ గూండాలు కూడా పాలుపంచుకున్నారని ఆరోపించారు. అయినప్పటికీ, విద్యార్థులు అద్భుతమైన స్థైర్యాన్ని ప్రదర్శించి పార్లమెంటుకు చేరుకున్నాన్నారు. ఈ విషయంపై పార్లమెంటులో పలుమార్లు అంతరాయాలు ఏర్పడ్డాయని పేర్కొంటూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, హోం మంత్రి అమిత్ షా ఇద్దరి రాజీనామాలను ప్రతిపక్షం డిమాండ్ చేస్తోందని బ్రిట్టాస్ అన్నారు. ‘పుర్రెలు, కాళ్లు విరిగిన పలువురు యువకులను కలిశాం. వందలాది మంది విద్యార్థులు గాయాలతో రోడ్లపై పడి ఉన్నారు. బాధ్యులను జవాబుదారీగా చేయాలి’ అని ఆయన అన్నారు. గాయపడిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎంపిలు నినాదాలు చేశారు.

పరీక్షలు, ఉన్నత విద్యలో జరిగిన అవకతవకల ఆరోపణలపై కొనసాగుతున్న వివాదం నేపథ్యంలో ప్రధాన్ రాజీనామా చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు. వేలాది మంది ప్రదర్శనకారులు పార్లమెంటు వైపు కవాతు చేయకుండా ఢిల్లీ పోలీసులు బాష్పవాయువు, లాఠీఛార్జులు ప్రయోగించి అడ్డుకున్న మరుసటి రోజు తర్వాత వామపక్ష పార్లమెంటేరియన్ల పర్యటన జరిగింది.

# మెరుపు ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిఘటించారు. పోలీసులు ఆయన మీద పడి బలప్రయోగం చేశారు. ఈ సందర్భంగా తోపులాటలోరాహుల్ గాంధీ ముక్కు కుడి వైపు గాయమై రక్తం వచ్చింది. అలాగే చేతులు, కాళ్ళకు గాయాలయ్యాయి.

మంగళవారం ఎలాంటి చర్చ చేపట్టకుండానే పార్లమెంటును వాయిదా వేసిన తరువాత సుమారు 3:20 గంటల ప్రాంతంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కర్నాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, కేరళ ముఖ్యమంత్రి వి.డిసతీశన్, కాంగ్రెస్ లోక్‌సభ, రాజ్యసభ ఎంపిలు ప్రియాంకగాంధీ, జై రాం రమేశ్, చరణ్‌జీత్ సింగ్ చన్నీ సహా సుమారు వంద మ ంది ఎంపిలు ప్రధాని నివాసం వద్దకు చేరుకొని బైఠాయించారు. చరిత్రలో తొలిసారి పార్లమెంటు ఉభయ సభ ప్రతిపక్ష నేతలు కలిసి ప్రధాని ఇంటి ముందు ధర్నా చేయడం ఇదే తొలిసారి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా ఇక్కడి ఒక ఆసుపత్రిలో గాయపడిన విద్యార్థులను పరామర్శించిన వెంటనే ఈ అసాధారణ దృశ్యాలు చోటుచేసుకున్నాయి.ఖర్గే కొద్ది సేపు అక్కడే ఉండి వెళ్ళిపోయారు. దాదాపు 20 నిమిషాల తర్వాత, ప్రధానమంత్రి కార్యాలయ (పిఎంఒ) సహాయ మంత్రి జితేంద్ర సింగ్ నిరసన స్థలంలో రాహుల్ గాంధీని కలిసి, ధర్నాను విరమించాలని కోరారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని రాహుల్‌గాంధీ పట్టు బడడంతో ఆయన వెళ్ళిపోయారు. మూడు గంటల పాటు సాగిన ఈ ధర్నా కొనసాగింది. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ హోంమంత్రి అమిత్ షాతో కలిసి రాజీనామా చేయాలని, విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే సహా అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ముఖ్యనేతలు ప్రధాని నివాసం వద్ద బైఠాయించి నిరసన తెలియజేశారు. కొద్ది సేపటి తరువాత ఎన్‌సిపి(శరద్ పవార్) ఎంపి సుప్రియా సూలే అక్కడికి వచ్చి సంఘీభావం తెలిపారు. ఎస్‌పి అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కూడా ప్రధాని నివాసం వద్దకు చేరుకొని రాహుల్‌గాంధీ కలిసి ధర్నాలో భాగస్వాములయ్యారు. పోలీసులు, రిజర్వు పోలీసులు భారీ సంఖ్యలో ధర్నా చేసిన వారి చుట్టూ మోహరించారు. ఎంపిలను దశలవారీగా అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు.

చివరలో రాహుల్‌గాంధీ, అఖిలేశ్ యాదవ్, ప్రియాంక గాంధీని అరెస్టు చేశారు. తమను తరలిస్తున్న బస్సు నుంచి బైటకు వేలాడుతూ ‘గుండాగిరి నహీ చలేగీ’ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాగా, ప్రియాంక గాంధీని పోలీసులు తరలించిన మందిర్‌మార్గ్ పోలీస్ స్టేషన్‌కు సిపిపి చైర్‌పర్సన్ సోనియాగాంధీ చేరుకొని పరామర్శించారు. సోమవారం నాడు పార్లమెంటు వైపు జరిగిన సిజెపి నేతృత్వంలోని నిరసన ర్యాలీలో యువ విద్యార్థులపై పోలీసులు జరిపిన అరాచక చర్యలకు నిరసనగా కాంగ్రెస్ నేతలు అంతకుముందు ప్రధాని నివాసం వరకు ర్యాలీగా వెళ్లారు. యువ విద్యార్థులపై జరిగిన అరాచకాలకు సమాధానం కోరుతూ తాము ప్రధాని మోదీ ఇంటికి ర్యాలీగా వెళ్లామని, ప్రభుత్వం ఎటువంటి బాధ్యత వహించడానికి గానీ, పార్లమెంటులో దీనిపై చర్చ జరపడానికి గానీ ఇష్టపడటం లేదని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఈ ఘటన కంటే ముందు నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై పార్లమెంటుకు చేపట్టిన నిరసన ర్యాలీలో పోలీసుల చర్యల వల్ల గాయపడి, డిల్లీలోని రామ్ మనోహర్ లోహియా (ఆర్ఎంఎల్) ఆసుపత్రిలో చేరిన విద్యార్థులను లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ కలిసి వారికి సంఘీభావం తెలిపారు. ఆసుపత్రిలో వెంటిలేటర్ సపోర్ట్‌పై ఉన్న గాయపడిన యువ నిరసనకారిణి తల్లిని కూడా వారు కలిశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ విద్యార్థుల ఆరోగ్యం గురించి ఆరా తీసి, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలి : రాహుల్‌గాంధీ**

కాగా, పార్లమెంట్ భవన సముదాయంలో రాహుల్‌గాంధీ విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులపై జరిగిన పోలీసుల దాష్టీకానికి గాను ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని, అలాగే హోం మంత్రి అమిత్ షాతో కలిసి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యపై చర్చించాలని ప్రతిపక్షం కోరుకుంటోందని ఇతర ప్రతిపక్ష ఎంపిలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓమ్‌బిర్లాను కలిసి ఆయనకు తెలియజేశానని చెప్పారు. దీనిపై ప్రభుత్వాన్ని అడగాల్సి ఉంటుందని బిర్లా చెప్పారన్నారు. అంటే, పార్లమెంట్‌లో చర్చ జరగాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పీకర్ మాకు చెబుతున్నారని తమకు అర్థమైందన్నారు. ‘ఇది విద్యార్థులు, దేశ భవిష్యత్తుకు సంబంధించిన విషయం. ప్రజలను కొడుతున్న తీరు పూర్తిగా భారతీయతకు విరుద్ధం. సోమవారం జరిగిన ఘటనకు సంబంధించి మోదీ కనీసం క్షమాపణ కూడా చెప్పలేదు’ అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. విద్య, పరీక్షల వ్యవస్థలు పూర్తిగా విఫలమయ్యాయని, అవి అస్తిత్వం కోల్పోయాయని దేశం మొత్తానికి తెలుసునన్నారు. ‘దేశంలోని యువతకు ఎలాంటి అవకాశాలు లేవు. అన్ని ద్వారాలు మూసుకుపోయాయి. కేవలం ఒక్క ద్వారం మాత్రమే తెరిచి ఉంది, అదే పోటీ పరీక్షల ద్వారం; కానీ ఆ ద్వారం కూడా ధ్వంసమైపోయింది’ అని ఆయన చెప్పారు.

విద్యార్థులు కేవలం విద్యా విధానం గురించే కాకుండా, తమ భవిష్యత్తు గురించి కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. ‘నేడు ఈ దేశంలో మిస్టర్ అదానీ, మిస్టర్ అంబానీల ప్రభావం వల్ల, విద్యా వ్యవస్థను ఆర్ఎస్ఎస్ పూర్తిగా తన గుప్పిట్లోకి తీసుకోవడంతో 'ప్రచారకులు' విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్లుగా నియమితులవుతున్న నేపథ్యంలో తమకు భవిష్యత్తు లేదని విద్యార్థులు అంటున్నారు. ఇది కేవలం విద్యకు సంబంధించిన విషయం మాత్రమే కాదు, ఇది యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశం’ అని అన్నారు.

# అప్పుడు రోహిత్ మాటలు నమ్మలేదు : శాంసన్

లార్డ్స్‌లో శతకంతో విమర్శకుల చెంప చెళ్లుమనిపించిన రోహిత్ శర్మకు సంజూ శాంసన్ సారీ చెప్పాడు. టి–20 వరల్డ్ కప్ 2026లో తనకు అవకాశం లభిస్తుందని రోహిత్ చెప్పినా.. తాను నమ్మలేదని శాంసన్ తెలిపాడు. 'స్వదేశంలో ముగిసిన పొట్టి ప్రపంచకప్ సమయంలో నేను రోహిత్‌ను నమ్మలేదు. అందుకు ఇప్పుడు సారీ' అని మంగళవారం శాంసన్ పేర్కొన్నాడు. అంతే కాదు మెగా ఈవెంట్లో తనను తాను ఆత్మవిమర్శ చేసుకున్న తీరును సంజూ వెల్లడించాడు. స్వదేశంలో జరిగిన టి–20 ప్రపంచకప్ లీగ్ దశలో బెంచ్‌మీదే కూర్చున్న సంజూ శాంసన్.. నాకౌట్లో చెలరేగాడు. తనకిచ్చిన అవకాశాన్ని రెండుచేతులా అందిపుచ్చుకొని.. వరసగా అర్ధ శతకాలతో టీమిండియా విజయాల్లో కీలకమయ్యాడు. అయితే.. న్యూజిలాం డ్‌తో విఫలమైనందున టోర్నీ ప్రపంచ కప్ జరుగుతుండగా 'అసలు నేను తుది జట్టులో ఉంటానా? ఉండనా?' అనే సందేహం అతడిని వెంటాడిందట. అప్పుడు.. రోహిత్ శర్మ అతడితో 'సంజూ.. నీకు పక్కాగా అవకాశం వస్తుంది. దిగులు చెందకు' అని చెప్పాడని శాంసన్ తాజాగా వెల్లడించాడు. 'నేను నిజాయతీగా చెబుతున్నా.. అప్పుడు రోహిత్‌ను నమ్మలేదు. సారీ. అతడు హృదయపూర్వంగా లేదా తన అనుభవంతో ఆ మాట చెప్పి ఉండవచ్చు. కానీ, ఆరోజు అతడికి నాపై ఉన్న నమ్మకం నాకు లేదు. ఆరోజు నేను అతడి మాటల్ని నమ్మే పరిస్థితిలో లేను. ఎందుకంటే.. న్యూజిలాండ్‌తో పొట్టి సిరీస్ ముగిసిన రెండు రోజులకే వరల్డ్ కప్ మొదలైంది. దాంతో.. నాకు మెగా టోర్నీకి సిద్ధమయ్యేందుకు దాదాపు వారం పట్టింది. అంటే.. నేను అప్పటికీ సిద్ధంగా లేనని నా ముఖంలో 100 శాతం కనిపించేది. ఐదారు రోజులు నేను అదే విధమైన నిరాశలో ఉండిపోయాను. ఆ సమయంలో నాకు నేను ధైర్యం చెప్పుకున్నా. నీకు తెలుసా నువ్వు విఫలమయ్యావు. తర్వాత ఏంటీ? నువ్వు అట్టడుగున ఉన్నావు. ఇక్కడి నుంచి పైకి మాత్రమే వెళ్లగలవకు. కాబట్టి.. మానసికంగా సన్నద్ధమవ్వు. నేను క్రికెట్ ఎందుకు ఆడుతున్నాను? నా లక్ష్యం ఏంటీ?.. ఇలా వరల్డ్ కప్ సమయంలో నన్ను నేను విశ్లేషించుకున్నా. అలా నన్ను నేను ప్రశ్నించుకున్నాక అంతా మారిపోయింది. మళ్లీ ట్రాక్‌లోకి వచ్చాను' అని శాంసన్ వెల్లడించాడు. టి–20 వరల్డ్ కప్ నాకౌట్లో రెచ్చిపోయిన శాంసన్ వెస్టిండీస్‌పై 97 నాటౌట్.. సెమీస్‌లో ఇంగ్లండ్‌పై 89, ఫైనల్లోనూ న్యూజిలాండ్‌పై 46 బంతుల్లో 89 రన్స్ చేశాడు. టీమిండియా మూడోసారి టి–20 వరల్డ్ కప్ విజేతగా నిలవడంతో.. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా ఎంపికయ్యాడు శాంసన్.




# కష్టకాలంలో.. విరాట్ భాయ్ అండగా నిలిచాడు

పి.వి. సింధు

భారత షట్లర్లెవరికీ సాధ్యం కాని జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్‌ను పి.వి. సింధు తొలి సారిగా కైవసం చేసుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆమె విజయం వెనుక కఠిన సాధనతో పాటు భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ ఇచ్చిన ఒక సలహా ఆమె జీవితాన్నే మార్చి వేసింది. ఈ టోర్నీకి ముందు సింధు ఫామ్ కోల్పోయి కెరీర్ పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఆమె కోహ్లీని సంప్రదించాక సవాళ్లను అధిగమించి విజేతగా నిలిచింది. జీవితంలో ఏది సాధించాలన్నా నమ్మకం అనేది అత్యంత కీలకమైంది. లక్ష్యాన్ని చేరే క్రమంలో దారులన్నీ మూసుకుపోయి తీవ్ర నిరాశలో కొట్టుమిట్లాడుతున్నప్పుడు నిజాయితీతో కూడిన చిన్నమాట సాయమైనా అద్భుతాలు చేసేలా ప్రేరిపిస్తుంది. సరిగ్గా రెండేండ్ల కింద వరకు ఇలాంటి క్లిష్ట పరిస్థితని ఎదుర్కొన్న పి.వి.సింధు స్టార్ క్రికెటర్ కింగ్ కోహ్లీని కలువడంతో అతడిచ్చిన విలువైన సూచనలు తన కెరీర్‌నే మార్చివేసిందని సింధు తెలిపారు. తాను కెరీర్ పరంగా ఫామ్ కోల్పోయి తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న సమయంలో విరాట్ భాయ్‌ను నా భర్త దత్తాతో వెళ్లి కలిశానని తెలిపారు. వెంటనే ఆయన స్పందించాడన్నారు. ఫామ్ కోల్పోయిన సమయంలో సెంచరీ కోసం సుదీర్ఘ నిరీక్షణను ఎలా అధిగమించారని సింధు కోహ్లీని అడగగా.. కింగ్ కోహ్లీ స్పందిస్తూ పరుగులు చేయడమే తన పని అని, అందులోనే ఆనందాన్ని ఆస్వాదించడం ప్రారంభించాను' అని అతడు చెప్పినట్లు ఆమె తెలిపారు. విరాట్ చెప్పిన మాటలు తనపై ప్రభావం చూపాయని, అతని పాజిటివ్ వైఖరిని బ్యాట్మింటన్‌కు అప్లై చేసుకొని ఫలితాలను సాధించినట్లు చెప్పారు. విరాట్ భాయ్‌కు ఎప్పటికి రుణపడి ఉంటామని పి.వి. సింధు తెలిపారు. కాగా, పారిస్ ఒలింపిక్స్ అనంతరం సింధు ఆటతీరుపై స్పోర్ట్స్ సైన్స్ ఆధారంగా విశ్లేషణ జరిపామని దత్త సాయి తెలిపారు. దూకుడుగా ఆడటం తగ్గించి, అవసరానికి మించి లైన్ కాల్స్‌పై ఆధారపడటం వంటి లోపాలను గుర్తించి వాటిపై ప్రత్యేకంగా పనిచేశామని వివరించారు. కోచ్‌లు, ఫిట్‌నెస్ నిపుణుల సూచనల మేరకు ఆహార నియమాలు కూడా కచ్చితంగా పాటించడం వల్లే టైటిల్ సాధ్యమైందని పేర్కొన్నారు.




## మహిళ

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లోనూ

# వివక్ష...పెట్టుబడిదారీ వ్యవస్థ

ప్రపంచంలోనే అత్యధిక మంది వీక్షించే క్రీడోత్సవం 'ఫిఫా పురుషుల ప్రపంచకప్' ముగిసింది. ఫైనల్‌లో అర్జెంటీనాను ఓడించి, స్పెయిన్ టైటిల్ కైవసం చేసుకోవడాన్ని కోట్లాది మంది ప్రత్యక్షంగా లేదా ప్రసార మాధ్యమాల్లో పరోక్షంగా వీక్షించారు. కేరింతలు కొట్టారు. కోట్లాది మంది అభిమానులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ టోర్నమెంట్ కేవలం క్రీడా పోటీ మాత్రమేగాక, భారీ వాణిజ్య వ్యవస్థ, మీడియా శక్తి, అంతర్జాతీయ పెట్టుబడులు, ప్రకటనల మార్కెట్, రాజకీయ ప్రభావాల సమ్మేళనంగా కూడా గుర్తింపు సంపాదించింది. అదే సమయంలో మహిళల పట్ల కొనసాగుతున్న వివక్షను కళ్లకు కట్టింది. ఒకప్పుడు కార్మికవర్గం, సాధారణ ప్రజల ఆటగా పేరుగాంచిన ఫుట్‌బాల్, నేడు బహుళజాతి సంస్థలు, ప్రసార హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు, డిజిటల్ వేదికల ఆధీనంలో బిలియన్ల డాలర్ల పరిశ్రమగా రూపాంతరం చెందింది. ఈప్రక్రియలో క్రీడ మాత్రమే కాకుండా సమాజంలోని లింగ అసమానతలు కూడా కొత్త రూపాల్లో పునరుత్పత్తి అవుతున్నాయని పలువురు సామాజిక విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రపంచకప్ సమయంలో మహిళల పట్ల సమాజంలో ఉన్న పాత మూస ధోరణు లు మరింత బలపడుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫుట్‌బాల్ గురించి మహిళలకు అవగాహన ఉండదనే అభిప్రాయాన్ని సరదాజోక్‌ల రూపంలో ప్రచారం చేయడం ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రకటనల ప్రపంచంలో కూడా ఇదే ధోరణి కనిపిస్తుంది. ప్రపంచకప్ సందర్భంగా వచ్చే అనేక వాణిజ్య ప్రకటనల్లో పురుషులను మ్యాచ్‌ను ఆస్వాదించే ప్రధాన పాత్రలుగా చూపిస్తే, మహిళలను వంట చేయడం, చిరుతిండ్లు సిద్ధం చేయడం, ఇంటిని శుభ్రంచేయడం వంటి సంప్రదాయ పాత్రలకే పరిమితం చేస్తుంటాయి. మరోవైపు స్టేడియాల్లో మహిళా అభిమానులపై కెమెరాలు కేంద్రీకరించినప్పుడు కూడా వారి క్రీడాభిమానాన్ని కాకుండా రూపసౌందర్యాన్నే ప్రధానంగా చూపించే ప్రయత్నం జరుగుతుందని విమర్శలు ఉన్నాయి. దీంతో మహిళలు నిజమైన అభిమానులుగా కాకుండా ఒక దృశ్య ఆకర్షణగా మాత్రమే చిత్రీకరించబడుతున్నారని మహిళా హక్కుల కార్యకర్తలు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితి సోషల్ మీడియా వేదికలలో మరింత తీవ్రంగా కనిపిస్తోంది. మహిళలు మ్యాచ్‌లపై సాంకేతిక విశ్లేషణలు చేసినా, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినా, తరచూ అవమానకర వ్యాఖ్యలు, ట్రోలింగ్, సైబర్ వేధింపులను ఎదుర్కొంటున్నారు. ఫుట్‌బాల్‌పై మాట్లాడే హక్కు పురుషులకే ఉందన్న భావన ఇప్పటికీ డిజిటల్ ప్రపంచంలో కొనసాగుతుండటం దీనికి నిదర్శనంగా భావిస్తున్నారు. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు ఫుట్‌బాల్‌ను లోతుగా అధ్యయనం చేస్తూ, క్లబ్‌లు, జాతీయ జట్లకు అంకితభావంతో మద్దతు తెలుపుతూ ఈ మూస ధోరణులను సవాలు చేస్తున్నారు. మహిళల భద్రత అంశం కూడా ప్రపంచకప్ నిర్వహణలో కీలక చర్చగా మారింది. స్టేడియాల పరిసరాల్లో మద్యం విక్రయాలపై కఠిన నియంత్రణలు, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు, ప్రజా ప్రదేశాల నిర్వహణ వల్ల మహిళలు మరింత సురక్షితంగా మ్యాచ్‌లను వీక్షించగలిగినట్లు అనేక అంతర్జాతీయ మాధ్యమాలు నివేదించాయి. దీనివల్ల మహిళల భద్రత అనేది వ్యక్తిగత జాగ్రత్తలపై మాత్రమే కాకుండా, ప్రభుత్వ విధానాలు, నిర్వహణా వ్యవస్థ, ప్రజా స్థలాల రూపకల్పనపై కూడా ఆధారపడి ఉంటుందని ఈ అనుభవం చూపించింది. ఇక ప్రపంచకప్ వెనుక కనిపించని మరో వాస్తవం కార్మికుల శ్రమ. స్టేడియాలు, హోటళ్లు, ఆతిథ్యరంగం, పరిశుభ్రత, ఆహార సేవలు వంటి రంగాల్లో వేలాది మంది మహిళలు, ముఖ్యంగా వలస కార్మికులు, తక్కువ వేతనాలతో పనిచేస్తుంటారు. ప్రేక్షకుల దృష్టి ఆటగాళ్లపై, కోచ్‌లపై, కోట్ల రూపాయల ఒప్పందాలపై ఉండగా, ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయడానికి కష్టపడే కార్మికుల పాత్ర చాలా వరకు గుర్తింపు పొందదు. కాబట్టి ప్రపంచకప్‌ను కేవలం క్రీడా కోణంలో కాకుండా, వర్గ అసమానతలు, లింగ వివక్ష, శ్రమ దోపిడీ, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థల కోణంలో కూడా విశ్లేషించాల్సిన అవసరం ఉందని సామాజిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. క్రీడా వేదికలు నిజమైన సమానత్వానికి ప్రతీకలుగా మారాలంటే మహిళలను అభిమానులుగా, విశ్లేషకులుగా, కార్మికులుగా, నిర్ణయాధికారులుగా సమాన గౌరవంతో గుర్తించే దిశగా క్రీడా ప్రపంచం ముందడుగు వేయాల్సిన అవసరం ఉంది.




## ధైర్యవంతురాలు కరెన్

జీవితంలో నిజం కోసం నిలబడటానికి విద్య, హోదా, అధికారమే అవసరం కాదు. ధైర్యం, నిజాయితీ, బాధ్యత ఉంటే చాలు అనే విషయాన్ని అమెరికాకు చెందిన కరెన్ సిల్క్‌వుడ్ తన జీవితంతో నిరూపించింది. ముగ్గురు పిల్లలకు తల్లైన ఆమె 1970లలో ఒక అణు ఇంధన కర్మాగారంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తూ, అక్కడ కార్మికుల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రమాదకరమైన లోపాలను దాచిపెడుతున్నారని గుర్తించింది. తన సహోద్యోగుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని భావించిన కరెన్, వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించి అధికారుల దృష్టికి తీసుకెళ్లే సాహసం చేసింది. తన వద్ద ఉన్న ఆధారలను కోర్టుకు సమర్పించడానికి వెళుతున్న సమయంలో, ఆమె అనుమానాస్పదంగా రోడ్డు ప్రమాదంలో మరణించింది. నిజం బయటపడకుండా అడ్డుకోవాలనే ప్రయత్నంలో భాగంగా కరెన్‌ను హత్య చేసి ఉంటారన్న అనుమానాలు ఉన్నాయి. ఆమె మరణం వెనుక ఉన్న రహస్యాలు పూర్తిగా వీడకపోయినా, ఆమె పోరాటం వృథా కాలేదు. ఆమె కుటుంబం చేసిన న్యాయపోరాటం ఫలితంగా కార్మికుల హక్కులకు, పరిశ్రమల్లో భద్రతకు, విజిల్‌బ్లోయర్ల రక్షణకు అమెరికాలో కీలకమైన చట్టపరమైన మార్పులు చోటుచేసుకున్నాయి. కరెన్ కథ ప్రతి మహిళకు ఒక స్ఫూర్తి. అన్యాయాన్ని చూసి మౌనంగా ఉండటం కంటే, దాన్ని ప్రశ్నించే ధైర్యమే సమాజాన్ని ముందుకు నడిపిస్తుంది. సత్యం కోసం నిలబడే వ్యక్తులు కొన్నిసార్లు కష్టాలను ఎదుర్కొన్నా, వారి ఆలోచనలు సమాజంలో శాశ్వత మార్పులకు నాంది పలుకుతాయి. మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు సామాజిక బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వర్తించగలరని, తమ స్వరం ఎన్నో జీవితాలను రక్షించగలదని కరెన్ జీవితం చెబుతోంది. నిజాయితీ, నిబద్ధత, ధైర్యం కలిసినప్పుడు ఒక సాధారణ మహిళ కూడా చరిత్రలో చెరగని ముద్ర వేయగలదని ఆమె జీవితం మనకు గుర్తు చేస్తుంది.



# దేశ రాజకీయాలను శాసించే శక్తి యువతరానిదే

యువజన వ్యతిరేక విధానాలతో ఆక్రోశం పెరిగి ఉద్యమాల వైపు

ఉద్యోగాలు, విద్యా సమస్యలపై పాలకులు వెంటనే స్పందించాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రభుత్వాలు అవలంబిస్తున్న యువజన వ్యతిరేక విధానాలతో తీవ్ర అసంతృప్తి పెరిగి యువత ఉద్యమాల వైపు అడుగులు వేస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం నల్లగొండలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఎఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశ రాజకీయాలను శాసించే శక్తి యువత చేతుల్లోనే ఉందన్నారు. యువత ఆకాంక్షలను, సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు వాటిని నిర్లక్ష్యం చేస్తూ అణచివేత ధోరణి అవలంబించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. యుజజన వ్యతిరేక విధానాలతో ఆక్రోశం పెరిగి యువత ఉద్యమాల వైపు అడుగులు వేస్తున్నారన్నారు. ఢిల్లీలో జరిగిన యువజన నిరసనలు దేశ యువతలో పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనమన్నారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ ఘటన దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీసిందని, దీనికి రాజకీయ, పరిపాలనా బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా డిమాండ్ వస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పం దించకపోవడం బాధాకరమన్నారు. గతంలో చిన్నఘటనలకే మంత్రు లు రాజీనామాలు చేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా, పోటీ పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. యువశక్తిని పోలీసు బలంతో అణచివేయాలని ప్రయత్నిస్తే ప్రజావ్యతిరేక పరిస్థితులు మరింత తీవ్రతరం అవుతాయని నెల్లికంటి సత్యం హెచ్చరించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ ఉద్యోగ నియామకాలు, పోటీ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరిగే ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నమల్ల నవీన్, జిల్లా కార్యదర్శి యషబోయిన మల్లేశం, గడ్డం నవీన్, బండారు శంకర్, జూలూరు వెంకటాచారి, దశరథ్, బాబీ తదితరులు పాల్గొన్నారు.




# ప్రజలను విస్మరిస్తున్న పాలకులు

ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని, సామాన్యుల కంటే కార్పొరేట్ శక్తుల పట్ల సానుకూలత ప్రదర్శిస్తున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. కేంద్రంలో మోదీ సర్కార్ ప్రజల గురించి ఆలోచించడం లేదని పేద, మధ్యతరగతి ప్రజలు బతకలేని స్థితికి ప్రభుత్వ చర్యలు నెట్టివేస్తున్నాయన్నారు. సిపిఐ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. బిజి క్లెమెంట్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగ సబ్సిడీలను ఎత్తివేసి వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ పరిధిలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుందన్నారు. రసాయనిక ఎరువులపై సబ్సిడీ ఎత్తివేత, ఇతర దేశాల నుంచి జీరో ట్యాక్స్‌తో వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతి కార్పొరేటీకరణలో భాగంగానే జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. అంబానీ, అదానీ తప్ప వేరే సమూహాల గురించి ప్రభుత్వం ఆలోచించడం లేదని వారి కనుసన్నల్లోనే ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి విబి జీ రాం జీ పథకాన్ని తీసుకు వచ్చారని అదే క్రమంలో నాలుగు లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల గురించి పట్టించుకోవడం లేదని హేమంతరావు తెలిపారు. పంటల బీమా పథకాన్ని అమలు చేయడంతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి, సమస్యలపై ప్రజలను చైతన్యం చేయడానికి ఆగస్టు నెలలో సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడుతున్నామని, సెప్టెంబర్ నెలలో చలో ఢిల్లీ విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆగస్టు ఆరు నుంచి 15 వరకు ఖమ్మం జిల్లాలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పాదయాత్రకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రజా సంఘాల సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో సిపిఐరాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, అజ్మీర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.




## హైస్పీడ్ రైలుమార్గాన్ని గత అలైన్‌మెంట్ ప్రకారమే కొనసాగించాలి

సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** హైస్పీడ్ రైలు మార్గాన్ని గత అలైన్‌మెంట్ ప్రకారమే కొనసాగించాలని, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల మేధావులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజా సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీలు ఆలోచించాలని, ఈ విషయాన్ని చర్చించాలని రైల్వే లైన్ సాధన కోసం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని భారత కమ్యూనిస్టు పార్టీ అనమాల లింగయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకు ముఖద్వారంగా ఉన్న దినదిన అభివృద్ధి చెందుతున్న కోదాడ, సూర్యాపేట పట్టణాలకు హై స్పీడ్ రైల్వే మార్గం ఎంతో అవసరమన్నారు. గత అలైన్‌మెంట్ సూర్యాపేట, కోదా మీదుగా జగ్గయ్యపేట ఉన్నప్పటికి దానిని మార్చడం సరైనది కాదన్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్నపట్టణాలకు ప్రజలకు హైస్పీడ్ రైలు అవసరమన్నారు. హైస్పీడ్ రైలు మార్గాన్ని ఆలైన్మెంట్ క్యాబినెట్ నిర్ణయాన్ని మార్చకపోతే అన్ని వర్గాలను కలుపుకుని రైతులు మార్గం వచ్చేంత వరకు పోరాటాలు నిర్వహిస్తామని వారన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, గుండు వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, కౌన్సిలర్ చెనగాని సైదులు, జక్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# యువతపై లాఠీచార్జి అమానుషం

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

ఖమ్మం జిల్లాకేంద్రంలో సిపిఐ రాస్తారోకో


**ప్రజాపక్షం/ఖమ్మం :** నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో, భవిష్యత్తులో చెలగాటమాడిన ఆయనను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన కోరారు. ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి ఆందోళన చేపట్టిన విద్యార్థి యువకులపై లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానిక బైపాస్ రోడ్డులో సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధి కల్పనలో పూర్తిగా విఫలమైన మోదీ సర్కార్ ఇప్పుడు ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించి ప్రశ్నా పత్రాల లీకేజీ ద్వారా అవినీతికి పాల్పడుతుందన్నారు. లీకేజీకి కారణమైన ధర్మేంద్ర ప్రధాన్‌ను మోడీ ఎందుకు బర్తరఫ్ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. దేశంలో నియంతృత్వ ధోరణిలో పాలన సాగుతుందని శాంతియుత ప్రజాపోరాటాలపైన లాఠీలు ఝూళిపించడమే ఇందుకు నిదర్శనమని సురేష్ తెలిపారు. నియంతృత్వ ధోరణితో అవలంభించిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని గతం మాదిరే మోదీ ప్రభుత్వానికి కూడా అంతిమ ఘడియలు సమీపిస్తున్నాయని సురేష్ తెలిపారు. రాస్తారోకో సందర్భంగా బైపాస్ రోడ్డులో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, మహ్మద్ సలాం, శింగు నర్సింహారావు, పగడాల మల్లేష్, దండు ఆదినారాయణ, మిడికంటి వెంకట రెడ్డి, సిహెచ్ సీతామహాలక్ష్మి, యంగల ఆనందరావు, కూచిపూడి రవి, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

ఆగస్టు 1న సూర్యాపేటలో జిల్లా 3వ మహాసభలు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఆగస్టు 1న సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరుగు ఎఐటియుసి జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. 106 సంవత్సరాల చరిత్ర కలిగి భారతదేశంలోని ఏకైక పెద్ద కార్మిక సంఘంగా ఉన్న ఎఐటియుసి జిల్లా మూడో మహాసభలను జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ మహాసభల్లో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమం రూపొందించుకోవడం కోసం దోహదపడుతాయన్నారు. కార్మిక వ్యతిరేక విధానాల అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సమరశీల పోరాటాలకు సన్నద్ధం చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోతు రాజారాం, బ్యాంక్ ఎంప్లాయిష్ యూనియన్ నాయకులు నీల శ్రీనివాస్, ప్రాంతీయ కార్యదర్శి సాయిబాబా, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎడెల్లి శ్రీకాంత్, బూర సైదులు, దీకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు, జరిమానా

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మద్యం సేవించి వాహనం నడిపిన ఒక్కరికి 2 రోజుల జైలు శిక్ష, జరిమానా సూర్యాపేట కోర్టు విధించినట్లు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ బి.యాదవేందర్ రెడ్డి తెలిపారు. పలు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేయగా ఒకరు పట్టుబడగా వారిని మంగళవారం ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా 2 రోజుల జైలుతోపాటు, రూ.1,000 జరిమానా విధించారని వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతోపాటు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. పోలీసులు చేసే వాహన తనిఖీలు ప్రజల ప్రాణరక్షణ కోసమేనని ప్రజలు సహకరించాలని కోరారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం



కాపాడిన పోలీసులు

**ప్రజాపక్షం/బీబీనగర్ :** కుటుంబ కలహాలు, వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ బీబీనగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించగా, అప్రమత్తమైన పోలీసులు సకాలంలో స్పందించి ఆమెను సురక్షితంగా రక్షించారు. పోలీసులు తెలిపిన ప్రాథమిక వివరాల ప్రకారం, వివాహిత అయిన ఆ మహిళకు కుటుంబ విభేదాల కారణంగా భర్తతో దూరం ఏర్పడింది. అనంతరం మరో వ్యక్తితో పరిచయం ఏర్పడి, కొంతకాలంగా అతనితో కలిసి ఉంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆరోగ్యానికి సంబంధించిన అనుమానాల నేపథ్యంలో సదరు వ్యక్తి వైద్య పరీక్షలు చేయించగా, వాటి ఫలితాల కారణంగా ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. అనంతరం ఆ మహిళను బీబీనగర్ చెరువు కట్ట సమీపంలో వదిలి వెళ్లినట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ చెరువులో దూకి ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ విషయం పోలీసులకు చేరడంతో వారు వెంటనే రంగంలోకి దిగి, కేవలం 10 నిమిషాల్లో ఆమెను గుర్తించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కౌన్సెలింగ్ కూడా నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. మహిళ ఆరోగ్య పరిస్థితి, వ్యక్తిగత పరిస్థితులు, ఘటనకు దారితీసిన అసలు కారణాలపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## కెజిబివి పాఠశాలను సందర్శించిన జిల్లా అడిషనల్ కలెక్టర్



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని రాంపూర్ కెజిబివి పాఠశాలను మంగళవారం అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాల పరిశుభ్రత, నీటి వసతి, వంట గది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. 220 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో నీటికి ఇబ్బంది కలుగుతున్నదని ఎంపీడీవో గీతారెడ్డి అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో, వెంటనే ఈ విషయాన్ని గ్రిడ్ ఈ, ఈ కరుణాకర్ నీటి ఇబ్బందులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ డి.అనిత తదితరులు పాల్గొన్నారు.

## సర్‌ను వంద శాతం పూర్తి చేయాలి

ఎస్ఐఆర్‌పై బిఎల్ఎలతో ప్రభుత్వ విప్ వీరేశం సమీక్ష



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్‌ఏలు) సూచించారు. మంగళవారం నకిరేకల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎస్ఐఆర్‌పై సమీక్ష సమావేశాలు నిర్వహించారు మంగళవారం మండల కేంద్రంలోని శబరి గార్డెన్స్‌లో జరిగిన సమావేశానికి ప్రభుత్వ విప్ వీరేశంతో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్నా కైలాస్ నేత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైందని అన్నారు. నార్కట్‌పల్లి మండలంలో ఇప్పటికే 91.6 శాతం సర్వే పూర్తి కావడం అభినందనీయమని పేర్కొన్న ఆయన, మిగిలిన 9 శాతం ప్రక్రియను వచ్చే రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ మువ్వా విజయ్ బాబు, ఈఆర్‌వో స్థాయి కోఆర్డినేటర్ చామల శ్రీనివాస్ జెర్రిపోతుల భరత్ గౌడ్, బత్తుల ఉషయ్య గౌడ్, గాయం శ్యాంసుందర్ రెడ్డి, సత్తు సత్తయ్య, గడ్డం పశుపతి, బీఎల్‌ఏలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లా కేంద్రంలోని ఎంఎఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో పాఠశాలను సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడ తరగతి గదులు లేవని, ఖాళీగా 3 టీచర్స్ పోస్టులు ఉన్నాయని, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్‌లు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం వండేందుకు వంట గది కూడా లేక రేకుల షెడ్డులో వండుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి విద్యార్థుల కోసం లైబ్రరీ, సైన్స్ ల్యాబ్‌కు గదులు, వంట గది, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులను నియమించడంతోపాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మేకనబోయిన సైదమ్మ, గుడిపూరి లక్ష్మి, పోతురాజు లక్ష్మి, శాంత పాల్గొన్నారు.

# తాగునీటి కొరత లేకుండా చర్యలు



జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ:** క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారులు వారానికి రెండుసార్లు తప్పనిసరిగా పర్యటించి హాస్టళ్లు, గ్రామపంచాయతీలు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వ్యవసాయ కేంద్రాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలను వారానికి రెండుసార్లు సందర్శించి నివేదికలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు సమర్పించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించడంతో పాటు, గుడిసెల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, కేజీబీవీలు, గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, మిషన్ భగీరథ నీటి సరఫరా షెడ్యూల్ ప్రకారం అందించాలని ఆదేశించారు. మునుగోడు ప్రాంతంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్నందున బోర్ల మరమ్మతులు చేసి ప్రత్యామ్నాయ నీటి వనరులు సిద్ధంగా ఉంచాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో అవసరమైన చోట ప్రత్యామ్నాయ నీటి సరఫరా చర్యలు చేపట్టాలని అన్నారు. గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న సీట్లను పేద విద్యార్థులకు వెంటనే భర్తీ చేసి వారికి విద్యావకాశాలు కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ గుర్తింపు

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం) :** కష్టపడి పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలో 100 శాతం ఓటరు మ్యాపింగ్ పూర్తి చేసిన బూత్ లెవల్ ఏజెంట్లును ప్రత్యేకంగా ఆయన అభినందించారు. ఈ సందర్భంగా బిఎల్‌ఏలకు ప్రోత్సాహకంగా నగదు బహుమతిని స్థానిక మండల పార్టీ కార్యాలయంలో అందజేశారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రభుత్వం పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరవేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందడి అనంతరెడ్డి, మాజీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, నాయకులు బత్తిని ఉప్పలయ్య గౌడ్, జె.నగేష్, కోసన కిష్టయ్య, కట్టెకోల హనుమంతు, సర్పంచులు ప్రజాప్రతినిధులు అనుబంధ సంఘాల నాయకులు బిఎల్‌ఏలు యూత్ కాంగ్రెస్ ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును కాపాడడంలో పూర్తిగా విఫలమైందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం సుభాష్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. యువకులు ప్లకార్డులు చేతబూని,కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన విద్యార్థియువజన నిరసనలు దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆగ్రహానికి ప్రతీక అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరీక్షల లీకేజీలపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల న్నారు. ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్, ఎసబోయిన మల్లేష్, గడ్డం నవీన్, జూలూరి మహేష్, బండారు శంకర్, కట్ట దశరథ్, బాబీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జలసంరక్షణ పనులకు అధికారులు ప్రాధాన్యత

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధికారులు జలసిరి, తాగునీరు, జల సంరక్షణ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వి.బి. రామ్‌జీ, స్వచ్ఛ భారత్, జలసిరి, ఎల్‌నినో, వ్యవసాయ సంబంధిత అంశాలపై జిల్లాలోని ఎంపిడిఓలు, ఎంపిఓలు, పంచాయితీ కార్యదర్శులతో ఆయన వెబ్ఎక్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల లక్ష్యాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సమర్పించి, మరుగుదొడ్డి లేని అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి మరుగుదొడ్డి మంజూరు చేయాలన్నారు. ఇందిరమ్మ, నాన్ ఇందిరమ్మ గృహాలకు సంబంధించిన ప్రతిపాదనలను విడివిడిగా సమర్పించాలని ఆదేశించారు. మంజూరైన మరుగుదొడ్లకు సంబంధించిన ఫోటోలను స్వచ్ఛ భారత్ మిషన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి నిధులు పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంకుడు గుంతలు, బోరుబావుల పునరుద్ధరణ, ఇంటి పైకప్పుల వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు, వ్యవసాయ కుంటలు వంటి పనులకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఉద్యానవన, ఆయిల్ ఫామ్ రైతులను ప్రోత్సహించి వ్యవసాయ కుంటలు, బోరుబావుల పునరుద్ధరణ పనులను పెంచాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పైకప్పుల వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలకు, ప్రతి గ్రామ సమాఖ్య భవనానికి సామూహిక పారిశుద్ధ్య సముదాయం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. పాఠశాల మరుగుదొడ్ల అంచనాలను వెంటనే సిద్ధం చేసి ఆమోదానికి పంపాలని తెలిపారు. అన్ని పథకాలలో సమాచారం ఖచ్చితత్వం, సకాలంలో ప్రతిపాదనల సమర్పణ, చెల్లింపుల పూర్తి, క్షేత్రస్థాయి ధృవీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, లక్ష్యాలు పూర్తయ్యే వరకు ప్రతిరోజు పర్యవేక్షణ, క్లస్టర్ వారీగా సమీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్య, జడ్‌పి సిఈఓ శిరీష, డిపిఓ యాదగిరి, ఈజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'సర్'లో మిర్యాలగూడను రాష్ట్రానికే ఆదర్శంగా నిలపాలి

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంను వంద శాతం పూర్తిచేసి రాష్ట్రంలోనే మిర్యాలగూడ నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్‌లో ఆయన ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్‌నేత, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సర్ ఇన్‌చార్జ్ షబ్బీర్ అలీ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో పట్టణ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అయిన ఓటరు జాబితా ఖచ్చితత్వం అత్యంత కీలకమన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సర్ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని, అవసరమైన దరఖాస్తులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో, అంకిత భావంతో పనిచేస్తే మిర్యాలగూడ నియోజకవర్గం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధాబాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టణ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'సర్'లో బిఎల్‌వి, సూపర్‌వైజర్ల పాత్ర కీలకం



ఎమ్మెల్యే మందుల సామేల్

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** ఓటర్ నమోదు ప్రక్రియలో బిఎల్‌వి, సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్, సర్ ప్రక్రియ నియోజకవర్గ ఇంచార్జి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండేటి మల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ స్థాయి మండల అధ్యక్షులు, బిఎల్‌విలు, సూపర్‌వైజర్లు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓట్లను తీసివేత ప్రక్రియకు పూనుకుందని, మాయ మాటలతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఓటర్ నమోదు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బిఎల్‌వలు, సూపర్‌వైజర్లు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారని అన్నారు. తుంగతుర్తి నియోజక వర్గంలో సుమారు 20 వేల ఓట్లు పోతాయని తెలిపారు. గ్రామాల్లో చనిపోయిన వారి సంఖ్య, గతంలో హైదరాబాద్‌లో, గ్రామాల్లో ఓట్లు ఉండేవని, ఇప్పుడు ఏదైన ఒకే చోట ఓట్లు ఉండే ఆస్కారం ఉందని తెలిపారు. తుంగతుర్తి మండల కేంద్రంలో సుమారు 56 అడుగుల జాతీయ జెండా ఏర్పాటుకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పిఏసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు, మండల అధ్యక్షులు రేగటి రవి గౌడ్, పచ్చిపాల వెంకన్న, సుంకర జనార్ధన్, వెంకటేశం, మధుకర్ రెడ్డి, మల్లారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ గంగరాజు యాదవ్, నాయకులు మాచర్ల అనిల్, కొండ రాజు, అజయ్ పాల్గొన్నారు.

## ఆలేరు బిఆర్ఎస్‌లో ముదిరిన 'పోరు'





**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత పోరు పరాకాష్టకు చేరింది. తాజా మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి చేసిన ఆరోపణలు, దానికి తోడు ప్రస్తుత ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఇచ్చిన ఇంటర్వ్యూ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్గా మారడంతో బీఆర్ఎస్ వర్గపోరు బహిరంగంగానే భగ్గుమంది. ఈ వివాదం ఏ స్థాయికి చేరిందంటే... ఆలేరు నియోజకవర్గ కేంద్రంలోని ప్రకాష్ గార్డెన్లో అంగరంగ వైభవంగా నిర్వహించాల్సిన మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ జన్మదిన వేడుకలు అర్ధాంతరంగా రద్దయ్యాయి. ఈ పరిణామంతో నాయకుల మధ్య పచ్చిగడ్డి వేస్తే మండేంతగా విభేదాలు తీవ్రమయ్యాయని స్పష్టమవుతోంది.

**సునీత చాలా లేట్‌గా కళ్లు తెరిచింది: విప్ బీర్ల ఐలయ్య సెటైర్లు**

సునీత మహేందర్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలపై ఓ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో స్పందించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మరింత మంట రాజేశారు. 'గతంలో రెండుసార్లు సునీత చేతిలో ఓడిపోయిన భిక్షమయ్య గౌడ్, ఆమెను గెలిపించడానికి ఎందుకు పనిచేస్తారని సునీత అనుకుంది? ఆమె చాలా లేటుగా కళ్లు తెరిచింది' అని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా, 'భిక్షమయ్య గౌడ్ అనుచరులు చాలామంది నాతో మాట్లాడినప్పుడు... 'సార్, ఆయన మీకే పనిచేస్తున్నాడు, మిమ్మల్నే గెలిపించమని మాకు చెప్పారు' అని నాతో స్పష్టంగా చెప్పారు' అంటూ ఐలయ్య సంచలన విషయాలను బయటపెట్టారు.

**నన్ను దగ్గరుండి ఓడగొట్టారు : గొంగిడి సునీత ఆవేదన**

అంతకుముందు గొంగిడి సునీత ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'తన శిష్యుడైన బీర్ల ఐలయ్యను గెలిపించడానికే భిక్షమయ్య గౌడ్ బీఆర్ఎస్లోకి వచ్చి దగ్గరుండి ఓడగొట్టారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు పాల్గొన్న ఎన్నికల సభల్లో కూడా ఆయన కనీసం నా పేరు ఎత్తలేదు, నాకు ఓటు వేయమని ప్రచారం చేయలేదు' అని విరుచుకుపడ్డారు. భిక్షమయ్య గౌడ్ పార్టీకి నమ్మకస్తుడు కాదని, ఆయనొక వెన్నుపోటుదారుడని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డీలిమిటేషన్ తర్వాత కెటిఆర్ ఆశీస్సులతో టికెట్ తనకే వస్తుందని భిక్షమయ్య చెప్పుకుంటున్నారని, అయితే కేసీఆర్ కుటుంబంలో కూతురి లాంటి తనకే ఆలేరు బీఆర్ఎస్ టికెట్ దక్కుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

**వైరల్ వీడియోలు.. రద్దయిన బర్త్‌డే వేడుకలు!**

వీరిద్దరి ఇంటర్వ్యూల క్లిప్పింగులు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో నియోజకవర్గంలో రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. ఈ ఆరోపణలు ప్రత్యారోపణల తీవ్రతను తట్టుకోలేక, ఆలేరులోని ప్రకాష్ గార్డెన్స్‌లో ఘనంగా జరగాల్సిన తన పుట్టినరోజు వేడుకలను భిక్షమయ్య గౌడ్ రద్దు చేసుకోవడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. తన సొంత క్యాడర్‌తో ఇన్నాళ్లూ నియోజకవర్గంలో బలంగా ఉన్న భిక్షమయ్య, ఈ రగడతో తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.

**మూడు ముక్కలాటగా ఆలేరు బీఆర్ఎస్.. ఆందోళనలో క్యాడర్**

ఒకవైపు గొంగిడి సునీత, మరోవైపు బూడిద భిక్షమయ్య గౌడ్, ఇంకోవైపు కల్లూరి రామచంద్రారెడ్డి... ఇలా నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధానంగా మూడు వర్గాలుగా విడిపోయి తిరుగుతుండటంతో గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు తీవ్ర అయోమయంలో పడ్డారు. ఎవరికి మద్దతు తెలిపినా మిగతా నేతల నుంచి ఇబ్బందులు తప్పవనే భయం కార్యకర్తల్లో నెలకొంది. 'నాపై పోటీకి బీఆర్ఎస్‌లో ముగ్గురు నేతలు కొట్టుకుంటున్నారు' అని బీర్ల ఐలయ్య అన్న మాటలు ఇప్పుడు నిజమయ్యాయని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. పార్టీ అభివృద్ధికి అండగా ఉండే నాయకులను ప్రోత్సహించకపోతే, రాబోయే రోజుల్లో వర్గపోరు కారణంగా ఆలేరు స్థానం మళ్లీ కాంగ్రెస్ పావురం కావడం ఖాయమని గులాబీ శ్రేణులు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం జోక్యం చేసుకుని ఆలేరు నాయకత్వంపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని స్థానిక బీఆర్ఎస్ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.



## రోడ్డు రోలర్ కింద బుల్లెట్ సైలెన్సర్లు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఎస్‌పి కె.నర్సింహ

**ప్రజాపక్షం/కోదాడ:** నిబంధనలకు విరుద్ధంగా బుల్లెట్ బైకులను మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చి అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వాహనదారులపై కోదాడ పట్టణ, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు చేపట్టారు. ఈ డ్రైవ్‌లో గుర్తించిన 40 మోడిఫైడ్ సైలెన్సర్లను మంగళవారం కోదాడ రంగా థియేటర్ చౌరస్తాలో జిల్లా ఎస్‌పి నర్సింహ సమక్షంలో రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి నర్సింహ మాట్లాడుతూ అతివేగంగా, అధిక శబ్దాలతో వాహనాలు నడుపుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమన్నారు. వృద్దులు, రోగులు, చిన్నారులకు ఇలాంటి తీవ్ర అసౌకర్యం కలిగిస్తాయని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు కంపెనీ అమర్చిన సైలెన్సర్లనే ఉపయోగించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. యువత బాధ్యతయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. పట్టణంలో ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, టౌన్ ఇన్స్‌పెక్టర్ శివశంకర్‌నాయక్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## రైతుల చిరకాల కల సాకారం..



ధర్మారెడ్డిపల్లి కాలువలో సాగునీటి విడుదల

**ప్రజాపక్షం/వలిగొండ :** భువనగిరి నియోజకవర్గ రైతాంగం చిరకాలంగా ఎదురుచూస్తున్న శుభ ఘడియ ఆవిష్కృతమైంది. వలిగొండ మండలంలోని సంగెం ధర్మారెడ్డిపల్లి కాలువలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కలిసి సాగునీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా కాలువ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు రూ.125 కోట్ల వ్యయంతో చేపట్టిన ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 16 నెలల్లోనే సగానికి పైగా పూర్తి చేసి, రైతులకు సాగునీటిని అందించే స్థాయికి తీసుకువచ్చిందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టుకు తమ ప్రభుత్వం వేగం తీసుకొచ్చి రైతుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందని అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో పూర్తి చేసి, రైతులకు శాశ్వతంగా సాగునీటిని అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలువ పూర్తయిన అనంతరం వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో వ్యవసాయ ఉత్పత్తి పెరగడమే కాకుండా రైతుల ఆర్థికాభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ధర్మారెడ్డిపల్లి కాలువలో నీటి విడుదలతో ఈ ప్రాంత రైతుల చిరకాల నిరీక్షణకు తెరపడిందని, కాలువ పూర్తయిన తర్వాత ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు, ఇరిగేషన్ ఇఇ, డిఇ, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కురవి వీరభద్ర స్వామి దేవస్థానంలో భారీ అవినీతి

పలు అంశాలపై మంత్రి పేషీలో ఫిర్యాదు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో అవినీతి, అక్రమాలు, భక్తుల నుంచి అక్రమ వసూళ్లు, ఆలయ నిధుల దుర్వినియోగం జరుగుతున్నాయని ఆరోపిస్తూ బీఎస్పీ రాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్ తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, పేషి కార్యాలయంలో నేడు ఫిర్యాదు చేశారు. ఆరోపణలపై ఉన్నతస్థాయి అధికారులతో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, భక్తులు కానుకగా సమర్పించిన బంగారానికి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో లెక్కలు నిర్వహించలేదని, వెండి మాత్రమే కొలతలు చేసినట్లు ఆరోపించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడం లేదా కనిపించకపోవడం కూడా అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. లడ్డు ప్రసాదాల తయారీ, విక్రయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, నిర్ణయించిన బరువుకు తక్కువగా ప్రసాదాలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. కొబ్బరికాయలు కొట్టడం, వాహన పూజల పేరుతో అధికారిక రుసుములకు అదనంగా భక్తుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమం పేరుతో భారీగా విరాళాలు సేకరించి, వాటికి సంబంధించిన లెక్కలు, రసీదుల్లో అవకతవకలు జరిగాయని కూడా ఆరోపించారు. ఆలయంలో సంప్రదాయంగా నిర్వహించే పానసరం ఆచారాన్ని నిలిపివేసి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలన్నింటిపై దేవాదాయ శాఖ విజిలెన్స్ అధికారులతో స్వతంత్ర విచారణ జరిపించాలని, ఆలయ ఆర్థిక లావాదేవీలు, హుండీ ఆదాయం, బంగారం, వెండి, ప్రసాదాల విక్రయాలు, ఉద్యోగుల నియామకాలు, బదిలీలు, అన్నదాన నిధులపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని దార్ల శివరాజ్ డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే ఆలయ ఈఓ , జూనియర్ అసిస్టెంట్ పాటు బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ చేపట్టకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## నెక్కొండ ఎస్ఐ మహేందర్ సస్పెన్షన్




**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ మహేందర్‌ను శాఖాపరమైన ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఎస్ఐపై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు ప్రాథమిక విచారణ నిర్వహించిన అనంతరం సస్పెన్షన్‌కు ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే ఆయనపై వచ్చిన ఆరోపణల స్వరూపం, సస్పెన్షన్‌కు దారితీసిన కారణాలపై పోలీసు శాఖ నుండి ఇప్పటి వరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ పరిణామం నెక్కొండ పోలీస్, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారిక ఉత్తర్వులు, పోలీస్‌శాఖ వివరణ వెలువడిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## 'సర్' ప్రక్రియలో పరకాలను తొలి స్థానంలో నిలపాలి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పరకాల :** ఎస్ఐఆర్ ప్రక్రియలో పరకాల నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలపాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ భవాని నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతున్న తీరుపై పరకాల నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ ఇన్చార్జిలతో పరకాల శాసనసభ్యులు రేవూరు ప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింద. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా నల్గొండ ఎమ్మెల్సీ,వరంగల్ పార్లమెంట్ ఎస్ఐఆర్ పొలిటికల్ ఇంచార్జ్ శంకర్ నాయక్, పార్లమెంట్ అబ్జర్వర్ నాసిర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, ఎండి అయుబ్ పాల్గొన్నారు.అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించి,దిషా నిర్దేశం చేశారు.100 శాతం పూర్తయిన బూత్ లెవల్ ఏజెంట్లను అభినందించారు.రాష్ట్రంలో పరకాల నియోజకవర్గం ఎస్ఐఆర్ ప్రక్రియలో 4 స్థానంలో ఉన్నదని,ఇందుకు కృషిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తను వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రజాస్వామ్య పరిరక్షణకు బిఎల్ ఏల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని అన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటున్న పార్టీ నాయకత్వం ఒక టీం గా పని చేస్తున్నదని, ఈ టీం రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పునాదిగా నిలుస్తుందని అన్నారు.ఓటర్ వెరిఫికేషన్ లో ఎలాంటి అవకతవతలు జరగకుండా ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షాలతో అన్నదాతల్లో ఆనందం



**ప్రజాపక్షం/ములుగు:** జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన వర్షాలతో రైతుల్లో ఆశలు చిగురించాయి. చెరువులు, కుంటల్లో ఓ మోస్తారు నీరు చేరడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాభావంతో ఆందోళన చెందిన రైతులు తాజాగా కురిసిన వర్షాలతో ఊరట వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు తేలికపాటి వర్షాలే కురవడంతో పంటల సాగుపై రైతులు ఆందోళన చెందారు. అయితే సోమవారం రాత్రి కురిసిన వర్షం వ్యవసాయానికి ఊతమివ్వడంతో వరి నాట్లు వేగం పుంజుకున్నాయి. రోజుకు సుమారు 200 ఎకరాల్లో వరి నాట్లు సాగుతుండగా, ఈ పనులు మరో నెల రోజుల పాటు కొనసాగనున్నాయి. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న తమకు సకాలంలో వర్షాలు కురవడంతో అత్యంత అవసరమని రైతులు చెబుతున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండితేనే పంటలు బాగా పండడంతో పాటు కుటుంబాల జీవనోపాధికి భరోసా ఉంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చర్యలు

ఎల్‌నినో ప్రభావం

ఉమ్మడి జిల్లాల సమీక్ష సమావేశంలో

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/హనుమకొండ:** వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి,ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు కార్యాచరణ, కంటింజెన్సీ ప్రణాళికలు, వివిధ శాఖల సంసిద్ధతపై రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం హనుమకొండ ఐడీఓసీ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషనర్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి,రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కడియం శ్రీహరి, దొంతి మాధవరెడ్డి, మురళీ నాయక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికారి, రాష్ట్ర కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయి, డాక్టర్ సత్య శారద, హేమంత్ బొర్కడే సదాశివరావు, సందీప్ కుమార్ ఝా, రాహుల్ శర్మ, స్నేహ శబరీష్, ఆదనపు కలెక్టర్లు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, కేవీకే–ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని, దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావ ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. మూడు రోజుల క్రితం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సమగ్రంగా చర్చించారని, వర్షాభావ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ఆయా జిల్లాల్లో వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులు తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రివర్గానికి అందజేస్తారని, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను ప్రత్యేక అధికారిగా నియమించారని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నుంచి జిల్లాలను ఎలా గట్టెక్కించాలి, రైతులకు ఎలాంటి భరోసా కల్పించాలి, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. వర్షాభావ పరిస్థితులపై సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి, రాష్ట్రానికి అందాల్సిన సహాయం, కేంద్రం నుంచి పొందాల్సిన మద్దతుపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.రాష్ట్ర బిసి సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి స్పష్టం చేశారు.జిల్లాల అధికార యంత్రాంగం రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సహించాలని సూచించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాకు త్రాగు నీటిని అందించే ఏకైక ప్రాజెక్టు దేవాదుల ప్రాజెక్టు అని తెలిపారు. ఉమ్మడి ఉమ్మడి జిల్లాలోని 12నియోజకవర్గాలకు త్రాగు నీరు, సాగు నీరు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు దేవాదుల ప్రాజెక్టు పై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే రానున్న రోజులలో త్రాగు నీటికి సైతం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కావున దేవాదుల ప్రాజెక్టు ద్వారా లిఫ్ట్ చేస్తున్న నీటి నిర్వహణపై సమగ్రమైన వర్కింగ్ మాన్యువల్ రూపొందించాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. ఇదే సమయంలో దేవాదులలోని 10కి 10మోటార్లు కనీసం 100రోజులు నిరంతరాయంగా నడిపించే విధంగా పకడ్బంది చర్యలు తీసుకోవాలని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టులోని 3 ఫేజ్ లలోని 10మోటార్లను ఆగకుండా నడిపేందుకు విద్యుత్ సమస్య లేకుండా నీటి పారుదల, విద్యుత్ శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని ఇందుకు జిల్లా ఇంచార్జ్ మంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

## దేవాదుల నార్త్ కెనాల్ నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** హనుమకొండ జిల్లాలో ఎల్కతుర్తి భీమదేవరపల్లి మండల పరిధి కి సంబంధించి వర్షాలు లేక రైతులు పడుతున్న కష్టాలను కొంతవరకు తగ్గించడం కోసం నార్త్ కెనాల్ ద్వారా నీటి విడుదల చేసినట్లయితే రైతులకు పూర్తిస్థాయిలో లాభం జరుగుతుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ కోరారు. కాబట్టి మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని నార్త్ కెనాల్ ద్వారా నీళ్ల అందించి రైతులను కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

## పోలీసుల దాడి ఖండిస్తున్నాం

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్ కుమార్




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన విద్యా వ్యవస్థ వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సొతుకు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువజనులు, యువతులపై కేంద్ర ప్రభుత్వం పోలీసు బలగాలతో లాఠీ చార్జ్ చేయించడం, టియర్ గ్యాస్ లను ప్రయోగించడం, రబ్బర్ బుల్లెట్లతో దాడులకు పాల్పడటం అత్యంత అమానుషమని ఆయన తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల సమస్యలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం వారిపై అణచివేతకు దిగడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శించారు. ఈ దాడులను నిరసిస్తూ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ జడల రాజేశ్వరి, ఉల్లేరావు బన్నీ, సాయిరాం, పవన్,లలితా కళ్యాణి అశ్వినీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## బొగత జలపాతం సొబగులు 'అదుర్స్'


పర్యాటకులకు నీటి కొలనులోకి నో ఎంట్రీ

ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల ప్రభావం



**ప్రజాపక్షం/వాజేడు:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో పర్యాటక కేంద్రమైన బొగత జలపాతం మంగళవారం పాల నురుగు వలె ఉప్పొంగి ప్రవహిస్తుంది. తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలోని కొండలు, అటవీ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తూ జలపాతంలోకి భారీగా వరద నీరు చేరుతోంది. జలపాతం ప్రమాదకరంగా ప్రవహిస్తుండడంతో భద్రతా చర్యల్లో భాగంగా అటవీ శాఖ అధికారులు పర్యాటకులను నీటి కొలనులోకి అనుమతించడం లేదు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టి సందర్శకులను కేవలం వీక్షణ ప్రాంతానికే పరిమితం చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి బొగత జలపాతం అందాలను ఆస్వాదించేందుకు వచ్చిన పర్యాటకులు నీటిలోకి దిగే అవకాశం లేకపోవడంతో కొంత నిరాశకు గురైనప్పటికీ, ఉధృతంగా ప్రవహిస్తున్న జలపాతం ప్రకృతి సోయగాలను తమ కెమెరాల్లో బంధిస్తూ, సెల్ఫీలు దిగుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వర్షాకాలంలో పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## ఉపాధిహామీ పథకం అమలుపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపి కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) అమలు, ఉపాధి కల్పన, వేతనాల చెల్లింపుల స్థితిగతులపై వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఉపాధి కోరిన కుటుంబాలకు ఎంత మేర పని కల్పించారు? సగటున ఎన్ని పనిదినాలు లభించాయి? వేతనాల చెల్లింపుల్లో ఏమైనా బకాయిలు ఉన్నాయా? అనే అంశాలపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖను ఆమె వివరణ కోరారు.వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాస్వాన్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, వరంగల్ జిల్లాలో 2024 25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కోరిన అర్హ కుటుంబాల్లో 99.99 శాతం మందికి, 202526 ఆర్థిక సంవత్సరంలో 99.97 శాతం మందికి పని కల్పించారు. ఒక్కో కుటుంబానికి సగటున 2024 25లో 41.12 పనిదినాలు, 2025 26లో 27.89 పనిదినాలు లభించాయన్నారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించడంలో వరంగల్ జిల్లా మెరుగైన ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. గ్రామీణ ప్రజల సమస్యలను పార్లమెంట్ వేదికగా ప్రస్తావిస్తూ, వారి హక్కులు, సంక్షేమ పథకాల అమలుపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు.వేతనాల చెల్లింపుల విషయంలో కూడా వరంగల్ జిల్లాలో ఎలాంటి పెండింగ్ బకాయిలు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడం సానుకూల పరిణామమని కడియం కావ్య పేర్కొన్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా కూలీల ఖాతాల్లోకి నేరుగా వేతనాలు జమ కావడం వల్ల పారదర్శకత పెరిగిందన్నారు.భవిష్యత్తులో ఉపాధి కల్పన రోజులను మరింత పెంచడంతో పాటు మహిళలు, బలహీన వర్గాల భాగస్వామ్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన ఆస్తుల సృష్టి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల అమలుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా కోరారు.

## విద్యార్థి, యువజన నేతలపై లాఠీఛార్జికి నిరసనగళం

జంతర్ మంతర్ వద్ద లాఠీచార్జీని తీవ్రంగా ఖండించిన వలి ఉల్లా ఖాద్రి



**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్:** న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిన్న నిర్వహించిన "చలో పార్లమెంట్" కార్యక్రమంలో విద్యార్థులు, యువజన సంఘాల నాయకులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జీ చేయడం, వాటర్ కేనన్లు, టియర్ గ్యాస్ ప్రయోగించడాన్ని నిరసిస్తూ హనుమకొండ అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి మాట్లాడుతూ, విద్యార్థులు తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిర్వహించిన "చలో పార్లమెంట్" కార్యక్రమంపై పోలీసులతో దాడి చేయించడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డాక్టర్ ఖాద్రి డిమాండ్ చేశారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం, విద్యా రంగంలో ప్రైవేటీకరణ, ఫీజుల భారాలు, పరీక్షల నిర్వహణలో అవకతవకలు వంటి సమస్యలపై విద్యార్థులు, యువత ఆందోళన చేస్తున్నారని తెలిపారు. వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన కేంద్ర ప్రభుత్వం లాఠీలు, వాటర్ కేనన్లు, టియర్ గ్యాస్‌తో సమాధానం చెప్పడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డాక్టర్ ఖాద్రి డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పిడిఎస్ యూ యునైటెడ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుర్గం సారయ్య, వరంగల్ సామాజిక కార్యకర్త ఎం.ఏ. సమద్, ఏఐవైఎఫ్ హనుమకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ నాయక్, రవి, మహేష్, కరీం పాల్గొన్నారు.

## పరీక్షలో డమ్మీ అభ్యర్థిగా హాజరు..! ఇద్దరికి మూడేళ్ల జైలు

**ప్రజాపక్షం/ములుగు:** పదవ తరగతి పరీక్షలో మరో వ్యక్తి తరపున డమ్మీ అభ్యర్థిగా పరీక్ష రాసిన కేసులో ఇద్దరు నిందితులను మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ములుగు ప్రిన్సిపాల్ జేఎఫ్‌సిఎం కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. పోలీసుల కథకం ప్రకారం 2017లో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో జగన్నాథం నాగార్జున తన బాబాయి జగన్నాథం సాంబయ్యకు బదులుగా పరీక్ష రాయడానికి కేంద్రానికి వెళ్ళాడు. అభ్యర్థుల ధృవీకరణ చేపట్టిన ఇన్విజిలేటర్ హాల్ టికెట్‌లోని ఫొటోకు పరీక్ష రాస్తున్న వ్యక్తి సరిపోలకపోవడంతో అనుమానం వ్యక్తం చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనితో ములుగు పోలీసులు మాల్‌ప్రాక్టీస్, వ్యక్తి మార్పిడి అభియోగాలపై కేసు నమోదు చేశారు. విచారణ సందర్భంగా దర్యాప్తు అధికారులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నిందితులు నేరం చేసినట్లు నిర్ధారించి ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష రూ.10వేల జరిమానా విధించింది. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు లైజనింగ్ అధికారి డిఎస్పి కిషోర్ కుమార్, దర్యాప్తు అధికారి ఎస్ఐ నాగరాజు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, కోర్టు కానిస్టేబుల్ నరేష్‌ను జిల్లా ఎస్‌పి అభినందించినట్లు పోలీసులు తెలిపారు.

## వరదకు కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాకపోకలకు అంతరాయం

రోడ్డు తెగిపోవడంతో 25 గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు



**ప్రజాపక్షం/వాజేడు:** తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాల ప్రభావంతో ములుగు జిల్లా వాజేడు మండలం పెద్దగొల్లగూడెం సమీపంలోని 163వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన తాత్కాలిక డైవర్షన్ రోడ్డు వరద ఉధృతికి మంగళవారం కొట్టుకుపోయింది. దీంతో తెలంగాణఛత్తీస్‌గఢ్ మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి, వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం 163వ జాతీయ రహదారిపై కొత్త వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు వరదను తట్టుకోలేక తెగిపోవడంతో తెలంగాణ మహారాష్ట్ర చతిస్గఢ్ రాష్ట్రాలతో పాటు మండలంలోని సుమారు 25 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలు కూడా అంతరాయానికి గురయ్యాయి. గర్భిణీ మహిళను ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న 102 అంబులెన్స్ ఇసుకవాగు వద్ద నిలిచిపోవడంతో గంటసేపు వేచి చూసినా ప్రయోజనం లేక వెనుదిరగాల్సి వచ్చింది. రోడ్డు తెగిపోవడంతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర వైపు వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంఘటన స్థలాన్ని ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, వాజేడు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కృపాకర్, వెంకటాపురం సీఐ ముత్యం రమేష్, వాజేడు ఎస్సై జక్కుల సతీష్ పరిశీలించి, రాకపోకలను త్వరగా పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. వరద ఉధృతి తగ్గిన వెంటనే మరమ్మతు పనులు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అయితే, జాతీయ రహదారి నిర్మాణ సంస్థలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాత్కాలిక రహదారిని మరింత బలోపేతం చేసి ఉంటే ఈ అంతరాయం వచ్చేది కాదని విమర్శించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడంతో పాటు వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు చేపట్టాలి: వెంకన్న



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** విస్తృతంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ టి వెంకన్న అధికారులను ఆదేశించారు. నగర పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన తిరుమల బార్ జంక్షన్, ఎన్‌జిఓస్ రోడ్డు, ఎస్‌బిహెచ్ కాలనీ, రామకృష్ణ కాలనీ, కాకతీయ కాలనీ, బొంది వాగు, శివనగర్, మైసయ్య నగర్, సాయి గణేష్ నగర్, వడ్డేపల్లి చెరువు, 12 మోరీలు ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించి సమర్థవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా ఇంజనీరింగ్‌కు చెందిన మాన్‌సూన్ టీమ్స్ సహకారంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే తొలగించాలని చిన్న చిన్న గల్లీలోని డ్రైన్‌లో నీరు నిలిచి ఉండకుండా అవసరం మేరకు డీ సిల్టింగ్ ప్రక్రియ చేపట్టి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని వీటితో పాటు లింక్ రోడ్‌ల శుభ్రతపై దృష్టి సారించాలని స్వీపింగ్ మిషన్‌లు మరమ్మత్తులకు గురి కాకుండా చూడడంతో పాటు అట్టి మిషన్ పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజారెడ్డి, ఏంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ నిర్మించిన చిత్రం 'లెనిన్'. ఈ సినిమాకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు.

# లీల



## షూటింగ్‌లో బాలకృష్ణకు గాయాలు

వృద్ధి సినిమా బ్యానర్‌పై బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎన్ బి కె 111 సినిమాలో బాలకృష్ణ కు ప్రమాదం జరిగింది. కాకినాడ ఎయిర్ పోర్ట్ ప్రాంగణంలో షూటింగ్ జరుగుతున్న నేపథ్యంలో అక్కడ కొన్ని కీలక యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. షూటింగ్ జరుగుతుండగానే బాలకృష్ణ ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డారు. దీంతో బాలకృష్ణ మోకాలికి దెబ్బ తగిలింది. వెంటనే బాలకృష్ణకు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గాయం తీవ్రతను తెలుసుకునేందుకు స్కానింగ్ కూడా నిర్వహించారు.వైద్యుల సలహా మేరకు మైనర్ సర్జరీ చెయ్యాల్సి ఉంటుందని బాలకృష్ణ మీడియా ప్రతినిధి బృందం తెలిపింది. బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని ఆయన అభిమానులు అంటున్నారు. త్వరగా కోలుకోవాలని ఫాన్స్ ప్రార్థనలు చేస్తున్నారు.

## 'రావే చెలియా' అంటున్న జై కృష్ణ

'రావే చెలియా' అంటున్నాడు సూపర్ స్టార్ కృష్ణ మనవడు. మహేష్ బాబు అన్న కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని అజయ్ భూపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానిని కూడా ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో సీనియర్ నటుడు డాక్టర్ మోహన్ బాబు విలన్ పాత్రను పోషిస్తున్నారు. నిర్మాత పి.కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అశ్విని దత్ సమర్పిస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు, టీజర్లు, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా మేకర్స్ ఈ చిత్రం నుంచి రావే చెలియా సాంగ్‌ని లాంచ్ చేశారు. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ పాట ప్రేమ, భావోద్వేగాలతో హార్ట్ టచ్చింగ్ మెలోడీగా కంపోజ్ చేశారు. నాగ్ అర్జున్ రెడ్డి అందించిన మనసుని తాకే సాహిత్యానికి, కపిల్ కపిలన్ తన వోకల్స్ తో ప్రాణం పోశారు. జయకృష్ణ సినిమాటోగ్రఫీని నిర్వహించగా, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మాధవ్ కుమార్ గుళ్ళపాటి ఎడిటర్‌గా వ్యవహరిస్తుండగా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్. ఈ చిత్రం 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: జి.వి. ప్రకాష్ కుమార్, సినిమాటోగ్రఫీ: జయకృష్ణ,ఎడిటర్: మాధవ్ కుమార్ గుళ్ళపాటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శాకమూరి నారాయణ స్వామి, ఫైట్స్: రియల్ సతీష్.



## 'నాకు ఒకే ఒక్క కూతురే .. పేరు మణెమ్మ' అంటున్న రవితేజ



రవితేజ హీరోగా, శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఇరుముడిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫస్ట్ గ్లింప్స్‌తో సినిమాపై ఆసక్తిని పెంచిన మేకర్స్, ఆ తర్వాత విడుదల చేసిన తొలి పాట 'ఇరుముడి కట్టు'తో ఆకట్టుకున్నారు. అయ్యప్ప స్వామిపై భక్తి భావాన్ని ఆవిష్కరించిన ఆ పాట చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. షూటింగ్ పార్ట్‌ను పూర్తి చేసిన రవితేజ ఇప్పుడు ఈ సినిమా డబ్బింగ్ పనులు కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన డబ్బింగ్ స్టూడియో వీడియో సోషల్ మీడియాలో ఆకట్టుకుంటోంది. వీడియోలో 'నాకు ఒకే ఒక్క కూతురే... పేరు మణెమ్మ' అంటూ రవితేజ ఎంతో ఎమోషనల్‌గా చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. ఆ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో తండ్రికూతురు మధ్య ఉండే బలమైన అనుబంధాన్ని దర్శకుడు చూపించబోతున్నారనే ఆసక్తిని మరింత పెంచారు. ఈ వీడియోలో బేబీ నక్షత్ర, దర్శకుడు శివ నిర్వాణ కూడా కనిపించారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ చివరి దశలో ఉండగా, కేవలం మూడు రోజుల చిత్రీకరణ మాత్ర మే మిగిలి ఉంది. దీంతో సినిమా అనుకున్న షెడ్యూల్ ప్రకారమే ఆగస్టు 21న గ్రాండ్‌గా థియేటర్ల లో విడుదల కానుంది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: జివి ప్రకాష్ కుమార్. డిఒపి: విష్ణు శర్మ, రెడిటింగ్: ప్రవీణ్ పూడి, స్క్రిప్ట్ కోఆర్డినేటర్: నరేష్ బాబు పి.

## 'చెన్నై లవ్ స్టోరీ'కి యు/ఎ సర్టిఫికెట్

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా 'కలర్ ఫొటో', 'బేబి' వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కెఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందుతున్న సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై ఎస్ కెఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు బ్లాక్ బస్టర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ నెల 24న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు 'చెన్నై లవ్ స్టోరీ' మూవీ రెడీ అవుతోంది.తాజాగా ఈ చిత్ర సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సినిమాకు సెన్సార్ నుంచి యు/ఎ సర్టిఫికేషన్ దక్కింది. ఇటీవల వచ్చిన ప్రేమ కథల్లో ఈ సినిమా విభిన్నంగా ఉందని కుటుంబం అంతా చూడగలిగే ఇలాంటి మంచి ప్రేమ కథలు మరిన్ని రావాలని సెన్సార్ సభ్యులు ప్రశంసించారు. మరోవైపు 'చెన్నై లవ్ స్టోరీ' మేకర్స్ అగ్రెసివ్ ప్రమోషనల్ యాక్టివిటీస్ చేస్తున్నారు. . 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాను ఈ నెల 23న విడుదల చేస్తున్నారు.



## 'మనసాగదే' సాంగ్ రిలీజ్

రాకింగ్ స్టార్ యష్ 'టాక్సిక్: ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్‌అప్స్' నుంచి విడుదలైన తొలి పాట 'తబాహీ' రికార్డు బ్రేకింగ్ రెస్పాన్స్ తో చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు అదే జోష్‌ను కొనసాగిస్తూ మేకర్స్ రెండో పాట 'మనసాగదే' (తెలుగు వెర్షన్)ను విడుదల చేశారు. మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, కెవిఎన్ ప్రొడక్షన్స్, జీ మ్యూజిక్ కంపెనీ కలిసి ఈ పాటను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాయి.'తబాహీ' ప్రేమలోని ఉప్పొంగే ఉద్వేగాలను చూపిస్తే, 'మనసాగదే' మాత్రం ప్రేమలోని మరో కొత్త కోణాన్ని ప్రజెంట్ చేసింది. మనసులో దాచుకున్న భావాలు, తీరని తపన, మౌనంగా మిగిలిపోయిన ప్రేమను ఈ పాట ఎంతో అందంగా పలికిస్తుంది.ఈ పాటలో యష్, తారా సుతారియా రాయా, రెబెకా పాత్రల మధ్య బంధాన్ని పూర్తిగా కొత్త కోణంలో చూపించారు. వీరిద్దరి మధ్య కనిపించే కెమిస్ట్రీ, ఎమోషన్స్ కట్టిపడేసింది. 'తబాహీ' లో కనిపించిన రాయా పాత్ర ఈసారి మనసులో నడుస్తున్న సంఘర్షణను కూడా సూచిస్తుంది.తనిష్క్ బాగ్చి, అర్సాన్ నిజామీ, ఫహీమ్ అబ్దుల్లా స్వరపరిచిన ఈ రొమాంటిక్ మెలోడీకి సిద్ధార్థ్ బస్రూర్ తన వోకల్స్ టప్ ప్రాణం పోశారు. ఐదు భాషల్లో విడుదలైన ఈ పాట తెలుగు వెర్షన్‌కు 'మనసాగదే' టైటిల్ తో రిలీజ్ చేశారు. తెలుగు సాహిత్యాన్ని రామజోగయ్య శాస్త్రి అందించారు. హిందీలో 'మధోష్', కన్నడలో 'మనమోహక', తమిళంలో 'తడుమారు ధేయ్', మలయాళంలో 'మధుమోహిని' పేర్లతో ఈ పాట విడుదలైంది.ఈ చిత్రంలో యష్, నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. యష్, గీతు మోహన్‌దాస్ కలిసి కథను అందించగా, గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ నిర్మిస్తున్న 'టాక్సిక్: ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్‌అప్స్' కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో తెరకెక్కుతోంది. తెలుగు, తమిళం, హిందీ, మలయాళంతో పాటు పలు భాషల్లో డబ్ వెర్షన్లు విడుదల కానున్నాయి. ఈ చిత్రం 2026 ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.









# ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాల్సిందే

- ప్రధాని నరేంద్ర మోదీకి వామపక్ష విద్యార్థి సంఘాల అల్టిమేటమ్
- విద్యార్థులు, యువత రక్తం చూడడమేనా దేశభక్తి అని నిలదీత
- జంతర్‌మంతర్‌లో విద్యార్థి ఉద్యమానికి సంఘీభావంగా చలో లోక్‌భవన్
- అడ్డుకున్న పోలీసులు... విద్యార్థినేతల అరెస్టు

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర విద్యశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మం త్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాల్సిందేనని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి స్పష్టం చేశారు. ప్రజాసామ్య హక్కుల కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వ నిర్భంద చర్యలను తీవ్రంగా ఖండించారు. దేశ విద్యార్థులు, యువత రక్తం చూ డడమేనా దేశభక్తి అన్ని ప్రశ్నించారు. న్యూఢిల్లీలో ని జంతర్‌మంతర్‌లో కొనసాగుతున్న విద్యార్థి ఉద్యమానికి సంఘీభావంగా మంగళవారం ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్‌యు, ఎఐఎఫ్‌డిఎస్, తెలంగాణ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో 'ఛలో లోక్ భవ న్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు అడ్డుకుని విద్యార్థులను అరెస్టు చేయడాన్ని విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఖైరతాబాద్ చౌరస్తా నుంచి లోక్ భవన్ వైపు ర్యాలీ వెళ్లిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య కొద్ది సేపు తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులను బలవంతంగా పోలీసు వాహనాల్లోకి ఎక్కించడంతో పలువురికి స్వల్పంగా గాయలైయ్యాయి.

అదుపులోకి తీ సుకున్న విద్యార్థి నేతల ను ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రధాన్‌ను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాసే దాక తమ పోరాటం కొనసాగుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మ ణ్,ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు,పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్,ఎఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున అల్టిమేటం ఇచ్చారు. ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులు, యువతపై జరిగిన లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన విద్యార్థి నాయకులందరినీ బేషరతుగా విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. జాతీయ విద్యా విధానం–2020 అమలు పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ దిశగా తీసుకువెళ్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ వంటి ఘటనలు, పరీక్షల నిర్వహణలో అవ్యవస్థ, విద్యార్థుల ఆత్మహత్యలు పెరగడానికి కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు.విద్యార్థి ఉద్యమాలపై దమనకాండను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా ఉద్యమాలను అణచివేయడం ద్వారా విద్యా సంక్షోభాన్ని దాచిపెట్టలేరని పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, పారదర్శకమైన పరీక్షా వ్యవస్థ, ప్రజాస్వామ్య హక్కుల రక్షణ కోసం దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. అశోక్ రెడ్డి, ఎఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళీతో పాటు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా (మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తులను స్వీకరిస్తారు. వాటి విచారణ, పరిష్కార ప్రక్రియ అక్టోబర్ 8 వరకు కొనసాగుతుంది. అనంతరం అక్టోబర్ 12న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. సవరించిన షెడ్యూల్‌ను కచ్చితంగా అమలు చేసేలా ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు, బిఎల్ఓలకు తగిన సూచనలు జారీ చేయాలని ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఎస్ఐఆర్–2026 పురోగతిని అన్ని స్థాయిల్లో నిరంతరం పర్యవేక్షిస్తూ, సవరించిన షెడ్యూల్‌ను విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.




## ప్రణాళికతో ముందుకు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావం రాష్ట్రంలో వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై పడకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తోందని తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతల మార్పులు తెలంగాణలోని వర్షపాతం, చెరువులు, సాగు, తాగునీటి వనరులపై చూపే ప్రభావాన్ని శాస్త్రవేత్తల సహకారంతో అధ్యయనం చేసి కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. వర్షాభావ పరిస్థితులు ఎదురైనా రైతులు నష్టపోకుండా తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామని, వ్యక్తిగతం నుంచి జిల్లా స్థాయి వరకు సంసిద్ధత పెంచేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పశువులు, పక్షులు, అటవీ జంతువులకు నీరు, ఆహార కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం కేవలం వ్యవసాయంపైనే కాకుండా విద్యుత్‌రంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపనుందన్నారు. విద్యుత్ రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. పగటి పూట అందుబాటులో ఉండే సౌర విద్యుత్‌ను గరిష్టంగా వినియోగించడం ద్వారా ప్రభుత్వంపై, ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుందని చెప్పారు. అవసరాలకు అనుగుణంగా థర్మల్ విద్యుత్‌ను వినియోగిస్తూ గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతున్నామని వెల్లడించారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో వర్షాకాలంలో కూడా ఎసిలు, ఫ్యాన్లు, బోర్‌వెల్స్, లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్ల వినియోగం పెరిగి విద్యుత్ డిమాండ్ వేసవి స్థాయికి చేరుకుందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి అవగాహన సదస్సులను జిల్లాల వారీగా నిర్వహించి ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలని అధికారులను డిప్యూటీ సిఎం ఆదేశించారు. కార్యక్రమంలో ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ ఉప్పల్, వివిధ శాఖల ఉన్నతాధికారులు దివ్య దేవరాజన్, గోపి, జితేష్ వి.పాటిల్, ప్రణాళికా శాఖ డైరెక్టర్ రూఫస్ దత్తం తదితరులు పాల్గొన్నారు.

## అప్రజాస్వామికం (మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్షాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం అప్రజాస్వామికమని విమర్శించారు. ప్రధాని నివాసం వద్ద ధర్నా చేస్తున్న రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ సహా పలువురు ఎంపిలను అరెస్టు చేయడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని పేర్కొన్నారు. పేపర్ లీకేజీలు, కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిరసనగా దేశం నలుమూలల నుంచి వేలాదిగా ఢిల్లీకి చేరుకున్న విద్యార్థులు, యువతపై కేసులు నమోదు చేసి బెదిరించడం సమర్థనీయం కాదన్నారు. వారిపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లాఠీచార్జ్‌కు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డి మాండ్ చేశారు. సోనం వాంగ్‌చుక్‌తో కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని, ఆయన నిరాహార దీక్షను ముగించేలా చర్యలు తీసుకోవాలని కూనంనేని కోరారు. అలాగే హైదరాబాద్‌లోని లోక్‌భవన్ వద్ద నిరసన చేపట్టిన వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com